RNI No. APTEL/2006/17880 www.bharathasakthi.com



# భారత శక్తి

తెలుగు దినపత్రిక

VOICE OF INDIAN



Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 19 సంచిక:238 | హైదరాబాద్, గురువారం, 27 మార్చి 2025 | పేజీలు: 12 వెల: 1.00

# ఆన్‌లైన్ బెట్టింగ్ నిరోధానికి సిట్ ఏర్పాటు: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: ఆన్‌లైన్ బెట్టింగ్ అనేది అంతర్జాతీయ నేరంగా మారిందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్, రమ్మీ పట్ల కఠినంగా వ్యవహరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. వీటి నిరోధానికి, నిషేధించేందుకు స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) ఏర్పాటు చేయాలనే నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. ఇలాంటి కేసుల్లో పడే శిక్షలను కూడా సవరించాల్సిన అవసరం ఉందన్నారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు.

"గుట్కా వంటి నిషేధిత పదార్థాల సరఫరా పెరిగిందని తెలుస్తోంది. ఆన్‌లైన్ బెట్టింగ్, రమ్మీ ప్రచారం కల్పించినవారిని విచారించాం. ప్రచారం కల్పించినవారిని విచారించడంతోనే ఈ సమస్యకు పరిష్కారం లభించినట్లు కాదు. సిట్ ఏర్పాటు చేసి వీటికి అడ్డకట్ట వేయాలని నిర్ణయించాం. ఆన్‌లైన్ బెట్టింగ్, నేరాల్లో ఏ రకంగా భాగస్వామ్యం ఉన్నా చర్యలు తప్పవు" అని సీఎం రేవంత్ హెచ్చరించారు.

శాంతిభద్రతల విషయంలో ఎక్కడైనా రాజీపడ్డామా?

"శాంతిభద్రతల విషయంలోనూ కొందరు విమర్శలు చేస్తున్నారు. గత ప్రభుత్వం శాంతిభద్రతల విషయంలో ఎంత ఉదాసీనంగా ఉందో అందరికీ తెలుసు. దిశ ఘటన, న్యాయవాద దంపతుల హత్య వంటివి గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఉదాహరణలు. న్యాయవాద దంపతులను నడిరోడ్డుపై చంపేస్తే ఇప్పటికీ చర్యల్లేవు. సింగరేణి కాలనీలో ఆరేళ్ల బాలిక హత్యాచార ఉదంతంలో ఆనాడు చర్యలు తీసుకోలేదు. మహిళలపై దాడుల విషయంలో గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం నాలుగో స్థానంలో ఉంది. జూబ్లీహిల్స్ పబ్ కేసులో భారాస నాయకుడి కుమారుడే ఉన్నా పట్టించుకోలేదు. ఒక మంత్రి కుమారుడి ప్రమేయం ఉందని అప్పట్లో వార్తలొచ్చాయి. శాంతిభద్రతల విషయంలో దుష్ప్రచారం చేయడం ద్వారా రాష్ట్రానికి రావాల్సిన పెట్టుబడులను అడ్డుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్రం కుప్పకూలిపోయిందని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. రాష్ట్రం దివాలా తీస్తే భారాస నేతలు సంతోషపడతారా? అధికార కాంక్షతో ఎలాంటి అసత్య ప్రచారమైనా చేస్తారా? ఈ 15 నెలల పాలనలో శాంతిభద్రతల విషయంలో ఎక్కడైనా రాజీపడ్డామా?" అని సీఎం ప్రశ్నించారు.

ఆ ఇద్దరి పోటీతో మాకు తలనొప్పి వస్తోంది

"ధరల నియంత్రణలో దేశంలోనే తెలంగాణ నంబర్ వన్‌గా ఉంది. 85 శాతం సొంత పన్నుల వసూళ్లతో రాష్ట్రం అగ్రస్థానంలో ఉంది. కడుపునిండా విషం పెట్టుకొని ఎందుకు మాట్లాడుతారు? గతంలో జానారెడ్డి.. విపక్ష నేతగా ప్రభుత్వానికి సహకరించారు. జానారెడ్డి నెలకొల్పిన సంప్రదాయాన్ని ఎందుకని కొనసాగించరు? ఎన్నికలు ఎప్పుడో 2029లో వస్తాయి.. మీరు కోరుకున్నంతమాత్రాన ఇప్పుడే రావు. భారాస ముఖ్యనేతలు ఇద్దరు పోటీపడి మరీ దుష్ప్రచారం చేస్తున్నారు. ఆ ఇద్దరి పోటీతో మాకు తలనొప్పి వస్తోంది.



నేను పార్టీలకు అతీతంగా ఎమ్మెల్యేలకు అందుబాటులో ఉంటాను. గజ్వేల్ ఎమ్మెల్యే నా దగ్గరకు వచ్చినా మనస్ఫూర్తిగా సహకరిస్తాను. పద్మారావు వచ్చారు.. కొన్ని నియోజకవర్గ పనులు అడిగారు. అక్కడికక్కడే ఇచ్చేశా. విపక్ష ఎమ్మెల్యేలు వచ్చినా పనులు చేసి పెడుతున్నాను" అని సీఎం పేర్కొన్నారు.

# భద్రాచలంలో ఘోర ప్రమాదం

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 26: భద్రాచలంలో ) ఘోర ప్రమాదం జరిగింది. నిర్మాణంలో ఉన్న ఆరు అంతస్థుల భవనం ఒక్కసారిగా నేలమట్టం అయ్యింది. శిథిలాల కింద పలువురు చిక్కుకుపోయారు. వెంటనే రెస్క్యూ అండ్ పోలీసులు బృందాలు అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అయితే అనుమతులు లేకుండా భవన నిర్మాణం చేపట్టినట్లు తెలుస్తోంది. భవనం కింద చిక్కుకుని పలువురు మృతి చెందినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పీఠం పేరుతో ఓ అర్చకుడు మఠం నిర్మించాలని భావించి.. అత్యాశకపోయి ఓ నాశిరకం నిర్మాణం చేయడంతో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. ఓ పాతభవనంపై మరో నాలుగు అంతస్థులు కొత్త భవనాన్ని నిర్మిస్తున్నారు. అమ్మవారి పేరుతో ఓ అర్చకుడు చేస్తున్న వ్యవహారాన్ని గత ఏడాది పంచాయతీ సిబ్బంది అడ్డుకున్నారు. అనుమతులు లేకుండా ఎలా నిర్మిస్తారని ప్రశ్నించడంతో అప్పటి నుంచి నిర్మాణం నిలిచిపోయింది. ఆ సమయంలో పంచాయతీ సిబ్బందితో సదరు వ్యక్తి దురుసుగా ప్రవర్తించినట్లు తెలుస్తోంది. పీఠం పేరుతో పెద్ద ఎత్తున విరాళాలు సేకరించడమే కాకుండా.. అమ్మవారి ఆలయాన్ని నిర్మించి.. ఆ ఆలయం పక్కనే ఈ ఆరు అంతస్థుల భవనాన్ని నిర్మించారు. ఒకవేల భవనం ప్రారంభోత్సవమై భక్తులు ఉండి ఉంటే పెద్దఎత్తున ప్రాణనష్టం జరిగి ఉండేదని ఆందోళన వ్యక్తమవుతోంది. ఈరోజు పనులు జరుగుతున్న సమయంలో భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. అయితే భవన యజమాని భార్య చెబుతున్న



ప్రకారం.. ఇద్దరు కూలీలు మాత్రమే ఉన్నట్లు తెలుస్తోంది. అయితే శిథిలిలాల కింద ఎంతమంది ఉన్నారనేది కొద్దిసేపట్లో బయటపడనుంది. ప్రొక్లైన్‌తో శిథిలాలను తొలగించిన తర్వాత ఎంత మంది ఉన్నారనేదానిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

భద్రాచలం అనేది షెడ్యూల్ ప్రాంతమని అక్కడ ఎలాంటి రిజిస్ట్రేషన్లు ఉండవు. ఎలాంటి అనుమతులు ఉండవు. చాలా పకడ్బందీగా చట్టాలు ఉంటాయి. ఆ చట్టాలన్నీ తుంగలో తొక్కి ఒక అర్చకుడిగా ఉన్న వ్యక్తి భక్తి ముసుగులో పంచాయతీ సిబ్బందితో గత ఏడాది క్రితం దురుసుగా ప్రవర్తించి నిర్మాణం చేపట్టాడు. కానీ ఈరోజు ఆ ఆరు అంతస్తుల నిర్మాణం ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. పీఠం పేరుతో అక్రమ నిర్మాణం చేపట్టిన వ్యక్తిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో తెలియాల్సి ఉంది. ప్రస్తుతం అతడు అందుబాటులో లేడని.. అతడి కోసం పోలీసులు గాలిస్తున్నట్లు సమాచారం.

# సరూర్‌నగర్ అప్సర హత్య కేసులో దోషికి జీవితఖైదు

హైదరాబాద్: మార్చి 26: 2023లో సంచలనం సృష్టించిన అప్సర హత్య కేసులో దోషికి రంగారెడ్డి జిల్లా కోర్టు జీవిత ఖైదు విధించింది. పెళ్లి చేసుకోవాలని అప్సర అడగడంతో పూజారి వెంకటసాయి కృష్ణ ఆమెను దారుణంగా హత్య చేశాడు. శంషాబాద్‌కు కారులో తీసుకెళ్లి హతమార్చాడు.

అనంతరం తన ఇంటి సమీపంలో డ్రైనేజిలో మృతదేహాన్ని పూడ్చి పెట్టాడు. మ్యాన్?హోల్‌ను?మట్టితో నింపి ఆ తర్వాత సిమెంట్‌తో మూసివేశాడు. ఈ కేసు దర్యాప్తు చేసిన సరూర్ నగర్ పోలీసులు సాక్ష్యాలను కోర్టుకు సమర్పించారు. విచారణ జరిపిన కోర్టు సాయికృష్ణకు జీవిత ఖైదు, రూ.10వేల జరిమానా, సాక్ష్యాలు తారుమారు చేసినందుకు మరో ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. మృతురాలి కుటుంబసభ్యులకు రూ.10లక్షలు చెల్లించాలని కోర్టు ఆదేశించింది.

ఆ రోజు ఏం జరిగిందంటే..

2023 జూన్ 3న కోయంబత్తూరు వెళ్దామని అప్సరను నమ్మించాడు. విమాన టికెట్లు కొనుగోలు చేశానని చెప్పాడు. నిజమేననుకున్న ఆమె లగేజీ సహా ప్రయాణానికి సిద్ధమైంది. అప్సర వ్యక్తిగత పనిపై కోయంబత్తూరు వెళ్తోందని.. ఆమెను శంషాబాద్ వద్ద దింపివస్తానంటూ ఆమె తల్లికి వెంకటసాయికృష్ణ చెప్పాడు. ఆరోజు రాత్రి 8.15 గంటలకు సాయికృష్ణ, అప్సర కారులో సరూర్‌నగర్ నుంచి బయల్దేరారు. రాత్రి 10 గంటలకు శంషాబాద్ మండలం రాళ్లగూడలోని ఒక హొటల్‌లో భోజనం చేశారు. రాత్రి 11 గంటలకు సుల్తాన్‌పల్లిలోని గోశాల వద్దకు వెళ్లారు. అక్కడ కొంతసేపు గడిపారు. గోశాలలో బెల్లం దంచే రాయిని ఆమె కంటబడకుండా అతడు కారులోకి చేర్చాడు. 4న తెల్లవారుజామున



3.50 సమయంలో గోశాల సమీపంలోని నర్కుడలో ఓ ఖాళీ వెంచర్ వద్దకు చేరారు. ఆమె నిద్రలోకి జారుకోగానే కారు సీటు కవర్‌ను ఆమె ముఖంపై అదిమి ఊపిరాడకుండా చేశాడు. బెల్లం దంచే రాయితో తల వెనుక భాగంలో పదిసార్లు బలంగా బాదాడు. దీంతో ఆమె మరణించింది. మృతదేహంపై కారు కవర్ కప్పాడు. అక్కడి నుంచి సరూర్‌నగర్‌లోని తన ఇంటికి చేరుకుని.. అక్కడే మృతదేహం ఉన్న కారును పార్కు చేశాడు. ఏమీ తెలియనట్టుగా తన రోజువారీ కార్యక్రమాల్లో నిమగ్నమయ్యాడు.

రెండ్రోజుల పాటు కారులో ఉన్న అప్సర మృతదేహాన్ని కవర్‌లో చుట్టి సరూర్‌నగర్‌లోని బంగారు మైసమ్మ ఆలయ సమీపంలోని మ్యాన్‌హోల్‌లో పడేశాడు. దుర్వాసన వస్తోందంటూ ఎల్బీనగర్ నుంచి అడ్డా కూలీలను పిలిపించాడు. రెండు ట్రక్కుల మట్టిని తీసుకొచ్చి మ్యాన్‌హోల్‌ను కప్పి సిమెంట్‌తో పూడ్చించాడు.

# రామనవమికి పంబన్ బ్రిడ్జిని ప్రారంభించనున్న మోదీ

న్యూఢిల్లీ: ఏప్రిల్ 6వ తేదీ శ్రీరామ నవమి ( సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రామేశ్వరంలోని రామనాథస్వామి ఆలయం సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. అధునాతన ఇంజనీరింగ్ అద్భుతంగా నిర్మించిన కొత్త పంబన్ బ్రిడ్జి (ని



ప్రారంభిస్తారు.

తమిళనాడులోని సముద్ర తీరంలో ఉన్న చారిత్రక పంబన్ బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకోవడంతో ఆ స్థానంలో అదే పేరుతో కొత్త పంబన్ బ్రిడ్జిని నిర్మించారు. ఆధునిక ఇంజనీరింగ్‌తో ప్రజలను, ప్రదేశాలను అనుసంధానిస్తూ వర్టికల్ లిఫ్ట్ విధానంలో భారత్‌తో నిర్మించి తొలి రైల్వే బ్రిడ్జి ఇదే కావడం విశేషం. వేగం, భద్రత, ఆవిష్కరణల కోసం రూపొందించిన బ్రిడ్జి ఇదంటూ రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఇటీవల ఆ ఫోటోలను విడుదల చేశారు. దేశంలోని ప్రధాన భూభాగాన్ని తమిళనాడులోని రామేశ్వరం ద్వీపానికి ఈ బ్రిడ్జి కలుపుతుందని ఆయన తెలిపారు. ఈ వంతన మధ్యలో భారీ ఓడలు వచ్చినప్పుడు తెరుచుకునేలా ప్రత్యేక గేట్లు కూడా ఏర్పాటు చేశారు.

కాగా, కొత్త పంబన్ బ్రిడ్జి ప్రారంభం కాగానే పాత వంతెనపై రాకపోకలు నిలిచిపోనున్నాయి. ఈ ప్రాజెక్టుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2019 నవంబర్‌లో శంకుస్థాపన చేశారు. 2020 ఫిబ్రవరిలో నిర్మాణం ప్రారంభమైంది. కోవిడ్ కారణంగా జాప్యం చోటచేసుని ఏప్రిల్‌లో ప్రారంభానికి ముస్తాబవుతోంది.

# సభలో నన్ను మాట్లాడనీయడం లేదు: స్పీకర్‌పై రాహుల్ తీవ్ర ఆరోపణ

న్యూఢిల్లీ: లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా తనను సభలో మాట్లాడేందుకు అనుమతించడం లేదని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ( అన్నారు. సభా కార్యక్రమాలు అప్రజ్వామిక విధానంలో సాగుతున్నాయని, కీలక అంశాలను ప్రస్తావించేందుకు తాను పదేపదే విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకోవడం లేదని చెప్పారు. పార్లమెంటు వెలుపల మీడియాతో బుధవారంనాడు ఆయన మాట్లాడుతూ, అసలేం జరుగుతోందో అర్థం కావడం లేదని,



మాట్లాడేందుకు అవకాశం ఇమ్మని ఆయనను (స్పీకర్) కోరుతున్నప్పటికీ అనుమతించడం లేదని చెప్పారు. ఇది సభ నడిపే పద్ధతి కాదన్నారు.

మహాకుంభమేళా గురించి ఇటీవల ప్రధాని మాట్లాడినప్పుడు తాను నిరుద్యోగం గురించి మాట్లాడాలనుకున్నాననీ, కానీ పదేపదే అడ్డుకట్ట వేశారని రాహుల్ వాపోయారు. "నేనేమీ చేయలేక కూర్చుండి పోయాను. ఇప్పటికీ నేను మాట్లాడేందుకు ఎప్పుడు లేచి నిలబడినా మాట్లాడకుండా అడ్డుకుంటున్నారు. ఇక్కడ ప్రజాస్వామ్యానికి చోటు లేదు" అని అన్నారు.

దీనికి ముందు, బుధవారం సభా కార్యక్రమాల సమయంలో స్పీకర్ ఓంబిర్లా రాహుల్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ, సభ గౌరవాన్ని కాపాడేందుకు నిబంధనలను పాటించాలని సూచించారు. సభ్యుల ప్రవర్తన సభా ప్రమాణాలకు అనుగుణంగా ఉండటం లేదని పలుమార్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఈ సభలో తండ్రీకూతురు, తల్లీ కుమార్తె, భార్యాభర్తలు సభ్యులుగా ఉన్నారు. ఇలాంటి సందర్భాల్లో ప్రతిపక్ష నేత 394 నిబంధన ప్రకారం నడుచుకుంటారని అశిస్తున్నానని అన్నారు. కాగా, స్పీకర్ ఏ సందర్భంలో ఈ సూచన చేశారనది మాత్రం వెంటనే తెలియలేదు.

కాగా, స్పీకర్ తన గురించి వ్యాఖ్యలు చేసి దానిపై మాట్లాడేందుకు తనకు అవకాశం ఇవ్వకుండానే సభను వాయిదా వేశారని రాహుల్ గాంధీ తెలిపారు. గత వారం కూడా తనకు మాట్లాడేందుకు స్పీకర్ అవకాశం ఇవ్వలేదని చెప్పారు. ప్రతిపక్ష నాయకుడికి సభలో ప్రసంగించే అవకాశం ఇవ్వడం సంప్రదాయని గుర్తు చేసారు.

# గంజాయి లేడీ డాన్ సంగీత సాహు అరెస్ట్

%హైదరాబాద్: పలు గంజాయి కేసుల్లో నిందితురాలు.. గత కొన్ని రోజులుగా తప్పించుకొని తిరుగుతున్న గంజాయి లేడీ డాన్ సంగీత సాహును ఎక్సైజ్ ఎస్టీఎఫ్ పోలీసులు అరెస్టు చేశారు. ఒడిశాలోని కుర్ధా జిల్లా కాళీకోట్ గ్రామానికి చెందిన సంగీత సాహు నాలుగేళ్ల క్రితం గంజాయి దందాలోకి దిగింది. భువనేశ్వర్‌కు దగ్గరగా ఉండటంతో అనేక రాష్ట్రాల గంజాయి వ్యాపారులతో మాట్లాడుతూ.. వారికి గంజాయి సరఫరా చేస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. గతంలో హైదరాబాద్‌లోని ధూల్‌పేటలో ఇద్దరికి 41.3 కేజీల గంజాయి సరఫరా చేస్తూ పట్టుబడింది. ధూల్‌పేటలో శీలాబాయ్, నేహాబాయ్, ఇష్కాసింగ్‌తో పాటు మరి కొందరికి గంజాయి సరఫరా చేసినట్టు పట్టుబడిన నిందితులు ఇచ్చిన వాంగ్మూలంతో ఆమెపై ఎక్సైజ్ పోలీసులు కేసులు నమోదు చేశారు. ఆమెపై నగరంలో మొత్తం ఐదు కేసులు ఉన్నట్టు పోలీసులు తెలిపారు. సంగీత సాహు.. ఇన్‌స్టాగ్రామ్‌లో సినీ నటి మాదిరిగా వీడియోలు పోస్టు చేస్తుంటుంది. గంజాయి వినియోగం ఎక్కడ ఉంటే అక్కడికి వెళ్లి వ్యాపారులతో ఒప్పందాలు చేసుకుంటుంది.



భారత శక్తి
VOICE OF INDIAN

## పొంచి ఉన్న ఆయిల్ సంక్షోభం...

పశ్చిమాసియాలో ఎలాంటి సంఘర్షణలు ఎదురైనా భారతీయ వాణిజ్య రంగానికి సంక్షోభం తప్పదు. చమురు, సహజ వాయువు, ఎరువులు, తదితర ముఖ్య అవసరాలు సరిగ్గా సరఫరా కాక, వాణిజ్యంలోనే కాదు, ప్రజల జీవన విధానంలో కూడా ఒడిదుడుకులు ఎదురవుతుంటాయి. ముఖ్యంగా చమురు సంక్షోభం సంభవిస్తే అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధర ఒక్కసారిగా పెరిగిపోతుంది. మనకు ఎఉ?కవగా చమురును, గ్యాస్‌ను సరఫరా చేసేది రష్యా, ఇరాన్ దేశాలే. ఆయా దేశాల నుంచి సరఫరాకు ఆటంకాలు ఏర్పడితే మన దేశం భారీగా అంతర్జాతీయ మార్కెట్‌కు మూల్యం చెల్లించుకోవలసి వస్తుంది. ఈ పరిస్థితుల్లో ఈ ఏడాది ఫిబ్రవరిలో రష్యా నుంచి మనదేశానికి ముడి చమురు దిగుమతులు రోజువారీ సరాసరిన (మిలియన్ పెర్ డే) 1.41 మిలియన్ బ్యారెళ్ల వంతున తగ్గిపోవడం ఆందోళన కలిగించే అంశం. జనవరి నాటికి రోజువారీ 1.49 మిలియన్ బ్యారెళ్ల వంతున తగ్గిపోగా అంతకన్నా ఇప్పుడు తగ్గడం గమనార్హం. కార్గో ట్రాకింగ్ ఏజెన్సీ వోర్టెక్స్ వివరాల ప్రకారం ఈ ఏడాది ఫిబ్రవరిలో రోజువారీ మొత్తం 4.77 మిలియన్ బ్యారెళ్లుగా చమురు దిగుమతులు జరిగాయి. జనవరిలో రోజువారీ మొత్తం 4.76 మిలియన్ బ్యారెళ్ల చమురు దిగుమతులు కాగా పెద్దగా మార్పు లేదు. అయితే ఈ మార్చి, ఏప్రిల్ నెలల్లో మరింతగా చమురు దిగుమతులు క్షీణిస్తాయని వోర్టెక్స్ చెబుతోంది. దీనికి కారణం అమెరికా ఆఫీస్ ఆఫ్ ఫారెస్ అసెట్స్ కంట్రోల్ (ఒఎఫ్ఎసి) జనవరి 10 న విధించిన ఆంక్షలే.అయితే ఈ లోటును పశ్చిమాసియా దేశాలు భర్తీ చేస్తాయని ఎపిఎసి అనాలిసిస్ వోర్టెక్స్ అధినేత ఇవాన్ మేథ్యూ వెల్లడించారు. రష్యా చమురు ఉత్పత్తిదారులైన గాజ్‌ప్రోమ్ నెఫ్ట్, సర్గుట్ నెఫ్ట్ గ్యాస్‌లతో పాటు దాదాపు 180 ట్యాంకర్లపై తాజాగా జనవరి 10న అమెరికా ఆంక్షలు విధించింది. రష్యాకు రెవెన్యూ రాకుండా అడ్డుకోవడమే దీని వెనుక ఉన్న ఆంతర్యం. ఉక్రెయిన్‌పై యుద్ధం సాగించడానికే రష్యా ఈ ఆదాయాన్ని ఖర్చు పెడుతోందని అమెరికా ఆరోపిస్తోంది. ఫలితంగానే రష్యా చమురు కార్గో నౌకలు ఫిబ్రవరి 27 నాటికి అమెరికా ఆంక్షల సుడిలో చిక్కుకోవలసి వచ్చింది. 2024 మొదటి ఏడు మాసాలు (జనవరి జులై) ఇజ్రాయెల్, జోర్డాన్, లెబనాన్ దేశాలకు భారత్ నుంచి వాణిజ్యంలో సంఘర్షణలు తప్పలేదు. భారత్ నుంచి ఇజ్రాయెల్‌కు 63.3 శాతం వరకు ఎగుమతులు పతనమయ్యాయి. దీని విలువ 1.3 బిలియన్ డాలర్లు. ఆర్గానిక్ కెమికల్స్, పెట్రోలియం ఉత్పత్తులు, డైమండ్స్, ఎగుమతులకు గండి పడిందని వాణిజ్య విభాగం వెల్లడించింది. అలాగే జోర్డాన్‌కు ఎగుమతుల్లో 38 శాతం అంటే 638 మిలియన్ డాలర్ల వరకు, లెబనాన్‌కు 7% అంటే 198 మిలియన్ డాలర్ల వరకు ఎగుమతులు పతనమై భారత్‌కు నష్టాలు సంభవించాయి. 2024 వరకు అంతకు ముందు ఏడేళ్లుగా ఏటా 3% వంతున ముడిచమురు ఉత్పత్తిలో తగ్గుదల కనిపిస్తోంది. ఉత్పత్తిలో తగ్గుదల ఉంటున్నా వినియోగం పెరుగుతుండడంతో భారత్ దిగుమతులపై ఎక్కువగా ఆధారపడవలసి వస్తోంది. 2017 నుంచి 2024 వరకు 86 నుంచి 89 శాతం వరకు దిగుమతులపైనే దేశం ఆధారపడవలసి వచ్చింది. భారత ఇంధన వినియోగ చిత్ర 2024 ఆర్థిక సంవత్సర నివేదికలో ఇదో భాగం. దేశం ఇంధనాన్ని సేకరించడం, ఉత్పత్తి, వినియోగం తాలూకు ఆమూలాగ్ర డేటాను ఈ నివేదిక అందిస్తోంది. కేంద్ర ఇంధన మంత్రిత్వశాఖ నేతృత్వంలో బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫీషియెన్సీ (బిఇఇ)ఈ నివేదికను రూపొందించింది. 2024 ఆర్థిక సంవత్సరంలో మొత్తం సరఫరా అయిన ఇంధనం 910 మిలియన్ టన్నులు కాగా, ఇందులో బొగ్గు నుంచి 60%, చమురు నుంచి 28%, గ్యాస్ నుంచి 7%, శిలాజేతర వనరుల నుంచి 5% సరఫరా అయింది. స్వదేశీ చమురు ఉత్పత్తి 2017 ఆర్థిక సంవత్సరంలో 36 మిలియన్ టన్నులు కాగా, 2024 నాటికి 29.4 మిలియన్ టన్నులకు తగ్గిపోయింది. వార్షిక రేటు 3% వరకు తగ్గుతూ వస్తోంది. ఈ తగ్గుదలకు అనేక కారణాలు దోహదం చేస్తున్నాయి. ఈ కొరతను అధిగమించడానికి కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు 2019లో హైడ్రోకార్బన్ ఎక్స్‌ప్లొరేషన్ అండ్ లైసెన్సింగ్ (హెచ్ఇఎల్‌పి) వంటి ప్రక్రియను అమలుచేసే చర్యలను తీసుకుంది.ఎంపికైన చమురు క్షేత్రాల్లో తగిన సాంకేతిక విధానాలు అమలు చేసి చమురు ఉత్పత్తిని సాధించడమే ఈ విధానం లక్షం. చిన్న, మధ్యతరహా స్థాయిలో చమురు పరిశోధనలను కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ద్వారా ఆయా సంస్థలను ప్రోత్సహిస్తోంది. ప్రభుత్వ నిర్వహణలోని ఒఎన్‌జిసి, ఆయిల్ ఇండియా సంస్థలు క్రమంగా 65 శాతం, 11 శాతం వరకు 20232024 సంవత్సరంలో చమురును అందించగలిగాయి. మిగతా 24 శాతం ముడిచమురు ఉత్పత్తి ప్రొడక్షన్ షేరింగ్ కాంట్రాక్ట్ (పిఎస్‌సి) లేదా రెవెన్యూ షేరింగ్ కాంట్రాక్ట్ (ఆర్ఎస్‌సి) ద్వారా లభించింది. 2024 ఏప్రిల్ 1 నాటికి సమతుల్యతలో తిరిగి పొందగలిగిన చమురు నిల్వలు 671.4 మిలియన్ టన్నులుగా భారత్ అంచనా వేసింది. అంతకు ముందు సంవత్సరం నాటి 669.47 మిలియన్ టన్నుల నిల్వలతో పోల్చుకుంటే 0.3 శాతం ఎక్కువ.స్వదేశీ చమురు ఉత్పత్తి కన్నా డిమాండ్ ఎక్కువగా ఉండడంతో చమురు దిగుమతులపై ఆధారపడడం మరింత ఎక్కువ అవుతుందని ఫిచ్ రేటింగ్స్ అంచనా వేస్తోంది. ప్రపంచంలోనే మూడో అతి పెద్ద చమురు దిగుమతి దారైన భారత్ 2024లో 234 మిలియన్ టన్నుల చమురును సేకరించుకోగలిగింది. సరఫరా కావలసి చమురులో 86% 2017లోను, 89% 2024 లోనూ దిగుమతి చేసుకోవలసి వచ్చింది. కొవిడ్ మహమ్మారి సమయంలో చమురు దిగుమతులు తాత్కాలికంగా 202122 లో తగ్గాయి. భారీ స్థాయిలో దిగుమతి చేసుకున్నామంటే రిఫైన్డ్ పెట్రోలియం ఉత్పత్తుల వినియోగం భారీగా పెరుగుతున్నట్టే భావించక తప్పదు. 2024 ఏప్రిల్ 1నాటికి ఏడాదికి 256.8 మిలియన్ టన్నుల చమురును రిఫైనింగ్ చేసే సామర్థ్యం భారత్‌కు ఉందని తేలింది. దీంతో ప్రపంచంలో అమెరికా, చైనా, రష్యా తరువాత నాలుగో రిఫైనర్‌గా భారత్ నిలుస్తోంది.

# గుంటూరు...తర్వాత నెల్లూరు లీడర్స్

గుంటూరు, మార్చి 26,

వైసీపీ నేతలపై వరసగా కేసులు నమోదవుతున్నాయి. గత ప్రభుత్వంపై జరిగిన అక్రమాలను బయటకు తీస్తూ ముఖ్యనేతలపై పోలీసులు కేసు నమోదు చేస్తున్నారు. తొలుత రేషన్ బియ్యం కేసులో మచిలీపట్నానికి చెందిన పేర్ని నానితో పాటు అతని కుటుంబ సభ్యులపై కేసులు నమోదయ్యాయి. దీంతో ఆయన న్యాయస్థానానికి వెళ్లి ముందస్తు బెయిల్ తెచ్చుకున్నారు. రేషన్ గోదాములో బియ్యం మాయమయిన ఘటనలో పేర్ని నాని కోటిన్నరకు పైగా ప్రభుత్వానికి చెల్లించడంతో పాటు ఆయన కూడా నిందితుడిగా ఉన్నారు. పేర్ని నాని మచిలీపట్నంలోని తన రైస్ మిల్లులో దాచి ఉంచిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా విక్రయించారన్న ఆరోపణలపై ఆయనపై కేసు నమోదు చేసింది.. గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ఆయనపై వరసగా కేసులు నమోదవుతున్నాయి. సత్యవర్ధన్ ను కిడ్నాప్ చేశారన్న కారణంగా ఆయనను అరెస్ట్ చేశారు. దాదాపు నెలరోజులకు పైగానే ఆయన విజయవాడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. వరసగా కేసులు నమోదు అవుతుండటంతో వంశీ ఇప్పట్లో బెయిల్ పై బయటకు వస్తారన్న నమ్మకం కూడా లేదు. అంతకు ముందు బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్ ను కూడా పలు కేసుల్లో అరెస్ట్ చేసి జైలుకు పంపారు. అయితే నందిగం సురేష్ మాత్రం కొద్ది రోజుల క్రితం జైలు నుంచి బెయిల్ పై బయటకు వచ్చారు ఇక గత ప్రభుత్వ హయాంలో ఫిలిం ఫెడరేషన్ కార్పొరేషన్ ఛైర్మన్ గా ఉన్న పోసాని కృష్ణమురళిని అరెస్ట్ చేశారు. సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెట్టారంటూ, చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ లపై అనుచిత వ్యాఖ్యలపై కేసు నమోదు చేసిన పోలీసులు పోసానిని గత నెల 21వ తేదీన అరెస్ట్ చేశారు. పోసానిపై పదిహేడు కేసులు నమోదయ్యాయి. కొన్నింటిలో ముందస్తు బెయిల్, మరికొన్నింటిలో షరతులతో కూడిన బెయిల్ తీసుకుని పోసాని రెండు రోజుల క్రితమే జైలు నుంచి బయటకు వచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆయనపై నమోదయిన కేసులు ఇప్పుడు కోర్టుల్లో నడుస్తున్నాయి. ఇక మాజీ మంత్రి విడదల రజనీపై కూడా తాజాగా ఏసీబీ కేసు నమోదయింది. ఆమె స్టోన్ క్రషర్ యజమాని నుంచి 2.26 కోట్ల రూపాయలు వసూలు చేశారంటూ ఫిర్యాదు అందడంతో రజనీతో పాటు మరికొందరిపై కేసు నమోదయింది. ఎప్పుడైనా విచారణకు పిలిచి అరెస్ట్ చేసే అవకాశాలున్నాయంటున్నారు. తాజాగా మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిపై కేసు నమోదు అయింది. కోట్ల విలువైన క్వార్జ్ దోపిడీ చేశారని ఫిర్యాదు అందడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. పొదలకూరు మండలం తాటిపర్తిలోని రుస్తుం మైన్స్‌లో లీజు సమయం ముగిసినా క్వార్జ్ తరలించారని ఆరోపణల నేపథ్యంలో కేసు నమోదయింది. గనుల శాఖ అధికారుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.ఈ కేసులో ఏ4గా కాకాణి గోవర్ధన్‌రెడ్డి 120బీ, 447, 427, 379, 220, 506, 129తో పాటు ఎక్స్‌ప్లోజివ్ సబ్‌స్టెన్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. ఇక నెల్లూరు నుంచి చిత్తూరు వెళ్లడమే తరువాయి అంటున్నారు. అక్కడ ఇప్పటికే కీలక నేతలపై మద్యంతోపాటు పలు కేసులు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. మొత్తం మీద వరస కేసులతో వైసీపీ నేతల్లో దడ మొదలయిందనే చెప్పాలి. ఎప్పుడు ఎవరు అరెస్ట్ అవుతారన్న ఉత్కంఠ నెలకొంది.

# తమ్ముళ్ల వాయిస్ ఏదీ

విజయవాడ, మార్చి 25

లుగుదేశం పార్టీలో సీనియర్ నేతలు యాక్టివ్ గా లేని లోటు స్పష్టంగా కనిపిస్తుంది. అధికారంలో లేనప్పుడే నయం. అప్పటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళమెత్తిన సీనియర్ నేతలు గత ఎన్నికల్లో టిక్కెట్లు రాక కొందరు, మంత్రి పదవులు దక్కక మరికొందరు మూగవోయారు. అందరూ జూనియర్ నేతలు కావడంతో ప్రతిపక్షం నుంచి వచ్చే విమర్శలకు సరిగా కౌంటర్ ఇవ్వలేకపోతున్నారు. కొందరు తమకేం పట్టిందని వ్యవహరిస్తుండగా, మరికొందరు ఏం మాట్లాడితే ఏం జరుగుతుందోనన్న భయంతో జూనియర్ నేతలు గళం విప్పడం లేదు. దీంతో టీడీపీ నేతల నుంచి గట్టి కౌంటర్ ఇవ్వడం లేదన్న విమర్శలు ఆ పార్టీ క్యాడర్ నుంచే వినిపిస్తుండటం విశేషం. రాజకీయాల్లో అనుభవం చాలా ముఖ్యం. ఎవరికి ఏ రకమైన సమాధానం చెప్పాలన్నది డక్కీమొక్కీలు తిన్న నేతలకు మాత్రమే తెలుస్తుంది. కొత్తగా తొలిసారి ఎన్నికయిన వారిలో కొందరు మినహాయించి మిగిలిన వారిలో పార్టీ తరుపున కౌంటర్ ఇవ్వాలన్న స్పృహ కూడా లేదని టీడీపీ సోషల్ మీడియాలో సొంత క్యాడర్ నుంచి విమర్శలువినిపిస్తున్నాయి. ఉండటానికి ఇరవై మందికిపైగా మంత్రులున్నప్పటికీ ఘాటుగా రిప్లై ఇచ్చేవారు ఒకరిద్దరు మినహాయించి ఎవరూ మాట్లాడటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఉదాహరణకు చిలకలూరిపేటమాజీ ఎమ్మెల్యే విడదల రజనీపై కేసు నమోదు చేసిన సంఘటనపై ఆమె అనేక ఆరోపణలు చేశారు. రెడ్ బుక్ రాజ్యాంగమని, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుపై కూడా విమర్శలు చేశారు కానీ టీడీపీ నుంచి ఒక్క మంత్రి కూడా దీనిపై స్పందించలేదు. రజనీ చేసిన తప్పులను ఎండగట్టే ప్రయత్నం చేయలేదు. చివరకు ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు నేరుగా రంగంలోకి దిగి తాను కౌంటర్ ఇచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రత్తిపాటి పుల్లారావు స్పందించినప్పటికీ దానికి అంతగా ప్రాచుర్యం లభించలేదు. మంత్రులు ఇంత మంది ఉండి ఏం చేస్తున్నారన్న ప్రశ్నను తెలుగు తమ్ముళ్లు లేవనెత్తుతున్నారు. ఏసీబీ కేసు నమోదు చేయడంతో పాటు ఐపీఎస్ అధికారి చేసిన ఫిర్యాదు ఉన్నప్పటికీ ధీటుగా బదులివ్వలేని పరిస్థితి అమాత్యులకు ఎందుకు ఉందని నిలదీస్తున్నారు. ఇలాగే కొనసాగితే ప్రతిపక్ష విమర్శలను ప్రజలు నమ్మే అవకాశముందన్న హెచ్చరికలు కూడా వినిపిస్తున్నాయి... దీంతో పాటు వైసీపీ నేతలు సూపర్ సిక్స్ పై విపరీతమైన నెగిటివ్ ప్రచారాన్ని ప్రారంభించారు. ఒక్కొక్కటిగా అమలు చేస్తామని చంద్రబాబు చెబుతున్నప్పటికీ ఆ విషయాన్ని ప్రజల్లో చేరవేయడంలో మంత్రులు ఎవరూ సక్సెస్ కాలేదంటున్నారు. అకాల వర్షాలతో రైతులు ఇబ్బందిపడిన విషయంపై వెంటనే చంద్రబాబు రియాక్ట్ అయ్యారు. ఆదుకుంటామని చెప్పారు.కానీ మంత్రులు ఎవరూ దీనిపై పెద్దగా స్పందించకపోవడం కూడా తమ్ముళ్ల ఆగ్రహానికి కారణమయింది. ప్రజల్లో వ్యతిరేకత ప్రబలే విధంగా, వైసీపీ అధినేత జగన్ కు హైప్ లభించేలా ప్రచారం జరుగుతున్నా దానిని పట్టించుకోకుండా అత్యధిక శాతం మంత్రులు మౌనంగా ఉండటాన్ని తప్పుపడుతున్నారు. ఒకరిద్దరు మంత్రులు మినహాయించి ఎవరూ యాక్టివ్ గా లేకపోవడం పార్టీలోనే విమర్శలకు తావిస్తుంది. చంద్రబాబు మరోసారి కేబినెట్ సమావేశంలో క్లాస్ పీకాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలుగు తమ్ముళ్లు

## హీటెక్కుతున్న పాలిటిక్స్...

హైదరాబాద్, మార్చి 26, (

తెలంగాణలో అటు బీఆర్ఎస్ ఇటు బీజేపీ మధ్యలో కాంగ్రెస్ ఇలా ప్రధాన పార్టీలు ప్రత్యర్థి పార్టీల నేతలపై వరుస ఫిర్యాదులు చేస్తుండటంతో రాజకీయ వేడి మరింత పెరిగింది. తాజాగా బీఆర్ఎస్ సోషల్ మీడియా యాక్టివిస్టులు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌పై అభ్యంతరకర పోస్టులు పెడుతున్నారని సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు బీజేపీ నేతలు.. తప్పుడు పోస్టులతో ప్రజలను బీఆర్ఎస్ సోషల్ మీడియా యాక్టివిస్టులు తప్పుదోవ పట్టిస్తున్నారని.. వారి పోస్టులపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొంది బీజేపీ. మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలతో రెండు పార్టీల మధ్య వివాదం తీవ్రమైంది.ఈ వ్యాఖ్యలపై మండిపడుతున్న బీఆర్ఎస్ నాయకులు.. కేసీఆర్‌పై బండి సంజయ్ నిరాధార ఆరోపణలు చేస్తున్నారన్నారని ఓయూ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కేంద్ర సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్ స్థాయి మరచి అసత్య ఆరోణలు చేస్తున్నారని మండిపడ్డారు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్.

దొంగ నోట్ల ప్రెస్‌పై గతంలోనూ కేసీఆర్‌పై ఆరోపణలున్నాయని తాజాగా బండి సంజయ్ వ్యాఖ్యలను మరోసారి సమర్థించారు బీజేపీ నేత కానం వెంకటేశ్వర్లు..అంతకుముందు కేసీఆర్ పై గవర్నర్‌కు గజ్వేల్ కాంగ్రెస్ నేతలు ఫిర్యాదు చేశారు .. గజ్వేల్ ఎమ్మెల్యేగా ఉన్న కేసీఆర్ అసెంబ్లీకి హాజరుకావడం లేదని, ప్రజా సమస్యలు పట్టించుకోవడం లేదని ఆయన శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలంటూ గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు.గతంలో ఎన్నడూ లేని విధంగా ఫిర్యాదులతో తెలంగాణ పాలిటిక్స్ హీటెక్కుతున్నాయి.. మొత్తానికి పార్టీల ఫిర్యాదుల పరంపరకు ఎప్పుడు బ్రేక్ పడుతుందో తెలియాలంటే.. వేచి చూడాల్సిందే అంటున్నాయి పొలిటికల్ వర్గాలు..

## బరువెక్కిన గుండెలతో పార్టీ కి మరియు ఈ ట్విట్టర్ కి స్వస్తి ఎవర్ని అయినా నా ఈ ప్రయాణం లో బాధించి?

కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. కూటమి అంటే ఇక్కడ టీడీపీ, జనసేన, బీజేపీ అని చెప్పుకోవాలి. కానీ క్షేత్ర స్థాయిలో కూటమి అంటే టీడీపీ ప్రభుత్వం మాత్రమే అనే అర్థం ఉందని ముఖ్యంగా జనసైనికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలు జనసేన అధికార పార్టీనా, ప్రతిపక్షమా అనేది అర్థం కావడంలేదని అంటున్నారు. ఎన్నికలకు ముందు ఎన్నో అవమానాలు భరించామని, ఎన్నికల తర్వాత కూటమి అధికారంలోకి వచ్చాక కూడా జనసైనికుల తలరాత మారలేదని వారు ఆరోపిస్తున్నారు.అసలు జనసేన ఎదుగుదలను పవన్ కల్యాణ్ పట్టించుకుంటున్నారో లేదో అనే అనుమానం వస్తోందని తన లేఖలో ప్రస్తావించారు సాయిబాబా అనే జనసైనికుడు. ఇటీవల తిరువూరు నియోజకవర్గ జనసేన కోఆర్డినేటర్ ను వివరణ కోరుతూ జనసేన ఒక బహిరంగ నోటీసు ఇచ్చింది. తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుతో తనకు ప్రాణహాని ఉందని మీడియాతో చెప్పినందుకు వివరణ కోరింది. అలాంటి వ్యవహారం ఏదైనా ఉంటే ముందు పార్టీ దృష్టికి తీసుకురావాలి కానీ, మీడియాకెక్కడం మంచిది కాదని సూచించారు నేతలు. అదే సమయంలో 48 గంటల్లోగా ఎక్స్ ప్లెనేషన్ ఇవ్వాలని ఆదేశించారు. ఈ ఆదేశాలను కూడా సాయిబాబా పరోక్షంగా తన లేఖలో ప్రస్తావించారు. అసలు జరిగిందేంటో తెలుసుకోవాలనే ఆలోచన ఉంటే.. సదరు తిరువూరు ఇన్ చార్జ్ ని పిలిపించి మాట్లాడేవారని, కానీ బహిరంగంగా నోటీసులివ్వడం ద్వారా ఆయన్ని చులకన చేశారని అన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా జనసేన కార్యకర్తల అరెస్ట్ లు ఆగలేదని, అయినా కూడా పార్టీ పట్టించుకోవడంలేదని అంటున్నారు సాయిబాబా. ప్రభుత్వం కేసులు పెట్టినా తమకు పెద్దగా బాధలేదని, అయితే పార్టీ ఆఫీస్ పట్టించుకోకపోవడం అత్యంత దారుణం అని అన్నారు. వైసీపీ వాళ్లు ఎన్ని విమర్శలు చేసినా జనసేన పార్టీ అధికారికంగా ఖండించడం లేదని ఆయన వాపోయారు. అదే సమయంలో కొంతమంది టీడీపీ వాళ్లు కూడా వైసీపీ వారితో చేరి పవన్ కల్యాణ్ పై లేనిపోని ఫేక్ ప్రచారం చేస్తున్నారని అన్నారాయన. తాను జనసేనకు, ట్విట్టర్ కి కూడా గుడ్ బై చెప్పేస్తున్నాని అన్నారు సాయిబాబా.పార్టీని కార్యకర్తలు పట్టించుకున్నంతగా, పార్టీ కార్యకర్తల్ని పట్టించుకోవట్లేదని తన లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు సాయిబాబా. పార్టీ బాగుంటే సరిపోదని, పార్టీలోని కార్యకర్తలు కూడా బాగుండాలని ఆయన సూచించారు. ఇన్నాళ్లూ పార్టీకోసం సిన్సియర్ గా కష్టపడ్డామని, ఆత్మాభిమానం చంపుకొని ఉండాలంటే తమ వల్ల కావడం లేదని అన్నారు. అధికారంలోకి వచ్చాక ఒక్కసారయినా పవన్ కల్యాణ్ పార్టీ నాయకులతో, కార్యకర్తలతో మీటింగ్ పెట్టారా అని ప్రశ్నించారు. ఇకనైనా ఆ పని చేయాలని, వారిలోని అసంతృప్తి ఏంటో తెలుసుకోవాలని సూచించారు.సాయిబాబా అనే ట్విట్టర్ అకౌంట్ నుంచి పోస్ట్ అయిన ఈ లెటర్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. చాలామంది ఈ లెటర్ పై సానుకూలంగా స్పందిస్తున్నారు. జనసేనలో ప్రస్తుతం ఇదే పరిస్థితి ఉందని, అధిష్టానం కాస్త దృష్టిపెట్టాలని వారు సూచిస్తున్నారు.

## పిర్యాదుదారుడే నిందితుడు

సికింద్రాబాద్

సుడో పోలీస్ కేసును 30 గంటల్లోనే సికింద్రాబాద్ బోయిన్ పల్లి పోలీసులు ఛేదించారు..ఫిర్యాదు దారుడే అసలు నిందితుడని తెల్చడంతో పాటు సహకరించిన అతడి స్నేహితుడ్ని కూడా కటకటాల వెనక్కు నెట్టారు. 5లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు.గ్లొబల్ కంపెనీ లో ఉద్యోగం చెస్తున్న అరుణ్ కుమర్ కు కంపేనీ డబ్బును కాజేయలని దుర్బుద్ధి పుట్టింది. మరో బ్రాంచిలో డబ్బులు డెలివరీ ఇచ్చే సమయంలో పోలీసులు తనిఖీ పేరుతో ఆపి బ్యాగు తీసుకోని వెళ్ళిపోయరంటూ కట్టుకథ అల్లి బోయిన్ పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.. దీంతో సుడో పోలీస్ గా అనుమనించిన పోలీసులు దర్యాప్తు జరపగా. సీసీ కెమెరాల్లో ఎటువంటి అనవాళ్ళు లభించకపోవడంతో..అతని మోబైల్ ను పరిశీలించిన అందులో కూడ ఎటువంటి అనుమానం కలగకుండా కాల్ డేటా ను డిలీట్ చేశాడు. దీంతో కాల్ లిస్ట్ తెప్పించి పరిశీలించిన పోలీసులు. సంఘటనకు ముందు అతని మిత్రుడు సమరేంద్ర తో మాట్లాడినట్టు గుర్తించి..అతని ఇంటికి వెళ్ళి తనిఖీ చేయగా..ఐదు లక్షలు లభ్యమయ్యాయి..దీంతో సూత్రదారి అరుణ్ తో పాటు తన ఇంట్లో స్వాహ నగదును దాచుకున్న సమరేంద్ర ను ఆరెస్ట్ చేసి ఐదు లక్షలు నగదు పోలీసులు స్వాధీనం చెసుకొని ఇద్దరిని రిమాండ్ కు తరలించారు.

# బొలివియాలోనూ... నిత్యానందుడి ఆరాచకాలు

హైదరాబాద్, మార్చి 26, (

కైలాస దేశాన్ని సృష్టించడం ద్వారా ప్రపంచం మొత్తాన్ని ఆశ్చర్యపరిచిన స్వయం ప్రకటిత సన్యాసి నిత్యానంద మరోసారి వార్తల్లో నిలిచారు. నిత్యానంద ఇప్పుడు కైలాస సరిహద్దులను విస్తరించాలనుకుంటున్నాడని చెబుతున్నారు. ఇందుకోసం దక్షిణ అమెరికాలోని బొలీవియాపై దాడి చేశారు. నిత్యానంద తన శిష్యులతో కలిసి అక్కడ 4.8 లక్షల హెక్టార్ల భూమిని ఆక్రమించారు. ఈ సమాచారం అందిన వెంటనే, భారతదేశం నుండి బొలీవియా వరకు ప్రభుత్వాలు కార్యాచరణలోకి దిగాయి.నిత్యానంద తోపాటు అతని శిష్యులు మొదట బొలీవియాలోని గిరిజనుల భూమిని మోసపూరితంగా కొనుగోలు చేశారు. భూమిని కొనుగోలు చేసిన తర్వాత, నిత్యానంద దానిని కైలాస విస్తరణగా ప్రకటించడానికి ప్రయత్నించాడు. కానీ అంతకు ముందే భూమి కొనుగోలు వార్త మీడియాకు లీక్ అయింది. నిత్యానంద, ఆయన శిష్యులు కలిసి బొలీవియాలోని 4 లక్షల 80 వేల ఎకరాల ప్రభుత్వ భూమిని తమ పేర్లపైకి మార్చుకున్నారని ఆరోపించారు. ఈ భూమిని 1000 సంవత్సరాలకు లీజుకు తీసుకున్నట్లు పత్రాలు సృష్టించుకున్నారు. భూమికి లీజు మొత్తం సంవత్సరానికి రూ. 8.96 లక్షలు, నెలవారీ మొత్తం రూ. 74,667, రోజువారీ మొత్తం రూ. 2,455 గా ప్రతిపాదించారు.ఈ మేరకు బొలీవియా విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటన విడుదల చేస్తూ, బొలీవియా "యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ కైలాస" అని పిలువబడే దేశంతో దౌత్య సంబంధాలను కొనసాగించడం లేదని, ఎందుకంటే అంతర్జాతీయ సమాజంలో మరే ఇతర దేశం కూడా వారిని ఒక దేశంగా గుర్తించలేదని పేర్కొంది. అంతర్జాతీయ కథనాల ప్రకారం, కైలాస ప్రతినిధులు భూమిని స్వాధీనం చేసుకోవడానికి బొలీవియాలో చాలా నెలలుగా ఉన్నారు. ఆ భూమిని స్వాధీనం చేసుకోవడానికి స్థానిక నాయకుల సహాయం తీసుకున్నారు. ఒప్పందం ఖరారైన తర్వాత, నిత్యానంద బృందం ప్రజల నుండి ఒప్పందంపై సంతకం చేయించుకుంది.అయితే, ఈ వార్త వెంటనే స్థానిక మీడియాకు లీక్ అయింది. మీడియాలో వార్తలు వచ్చిన తర్వాత, నిత్యానంద, అతని శిష్యులు స్థానిక జర్నలిస్టులను బెదిరించారని, అయతే ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగినప్పుడు, నిత్యానంద ఒప్పందాన్ని పూర్తిగా రద్దు చేసిందని చెబుతున్నారు.2019 నుండి భారతదేశం నుండి పరారీలో ఉన్నాడు. అతనిపై అనేక తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయి. దేశం విడిచి పారిపోయిన నిత్యానంద కైలాస అనే నకిలీ దేశాన్ని స్థాపించారు. దానికి సొంత కరెన్సీ, రాజ్యాంగం ఉందని చెప్పుకుంటున్నారు. 2010 సంవత్సరంలో, నిత్యానందకు సంబంధించిన ఒక అశ్లీల సీడీ బయటకు వచ్చింది. దాని కారణంగా అరెస్టు కూడా చేశారు పోలీసులు. 2012లో నిత్యానందపై అత్యాచారం కేసులు నమోదయ్యాయి. 2019లో, ఇద్దరు బాలికలను కిడ్నాప్ చేసి బందీగా ఉంచినందుకు నిత్యానందపై కేసు నమోదైంది. ఇక తర్వాత నుంచి తప్పించుకుని తిరుగుతున్నాడు. నిత్యానంద దేశం విడిచి పారిపోవడం వల్ల అతనిపై ఎటువంటి చర్యలు తీసుకోలేకపోయారు భారతీయ పోలీసులు.

# నాగబాబు పదవికి బ్రేక్....

విజయవాడ మార్చి 26,

జనసేన నేత నాగబాబు మంత్రిపదవికి బ్రేకులు పడినట్లు పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. ఆయన ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. కొద్దికాలం క్రితం పార్టీ పవన్ కల్యాణ్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా నాగబాబుకు మంత్రి పదవి ఇస్తామని చెప్పారు. ఉగాది రోజున ఆయన మంత్రివర్గంలో ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుందన్న వార్తలు కూడా వచ్చాయి. కానీ అలాంటి వాతావరణం కనిపించకపోవడం ఇప్పుడు పార్టీలోనూ, జనసైనికుల్లోనూ చర్చనీయాంశమైంది. ఉగాదికి ఇంకా వారం రోజులు కూడా సమయం లేదు. దీనికి సంబంధించిన అప్ డేట్ ఇంత వరకూ రాకపోవడంతో కొంత జనసైనికుల్లో ఆందోళన నెలకొంది. దీనిపై అధికారిక పర్యటన ఇటీవల కాలంలో కూడా రాకపోవడం చర్చనీయాంశంగా మారింది. నాగబాబును తొలుత రాజ్యసభకు ఎంపిక చేయాలని భావించినా ఆ ఆలోచనను మానుకుని మంత్రివర్గంలోకి తీసుకుందామని పవన్ కల్యాణ్ డిసైడ్ అయ్యారు. తన సోదరుడు పార్టీకోసం పడిన కష్టానికి తగిన ప్రతిఫలాన్ని ఇవ్వాలన్నది ఆయన నిర్ణయం. ఇందులో కుటుంబం, వారసత్వం, కులం వంటివి లేవని, కేవలం పనిచేసిన వారందరికీ వరసగా ప్రాధాన్యత ఇస్తామని చెబుతు వస్తున్నారు. కానీ పిఠాపురంలో జరిగిన జనసేన ఆవిర్భావ వేడుకల తర్వాత కొంత మారినట్లు కనిపిస్తుంది. ఇద్దరం మంత్రివర్గంలో ఉండే కంటే నాగబాబుకు పార్టీ బాధ్యతలను అప్పగించి జిల్లాల పర్యటనలు చేయించాలన్న ఆలోచనలో పవన్ కల్యాణ్ ఉన్నట్లు చెబుతున్నారు. . తనకు తరచూ ఆరోగ్య సమస్యలు తలెత్తుతుండటంతో పార్టీపై ఫోకస్ పెట్టాలంటే నాగబాబు మంత్రిపదవి లో కంటే పార్టీలో కీలకంగా ఉంటేనే మంచిదన్న భావనలో పవన్ కల్యాణ్ ఉన్నారని చెబుతున్నారు. అందుకే నాగబాబుకు ఈ విషయం చెప్పినట్లు కూడా సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతుంది. జిల్లాలు తిరుగుతూ పార్టీని బలోపేతం చేయాలని నాగబాబుకు పవన్ కల్యాణ్ సూచించినట్లు తెలిసింది. ఆంధ్రప్రదేశ్ కేబినెట్ లో ఒకటే ఒక మంత్రి పదవి ఖాళీగా ఉంది. అందులోనూ నాగబాబు చేరిపోతే ఇక పార్టీని పట్టించుకునే వారు లేరు. నాదెండ్ల కూడా కేబినెట్ లో ఉండటం కూడా ఇందుకు కారణం. మరొకవైపు ఉగాది రోజున చంద్రబాబు ప్రతిష్టాత్మకైన పీ4 పథకం ప్రారంభించేందుకు అట్టహాసంగా పనులు మొదలు పెట్టడంతో ఇక నాగబాబుకు అమాత్య పదవి లేనట్లేనన్న కామెంట్స్ మాత్రం ఎక్కువగా వినిపిస్తున్నాయి.

జనసైనికుల్లో నిరాశలు

కూటమి ప్రభుత్వ హయాంలో జనసైనికులు అవమానాలు ఎదుర్కొంటున్నారా..?

పార్టీకోసం పనిచేస్తున్న నిఖార్సయిన కార్యకర్తల్ని జనసేన పట్టించుకోవడంలేదా..?

అధినేత సైలెంట్ గా ఉండటాన్ని జనసైనికులు జీర్ణించుకోలేకపోతున్నారా..?



ప్రస్తుతం సోషల్ మీడియాలో జనసైనికులు ట్వీట్లు చూస్తుంటే ఇది నిజమేననిపిస్తోంది. తాజాగా సాయిబాబా అనే జనసైనికుడి ట్విట్టర్ అకౌంట్ లో పోస్ట్ చేసిన ఓ లేఖ వైరల్ గా మారింది. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ని ఉద్దేశించి సాయిబాబా లేఖ రాశారు. తనలాగే పార్టీలో చాలామంది కార్యకర్తలు ఆవేదన చెందుతున్నారని సాయిబాబా వివరించారు. మరి ట్విట్టర్లో జనసైనికుడి ఆవేదన జనసేనాని వరకు చేరుతుందో లేదో చూడాలి.అన్న ఎంతో బాధ తో జనసేన పార్టీ పట్ల ప్రేమ తో నా చివరి ప్రయత్నం గా నేను చెప్పాలి అనుకున్నది ఈ లెటర్ లో రాసాను అది మీరు చదివి తగు చర్యలు చెపడతారు అని ఆశిస్తున్నాను

## నకిరేకల్ పిఎస్ లో కేటీఆర్ పై కేసు నమోదు

నల్గొండ

నకిరేకల్ పోలీసు స్టేషన్ లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై కేసు నమోదయింది. టెన్త్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ నిందితులతో మున్సిపల్ చైర్మన్ కు సంబంధాలు ఉన్నాయని కేటీఆర్ ట్వీట్ చేసారు. దాంతో కేటీఆర్ పైన నకిరికల్ మున్సిపల్ చైర్మన్ రజిత శ్రీనివాస్ పిర్యాదు చేసారు. తమపై తప్పుడు ఆరోపణలు చేశారని పిర్యాదులో పేర్కొన్నారు. కేటీఆర్ పై నకిరేకల్ పీఎస్ లో రెండు కేసులు నమోదు అయ్యాయి. ..

## కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పురి అధ్యక్షతన జరిగిన ఎన్డీయే ఎంపిల సమావేశానికి ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) హాజరు

ఢిల్లీ , మార్చి 25,

కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి అధ్యక్షతన జరిగిన ఎన్డీయే ఎంపిల సమావేశంలో విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ పాల్గొన్నారు. ఎన్డీయే ప్రభుత్వం ఎన్డీయే కూటమిలోని పార్లమెంట్ సభ్యుల నియోజకవర్గాల సమస్యలు, కేంద్ర పథకాల అమలు, నిధుల అవసరాల గురించి తెలుసుకునేందుకు కేంద్రమంత్రులకు కొంతమంది ఎంపిలను గ్రూపులుగా అప్పగించి ప్రతి మూడు నెలలకొకసారి సమావేశం కావాలని ఆదేశించింది. కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ కి అధ్యక్షతన వున్న ఎన్డీయే ఎంపిల గ్రూపులో ఏపికి చెందిన కేశినేని శివనాథ్ (చిన్ని), ఎంపి బస్తిపాటి నాగరాజు పంచలింగాల వున్నారు.

కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి అధ్యక్షతన మంగళవారం రాత్రి ఢిల్లీలోని ఆయన నివాసంలో పలువురు ఎన్డీయే ఎంపిలతో డిన్నర్ మీటింగ్ జరిగింది. ఈ సమావేశానికి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజనాథ్ సింగ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజనాథ్ సింగ్ తో ఆంధ్రప్రదేశ్ కి ఏరోస్పేస్, డిఫెన్స్ పారిశ్రామిక రంగాలు వచ్చే విధంగా సహకరించాలని కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారు. అలాగే కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి కి విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ది గురించి వివరించారు.

కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరి, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజనాథ్ సింగ్ తమకి పార్లమెంట్ లో కొనసాగాల్సి విధానం, పార్లమెంట్ నియోజకవర్గాల అభివృద్దికి సంబంధించి సలహాలు సూచనలు ఇచ్చినట్లు ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) ఈ మేరకు విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే

కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పురి, ఐక్యరాజ్యసమితి మాజీ అసిస్టెంట్ సెక్రటరీ జనరల్ లక్ష్మీ ముర్డేశ్వర్ పూరి దంపతులు ఇచ్చిన విందు ఆత్మీయమైన ఆతిథ్యం మరుపురాని విధంగా వున్నాయని కొనియాడారు. హర్దీప్ సింగ్ పురి సతీమణి లక్ష్మీ ముర్డేశ్వర్ పూరి సౌతిండియా వంటకాలు దగ్గర వుండి తయారు చేయించినందకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఢిల్లీ రాష్ట్రానికి చెందిన ఎంపి వి సతీష్(బిజెపి), గుజరాత్ రాష్ట్రానికి చెందిన ఎంపి భరత్‌సిన్హ్ దాభి ఠాకూర్(బిజెపి), కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఎంపి బి వై రాఘవేంద్ర(బిజెపి),ఎంపి ఎమ్.మల్లేష్ బాబు (జె.డి.యు), మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఎంపి డాక్టర్ రాజేష్ మిశ్రా (బిజెపి), ఒడిషా రాష్ట్రానికి చెందిన సంగీతా కుమారి సింగ్ డియో (బిజెపి), రాజ్య సభ ఎంపి మమతా మొహంతా (బిజెపి) , ఉత్తర ప్రదేశ్ కి చెందిన రాజ్యసభ ఎంపి డాక్టర్ దినేష్ శర్మ (బిజెపి), వెస్ట్ బెంగాల్ కి చెందిన ఎంపి సమిక్ భట్టాచార్య (బిజెపి), బిహార్ కి చెందిన ఎంపి విజయ లక్ష్మి కుష్వాహా (జె.డి(యు)), ఆంధ్రప్రదేశ్ కి చెందిన ఎంపి కేశినేని శివనాథ్ (టిడిపి), ఎంపి బస్తిపాటి నాగరాజు పంచలింగాల (టిడిపి), అస్సాంకి చెందిన రాజ్యసభ ఎంపి రంగ్వ్రా నార్జారీ (యు.పి.పి.ఎల్) పాల్గొన్నారు.

## ఏపీలో ఏప్రిల్ నెలలో 'మన ఇంటికి మన మిత్ర' కార్యక్రమం

అమరావతి : , మార్చి 25,

ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్ పై అవగాహన కల్పించడానికి ఏప్రిల్ నెలలో 'ప్రతి ఇంటికి మనమిత్ర' కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహించనుంది. అధికారులు ప్రతి ఇంటికీ వెళ్లి స్మార్ట్‌ఫోన్లలో 9552300009 నంబర్ను సేవ్ చేసి సేవల గురించి వివరిస్తారని ఐటీ శాఖ కార్యదర్శి భాస్కర్ వెల్లడించారు. ప్రస్తుతం 210 సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అన్ని రకాల ధ్రువపత్రాలను వాట్సాప్లోనే అందిస్తామని తెలిపారు.

## సూర్యాపేట డీఎస్పీ రవి పై వేటు ?

సూర్యాపేట , మార్చి 25,

సూర్యాపేట డిఎస్పీ రవిపై వేటు పడినట్టు సమాచారం.. నూతనకల్ మండలం మిర్యాల గ్రామంలో మెంచు చక్రయ్య గౌడ్ మర్డర్ కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సూర్యాపేట డి.ఎస్.పి రవి పై వేటు పడింది. డీజీపీ ఆఫీసుకు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. మెంచు చక్రయ్య గౌడ్ కుటుంబం సభ్యుల మధ్య గొడవలు ఉన్నాయని హత్యకు ముందుగా పోలీసులకు కుటుంబ సభ్యులు సమాచారం ఇచ్చారు.

ఈ కేసు విషయంలో నిర్లక్ష్యం వహించిన సూర్యాపేట డీఎస్పీ రవి, తుంగతుర్తి సిఐ శీను పై బదిలీ వేటు పడింది. ఎస్పికి మెమో జారీ చేసారు. అయితే, ఉత్తర్వులు ఐజి కార్యాలయం నుండి ఇంకా అధికారికంగా వెలువడలేదని సమాచారం.

# స్మార్ట్ మీటర్ స్కాం...

ఏలూరు, మార్చి 25,

కర్ణాటక ప్రభుత్వ విద్యుత్ శాఖలో భారీ కుంభకోణం చోటు చేసుకుందా? అంటే తాజాగా బీజేపీ ఆరోపణలను పరిగణలోకి తీసుకుంటే అవుననే అనిపిస్తోంది. అదటుంచి ఈ కుంభకోణం తీరును గమనిస్తే.. గతంలో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ నేతృత్వంలోని వైసీపీ ప్రభుత్వం ఎలాగైతే స్మార్ట్ మీటర్ల పేరిట భారీ స్కామ్ చేసిందని అప్పటి ప్రతి పక్షం టీడీపీ ఆరోపించిందో.. ఇప్పుడు కర్ణాటకలోనూ అలాగే జరుగుతోంది.కర్ణాటకలో స్మార్ట్ మీటర్ కొనుగోలులో ఏకంగా ?7,500 కోట్ల స్కాం జరిగిందని ప్రతిపక్షం బీజేపీ ఆరోపించింది. సదరు టెండర్‌ను తయారీదారులకు కాకుండా సరఫరాదారులకు కేటాయించడం వల్ల స్మార్ట్ మీటర్ల ధరలు భారీగా పెంచారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అంతేకాదు, సాఫ్ట్‌వేర్ మద్దతునిచ్చే సంస్థ ఇప్పటికే బ్లాక్‌లిస్ట్ అయిన కంపెనీ అని విమర్శలు వచ్చాయి.ఇతర రాష్ట్రాలతో పోల్చితే కర్ణాటకలో స్మార్ట్ మీటర్ ధరలు భారీగా పెరిగాయి. ఏషియానెట్ న్యూస్‌కు లభించిన డాక్యుమెంట్ల ప్రకారం, సింగిల్ ఫేజ్ మీటర్ ధర ?950 నుంచి ?4,998కి పెరిగింది. మరో రకమైన సింగిల్ ఫేజ్ మీటర్ ధర ?2,400 నుంచి ?9,000కి పెరిగింది. త్రిఫేజ్ మీటర్ ధర అయితే ఏకంగా ?2,500 నుంచి ?28,000కి పెరిగింది. గతంలో ఏపీలోనూ ఇలాంటి ఆరోపణలే వచ్చాయి.ఆంధ్రప్రదేశ్ లో లోగ రూ.ఏడు వేలు మీటరును రూ.36 వేలు విక్రయించారని ఆరోపణలు వచ్చాయి. గతంలో టీడీపీ నేత.. సోమిరెడ్డి పేర్కొన్న వివరాల ప్రకారం.. ఇతర రాష్ట్రాలు ఒక్కో స్మార్ట్ మీటర్‌ను రూ.4 వేలకు కొంటుంటే వైసీపీ ప్రభుత్వం రూ.36 వేల కు కొనుగోలు చేసింది ఈ స్మార్ట్ మీటర్ల కొనుగోలులో రూ.17 వేల కోట్ల అక్రమాలు జరిగాయి. ఈ భారాన్ని అప్పటి ప్రభుత్వం కరెంటు బిల్లుల్లో వేసి వసూలు చేయాలని నిర్ణయించింది. పొలాల్లో వ్యవసాయ బావులకు వాడుతున్న మోటార్లకు కూడా స్మార్ట్ మీటర్లు పెడుతున్నారని, మోటార్లకన్నా మీటర్ల ధర రెట్టింపు ఉందని అన్నారు. 'రాజస్థాన్‌లో స్మార్ట్ మీటర్ ధర, నిర్వహణ కలిపి రూ.7900



కోట్ చేశారు. ఛండీగఢ్ ప్రభుత్వ కంపెనీ రూ.7100 కోట్ చేసింది. మన రాష్ట్రంలో మాత్రం స్మార్ట్ మీటర్ ధర, నిర్వహణ కలిపి ఏకంగా రూ.36,975కు టెండర్ ఖరారు చేశారు. అని ఆరోపించారు.కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్‌కు ?900 సబ్సిడీ ఇస్తోంది. ఇతర రాష్ట్రాల్లో ఈ మొత్తాన్ని టెండర్ కంపెనీలకు మంజూరు చేసి, ప్రజలపై భారం తగ్గించగా, కర్ణాటక ప్రభుత్వం మాత్రం మొత్తం డబ్బును టెండర్ సంస్థలకు చెల్లించడంతోపాటు వినియోగదారుల నుంచి కూడా అధిక వసూళ్లు చేపట్టింది. ఒక్కో మీటర్‌పై ?9,260 అదనంగా ఖర్చు అవుతోందని ఏషియానెట్ ప్రత్యేక నివేదిక వెల్లడించింది.బెస్కాం, మెస్కాం, హెస్కాం, జెస్కాం, సెస్కాం కలిసి మొత్తం 8 లక్షల స్మార్ట్ మీటర్ల కోసం ?7,408 కోట్ల అదనపు వ్యయం అయింది. ఈ భారీ మొత్తాన్ని ఎవరికి లాభంగా మళ్లించారు? ఏ కారణంతో స్మార్ట్ మీటర్ల ధరలు భారీగా పెంచారు? టెండర్‌లో జరిగిన గోల్‌మాల్‌కు ఎవరు బాధ్యత వహించాలి? ఈ ప్రశ్నలు సంధిస్తూ హౌస్ కమిటీ ద్వారా విచారణ జరిపించాలని ప్రతి పక్షం బీజేపీ డిమాండ్ చేస్తోంది.

## పోలవరం నిర్వాసితుల పరిహారం, పునరావాసం పై మంత్రి నిమ్మల సమీక్ష

అమరావతి

కూటమి ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ఎంత ప్రాధాన్యత ఇస్తుందో, ప్రాజెక్టు కోసం తమ విలువైన భూములు, ఆస్తులు, ఇళ్ళు త్యాగం చేసిన నిర్వాసితుల క్షేమం కూడా అంతే ముఖ్యం అని అన్నారు మంత్రి నిమ్మల రామానాయుడు. అమరావతి సచివాలయంలో పోలవరం నిర్వాసితులకు అందాల్సిన పరిహారం, పునరావాసం పై అధికారులతో సమీక్ష నిర్వహించారు.

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు గత అయిదేళ్లలో ఒక్క రూపాయి నష్టపరిహారం గానీ, కాలనీల నిర్మాణానికి అరబస్తా సిమెంట్ పనులు కూడా చేయలేదు అని, గత జగన్ ప్రభుత్వం నిర్వాసితులను పట్టించుకోకపోవడంతో, తమను తెలంగాణలో కలిపేయమని నిర్వాసితులు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేశారు అని అన్నారు. నాడు 2017లో రూ. 800 కోట్లు జమ చేసిన చంద్రబాబే, మరలా ఏడేళ్ల తరువాత నిర్వాసితుల కష్టాలు తీర్చేలా, మరో 800 కోట్లు వారి ఖాతాల్లో జమ చేసి, సంక్రాంతి కానుక అందించారు అని గుర్తు చేసారు.

జగన్ సిఎం అయ్యాక పోలవరం నిర్వాసితుల వైపు కన్నెత్తి కూడా చూడకపోగా, పునరావాస కాలనీల్లో ఒక్క ఇంటిని కూడా పూర్తి చేయలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టుకు ఇచ్చిన రూ. 3385 కోట్ల రియంబర్స్మెంట్ నిధులను కూడా, ప్రాజెక్టు నిర్మాణానికి గానీ, నిర్వాసితులకు గానీ, అందించకుండా దారి మళ్లించి దోచుకున్న దుర్మార్గుడు జగన్ అని విమర్శించారు.

పోలవరం ప్రాజెక్టును విధ్వంసం చేసినట్టే, నిర్వాసితులను సైతం నిలువునా జగన్ ముంచేశాడు అని అన్నారు. రాడార్ సర్వే ప్రకారం మొత్తం 75 పునరావాస కాలనీలకు గానూ, 26 కాలనీలను నాటి టీడీపీ ప్రభుత్వమే పూర్తి చేయగా, మిగిలిన 49 పునరావాస కాలనీల నిర్మాణ పనులను సైతం వేగవంతం చేసేలా యాక్షన్ ప్లాన్ రూపొందిస్తున్నామని తెలిపారు.

నిర్వాసిత గ్రామాల్లో ఏప్రియల్ నెలాఖరులోగా గ్రామసభలు, ఆర్అండ్ఆర్ కాలనీల గుర్తింపు, పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు మంత్రి నిమ్మల. మిగిలిన నిర్వాసిత కాలనీల్లో నిర్మాణ పనులు పూర్తి చేసేలా, జూలై 15 లోగా టెండర్ల ప్రక్రియ పూర్తవ్వాలి అని, కొత్తగా గుర్తించిన కాలనీలు సైతం 2026 జూన్ కల్లా పూర్తి చేసి, నిర్వాసితులను తరలించేలా యాక్షన్ ప్లాన్ సిద్దం చేయాలని ఆదేశించారు. ఫేజ్-2లో 45.72 మీటర్లకు ఆర్అండ్ఆర్ కు సంబంధించిన అంచనాలను కూడా సిద్దం చేసి, కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి నిధులు సాధిస్తాం అని తెలిపారు. ఈ సమీక్ష లో ఆర్ అండ్ ఆర్ కమిషనర్ రాంసుందర్ రెడ్డి, ఈ ఎన్ సి ఎం. వెంకటేశ్వర్రావు, పోలవరం ప్రాజెక్ట్ పరిపాలనాధికారి కే. అభిషేక్, స్పెషల్ కలెక్టర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, మరియు పంచాయతీరాజ్, ట్రైబల్ వెల్ఫేర్, ఎపిఈడబ్ల్యూఐడిసి, హౌసింగ్, ఆర్ అండ్ బి చీఫ్ ఇంజనీర్లు, ఇతర ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

# అనంతలో అద్భుతం

అనంతపురం, మార్చి 26,

గ్రామాల్లో తరచుగా వింతలు జరుగుతుంటాయి. కలలోకి దేవతలు వచ్చారని, ఫలానా పని చేయాలని కొందరు చెప్తూ ఉంటారు. కొన్నిసార్లు వాళ్లు చెప్పినట్లు చేస్తే ఆశ్చర్యకర విషయాలు వెలుగులోకి వస్తాయి. తాజాగా ఏపీలో ఇలాంటి ఘటనే జరిగింది. ఓ యువకుడి కలలోకి అమ్మవారు వచ్చి.. ఫలానా చోట తవ్వితే తన విగ్రహం బయటపడుతుందని చెప్పిందట. గ్రామస్తులంతా కలిసి అమ్మవారు చెప్పిన చోటుకు వెళ్లి గునపాలతో తవ్వారు. ఆశ్చర్యకరంగా అమ్మవారి విగ్రహం బయటపడింది. దీంతో గ్రామస్తులంతా ఆ విగ్రహాన్ని ప్రతిష్టించి పూజలు చేయడం మొదలు పెట్టారు. అసలు ఏం జరిగిందటే..అనంతపురానికి చెందిన అంజి అనే యువకుడు గత కొద్ది రోజులుగా అమ్మవారు ఒంటి మీదికి వచ్చిందంటూ పూనకంతో ఊగిపోతున్నాడు. అంతేకాదు, గంగమ్మ అమ్మవారు తన కలలోకి వచ్చిందని చెప్పాడు. గౌరవ గార్డెన్ వాటర్ ట్యాంక్ సమీపంలో తవ్వితే విగ్రహాలు బయటపడతాయని చెప్పిందంటూ శిగం ఊగాడు. రెండు అడుగుల లోతుతో ఆ విగ్రహాలు ఉన్నాయని అమ్మవారు తనకు చెప్పిందని చుట్టుపక్కల వారితో చెప్పాడు. అతడి మాటలు నమ్మిన స్థానికులు వాటర్ ట్యాంక్ సమీపంలో తవ్వకాలు చేపట్టాలి అనుకున్నారు.తాజాగా స్థానికుల అంతా కలిసి పూజలు చేసి అంజి చెప్పిన ప్రాంతంలో పూజలు చేసి, విగ్రహాల కోసం తవ్వకాలు మొదలుపెట్టారు. చెప్పినట్టుగానే రెండు అడుగులు తవ్వగానే గంగమ్మ అమ్మవారి విగ్రహం బయటపడింది. స్థానికులు ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు. అందరు కలిసి అమ్మవారి విగ్రహాన్ని నీటితో కడిగి, పసుపు, కుంకుమ రాశారు. పూలు, నిమ్మకాయలు పెట్టి పూజలు చేస్తున్నారు.ఈ విషయం అనంతపురం అంతా వ్యాపించడంతో అమ్మవారిని చూసేందుకు ప్రజలు తరలి వస్తున్నారు. అమ్మవారిని చూసి విగ్రహం మీద పసుపు, కుంకుమ వేసి పూజలు చేస్తున్నారు. అందరినీ చల్లగా చూడాలని కోరుకుంటున్నారు. విగ్రహాలు బయటప పడటంతో అంజి చెప్పిన మాటలు నిజమేనని అందరూ భావిస్తున్నారు. ఆయనకు గంగమ్మ అమ్మవారు ఒంటి మీదికి వస్తున్నట్లు భావిస్తున్నారు. ప్రస్తుతం ఈ ఘటన అనంతపురంలో హాట్ టాపిక్ గా మారింది. మరోవైపు ఈ విషయం పోలీసులకు తెలియడంతో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు స్థానికులు అంతా కలిసి అమ్మవారికి ఆలయం కట్టించాలని నిర్ణయం తీసుకున్నారు. త్వరలోనే ఆలయ నిర్మాణ పనులు మొదలు పెడతామని చెప్తున్నారు. ఈ ఆలయంలో అంజినే పూజారిగా ఉంచాలని భావిస్తున్నట్లు చెప్పారు. ఆయన మూలంగానే అమ్మవారు బయటకు వచ్చారని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్తున్నారు.

## ఇంటర్వెల్ ముందే ప్రేమ కథ... కామెడీ కూడా!

హైదరాబాద్, మార్చి 25

నితిన్, శ్రీ లీల జంటగా నటించిన తాజా సినిమా 'రాబిన్ హుడ్'. ఈ శుక్రవారం (మార్చి 28న) థియేటర్లలోకి వస్తుంది. ఆస్ట్రేలియా క్రికెటర్ డేవిడ్ వార్నర్ గెస్ట్ రోల్ చేసిన సినిమా ఇదే. నట కిరీటి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, వెన్నెల కిషోర్ ప్రధాన పాత్రల పోషించారు. ఈ మూవీ సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది సినిమా. దాంతో పాటు ఫస్ట్ రివ్యూ కూడా బయటకు వచ్చేసింది. మరి సినిమా టాక్ ఎలా ఉందో తెలుసుకోండి.సాధారణంగా హీరో హీరోయిన్లతో పాటు ప్రధాన పాత్రలను సినిమా ప్రారంభంలో పరిచయం చేస్తారు. 'రాబిన్ హుడ్' సినిమాలో కూడా నితిన్, శ్రీ లీలతో పాటు రాజేంద్ర ప్రసాద్ వెన్నెల కిషోర్ తదితర ప్రధాన తారాగణం అంతటినీ ఇంటర్వెల్ ముందే దర్శకుడు వెంకీ కుడుముల పరిచయం చేశారని తెలిసింది. హీరో హీరోయిన్ల ప్రేమ కథ చాలా బాగా వచ్చిందట. దానికి తోడు రాజేంద్ర ప్రసాద్, వెన్నెల కిషోర్ చేసిన కామెడీ ఆడియన్స్ అందరినీ నవ్విస్తుందని చెబుతున్నారు. మెయిన్ ఆర్టిస్టులు అందరినీ ముందుగానే పరిచయం చేసినప్పటికీ... డేవిడ్ వార్నర్ మాయను మాత్రం క్లైమాక్స్ వరకు దాచేశారు. ఆయన రోల్ మాత్రం ఎండింగ్ లో అందరినీ సర్ప్రైజ్ చేస్తుందని తెలిసింది. విశ్రాంతికి ముందు వరకు ప్రేక్షకులకు వినోదం అందించిన వెంకీ కుడుముల... ఇంటర్వెల్ తర్వాత అసలు కథను రివీల్ చేశారట. ఈ సినిమాలో ఎమోషనల్ యాంగిల్ ఎప్పటి వరకు బయటకు తీయలేదని, అది ఆడియన్స్ అందరినీ ఒక సర్ప్రైజ్ అండ్ షాక్ కి గురి చేస్తుందని చెబుతున్నారు.ప్రేక్షకుల హృదయాలను హత్తుకునే ఒక భావోద్వేగ భరిత సన్నివేశం విశ్రాంతి తర్వాత వస్తుందని సినిమా చూసిన జనాలు తెలిపారు. ఈ మూవీ ట్రైలర్ చూస్తే ఇదొక కామెడీ సినిమా అనిపిస్తుంది. కామెడీని మించిన ఎమోషన్ సినిమాలో ఉందని టాక్. ట్రైలర్ జాగ్రత్తగా గమనిస్తే... అందులో 'రాబిన్ హుడ్' పాత్ర చేసారు హీరో నితిన్. ఆయన దొంగతనాలు చేయడం, ధనవంతులను దోచుకోవడం కనిపించింది. కానీ ఎందుకు దోచుకుంటున్నారు? ఆ దోచిన డబ్బును తిరిగి ఎవరికి పంచుతున్నారు? ఏమిటి? అనేది మాత్రం వెంకీ కుడుముల చూపించలేదు. ఆ పాయింట్ మెయిన్ అనేది టాక్. నితిన్ మీద ఇంటర్వెల్ తర్వాత తీసిన ఒక స్టైలిష్ ఫైట్ కూడా ఆడియన్స్ అందరికీ నచ్చడం గ్యారెంటీ అంటున్నారు.'రాబిన్ హుడ్' సినిమాకు జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించారు.

# ఆర్వోబీలతో మహర్ధశ

గుంటూరు, మార్చి 26,

ఏపీలో కొత్తగా మరో ఆర్‌వోబీ నిర్మాణం కానుంది. ఏపీలో టీడీపీ కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత.. పలు ప్రాజెక్టులకు మోక్షం కలుగుతున్న సంగతి తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం సహకారంతో ఏపీలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు అనుమతులు లభిస్తు?న్నాయి. ఈ క్రమంలోనే కేంద్రం నుంచి ఏపీకి మరో గుడ్ న్యూస్ అందింది. మంగళగిరిలో ఆర్‌వోబీ నిర్మాణానికి రైల్వే శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రూ.129.18 కోట్లతో మంగళగిరి ఆర్వోబీ నిర్మాణానికి ఆమోదం తెలిపింది. ఆ మేరకు నిధులు మంజూరు చేస్తూ రైల్వే శాఖ నిర్ణయం తీసుకుంది. మంగళగిరిలో ఆర్‌వోబీ నిర్మాణం చేయాలని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ రైల్వే శాఖను ఇటీవల అభ్యర్థించారు. కేంద్ర మంత్రి విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన రైల్వే శాఖ.. మంగళగిరిలో నాలుగు వరుసల ఆర్‌వోబీ నిర్మాణానికి అనుమతులు, నిధులు మంజూరు చేసింది. గుంటూరులోని గడ్డిపాడు వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి సైతం రైల్వేశాఖ ఇటీవల నిధులు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. గడ్డిపాడు రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ. 107.79 కోట్లు మంజూరు చేసింది. రైల్వే గేటు కారణంగా ఈ ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ జామ్ అవుతోంది. దీంతో విజయవాడవైపు వెళ్లే వారికి నిరీక్షణ తప్పడం లేదు. ఈ నేపథ్యంలో ఆర్‌వోబీ నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించారు. గుంటూరు-నంబూరు రైల్వేస్టేషన్ల మధ్య గడ్డిపాడు వద్ద నాలుగు వరుసలుగా దీనిని నిర్మిస్తారు. ఈ ఆర్వోబీ నిర్మాణం పూర్తయితే పేరేచర్ల నుంచి విజయవాడ వెళ్లేవారికి అనుకూలంగా ఉంటుంది. అలాగే హైదరాబాద్, నరసరావుపేట, పల్నాడు నుంచి వచ్చే భారీ వాహనాలను గుంటూరులోకి రాకుండా దారి మళ్లించేందుకు వీలవుతుంది. మరోవైపు గుంటూరులో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు శంకర్ విలాస్ పైవంతెనతో పాటుగా ఆర్వోబీల నిర్మాణం చేపడతామని ఎన్నికల సమయంలో పెమ్మసాని చంద్రశేఖర్ హామీ ఇచ్చారు. ఇక ఇచ్చిన హామీ ప్రకారం కేంద్ర సహాయ మంత్రి హోదాలో నిధుల మంజూరుకు ప్రయత్నిస్తున్నారు. ఆ క్రమంలోనే ఇప్పటికే గుంటూరు శంకర్‌విలాస్ ఫ్లైఓవర్‌కు ఇటీవల రూ. 98 కోట్లు మంజూరు చేయించారు.

## చిన్న వంగలి గ్రామంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం

చాగలమర్రి మార్చి 26, (

ఈ రోజు చాగలమర్రి మండలంలోని చిన్నవంగలి గ్రామంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రంగ నేతాజి గారు మొక్కజొన్న, సజ్జ పంటలలో కోత సమయంలో తీసుకోవలసిన జగ్రత్తల గురించి వివరించడం జరిగింది. అకాల వర్షాలు పడే అవకాశం ఉన్నందున కోత పూర్తయి ఆరబోసిన పంటను టార్పాలిన్లతో కప్పుకొని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరినారు. ప్రభుత్వం కంది రూ.7550, మినుము రూ.7400, శనగ రూ.5650/ క్వింటాలుకు మద్దతు ధరతో కంది,మినిము,శనగ పంటను కొనుగోలు చేయుటకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసింది.కనుక పంటను అమ్మదలచిన రైతులు మీ ఈ పంట నమోదు వివరాలు తీసుకొని రైతు సేవా కేంద్రం నందు కొనుగోలు కొరకు నమోదు చేసుకోవలసినదిగా కోరడమైనది. రైతులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## రహదారిని పరిశీలించిన ఆర్ బి : డి ఈ.

శిరివెళ్ల మార్చి 26, (

: మండల కేంద్రంలోని అమ్మవారి శాల సమీపంలో గల ప్రధాన రహదారిని ఆర్ ఛ బి డిఈ సుబ్బరాయుడు మంగళవారం పరిశీలించారు.రహదారి గుంతగా మారి రాకపోకలకు ఇబ్బందిగా తలెత్తడంతో గ్రామ ప్రజల విజ్ఞప్తి మేరకు ఆళ్లగడ్డ శాసన సభ్యురాలు భూమా అఖిలప్రియ దృష్టికి సమస్యను తీసుకువెళ్లినట్లు టిడిపి నేతలు సుర రామ, ఉల్లి వెంకటసుబ్బయ్య, కేసీ కెనాల్ టీసీ మెంబర్ కొత్తపేట జిక్రియా, తదితరులు తెలిపారు.వర్షాకాలంలో నిత్యం నీరు నిలిచి ఉండడం వల్ల వాహన రాకపోకల సమయంలో వర్షంనీరు మరియు బురద నీరు చిట్లడం అసౌకర్యంగా తలెత్తేది అని అన్నారు.గుంతగా మారిన ప్రధాన రహదారిని మరమ్మత్తులు చేసి వాహన రాకపోకలకు వర్షపు నీరు నిలబడకుండా గ్రామ ప్రజల మరియు ప్రయాణికులకు అసౌకర్యాన్ని నివారించెందుకు ఎమ్మెల్యే తగిన చర్యలు తీసుకోబోతున్నట్లు పేర్కొన్నారు.

## మెట్లోత్సవంలో పాల్గొనడం ఎంతో పుణ్యఫలం

తిరుపతి,పూర్వం నుండి ఎందరో మహనీయులు మెట్ల మార్గంలో తిరుమలకు నడిచివెళ్లి స్వామివారి కృపకుపాత్రులయ్యారని టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు రాజగోపాలరావు చెప్పారు.ఇలాంటి మెట్లోత్సవంలో పాల్గొనడం ఎంతో పుణ్యఫలమన్నారు.టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్యుల 522వ వర్థంతి మహోత్సవాలలో భాగంగా మంగళవారం ఉదయం అలిపిరి పాదాలమండపం మెట్లోత్సవం వైభవంగా జరిగింది.ఈ సందర్భంగా రాజగోపాలరావు మాట్లాడుతూ శ్రీమాన్ అన్నమాచార్యులు, శ్రీకృష్ణదేవరాయలు లాంటి మహనీయులు భక్తిప్రపత్తులతో తిరుమల కొండలను అధిరోహించి స్వామివారి వైభవాన్ని దశదిశలా వ్యాప్తి చేశారని వివరించారు.

# పాస్టర్ ప్రవీణ్ హత్య.. ప్రమాదమా

రాజమండ్రి, మార్చి26,

పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణం తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారింది. క్రైస్తవ మత ప్రచారకుడిగా, బోధకుడుగా ఆయన రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాదు, దేశవ్యాప్తంగా సుపరిచితుడు. అలాంటి వ్యక్తి సడన్ గా చనిపోయారనే వార్త క్రైస్తవ సమాజం నమ్మలేకపోతోంది. అదే సమయంలో ఆయనది అనుమానాస్పద మృతిగా తేలడం ఇక్కడ సంచలనంగా మారింది.ప్రవీణ్ పగడాల విజయవాడనుంచి రాజమండ్రి వెళ్లి, రాజమండ్రి నుంచి రాజానగరం వెళ్లేటప్పుడు బుల్లెట్ పై వెళ్తూ రోడ్డుపక్కన చనిపోయి పడి ఉన్నారు. స్థానికులు కొందరు ఆవైపుగా వెళ్తూ ఆయన మృతదేహాన్ని చూసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన డెడ్ బాడీ చూసినవారు ఇచ్చిన సమాచారం ప్రకారం ఆయన్ని ఎవరో చంపి పడివేసి ఉంటారని ఆరోపణలు వినపడుతున్నాయి. ఆయన మృతదేహంపై గాయాలున్నాయని, పెదాలపై కూడా గాయాలున్నాయని, రాడ్డుతో కొట్టినట్టు గాయాలు కనపడుతున్నాయని అంటున్నారు. ప్రవీణ్ పగడాల మృతదేహాన్ని రాజమండ్రి ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించగా అక్కడ క్రైస్తవ సోదరులు ధర్నా చేపట్టారు.ప్రవీణ్ పగడాల మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఆయన అభిమానులు, క్రైస్తవులు రాజమండ్రిలో ధర్నా చేపట్టారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మతోన్మాదులు ఆయన్ని చంపి ఉంటారని వారు అంటున్నారు. గంటలతరబడి రోడ్డుపై ఆందోళన చేస్తున్నా.. తమని ఎవరూ పట్టించుకోవట్లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు వెంటనే స్పందించాలని కోరారు. గతంలో ఆయన్ను చాలామంది బెదిరించేవారని, ఆయనపై దాడి చేస్తామని కూడా హెచ్చరించారని అంటున్నారు. ఇటీవల ప్రవీణ్ పగడాల కూడా తనపై దాడి జరిగే అవకాశం ఉందని అనుమానించారని, దానిపై ఆయనే ఒక వీడియో పోస్ట్ చేశారని చెబుతున్నారు. తనకు ప్రాణ భయం ఉందని ప్రవీణ్ పగడాల చెప్పినా కూడా పోలీసులు ఆయనకు రక్షణ కల్పించలేకపోయారని క్రైస్తవ మత ప్రచారకుడు, పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణం ఇప్పుడు తెలుగు రాష్ట్రాలలో సంచలనం రేపుతోంది. రాజమండ్రి దివాన్ చెరువు - కొంతమూరు జాతీయ రహదారిపై ప్రవీణ్ పగడాల మృతదేహాన్ని మంగళవారం స్థానికులు గుర్తించారు. పక్కనే బైక్ ఉండటంతో బైక్ ప్రమాదంలో ప్రవీణ్ పగడాల చనిపోయినట్లు తొలుత భావించారు. అయితే ప్రవీణ్ పగడాల శరీరంపై గాయాలు కనిపించాయంటూ.. ఆయన అనుచరులు ఈ ఘటనపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు హైదరాబాద్‌కు చెందిన పాస్టర్ ప్రవీణ్ పగడాల.. రాజమండ్రికి ఎందుకు వెళ్లారనేదీ తెలియడం లేదు. హైదరాబాద్ నుంచి విశాఖపట్నానికి బైక్ మీద వెళ్తున్నారంటూ కొన్ని వార్తలు వస్తున్నాయి.బైక్ మీద వెళ్తున్న సమయంలో వెనుక నుంచి ఢీకొట్టి, దాడి చేసి ఉంటారంటూ ప్రవీణ్ పగడాల సన్నిహితులు, అనుచరులు ఆరోపిస్తున్నారు. ప్రవీణ్ పగడాల ఒంటిపై గాయాలు ఉండటంతో సమగ్ర విచారణ జరపాలని స్నేహితులు, అనుచరులు, కొంతమంది పాస్టర్లు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు పోలీసులు కూడా పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణంపై దర్యాప్తు జరుపుతున్నారు. ఎయిర్‌పోర్టు నుంచి ఘటనాస్థలికి వరకూ మొత్తం సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు. మరోవైపు పాస్టర్ ప్రవీణ్ మృతిపై పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. పాస్టర్ ప్రవీణ్ మరణంపై వస్తున్న అనుమానాలపై విచారణ చేయాలని టీడీపీ నేత, మహాసేన రాజేష్ సైతం డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

ప్రవీణ్ పగడాల క్రైస్తవ మత బోధకుడిగా రెండు తెలుగు రాష్ట్రాల్లో అనుచరుల్ని సంపాదించుకున్నారు. కడప జిల్లాతో ఆయనకు అనుబంధం ఉంది. ప్రస్తుతం ఆయన హైదరాబాద్ లో నివశిస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో బోధనకోసం ఆయ అప్పుడప్పుడు వివిధ ప్రాంతాలకు వస్తుంటారు. ఈ క్రమంలో రాజమండ్రి వద్ద కార్యక్రమాలకు వచ్చిన ఆయన అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్టు తెలుస్తోంది.ప్రవీణ్ పగడాల మృతిపై పలువురు క్రైస్తవ మత ప్రచారకులుగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఒకప్పటి సినీ హీరో, ప్రస్తుతం మత ప్రచారకుడిగా ఉన్న రాజా కూడా ప్రవీణ్ పగడాల మృతిపై స్పందించారు. ఆయన ఒక వీడియో విడుదల చేశారు. ప్రవీణ్ మృతి బాధాకరం అని అన్నారు. ఆయన లేని లోటు తీరదని, భౌతికంగా మాత్రమే ఆయన క్రైస్తవ సమాజానికి దూరమయ్యారని చెప్పారు. ఆయన కుటుంబం కోసం ప్రార్థన చేయాలంటూ పిలుపునిచ్చారు.ప్రవీణ్ పగడాల మరణంపై పోలీసులు ఇంకా క్లారిటీ ఇవ్వలేదు. ఆయన డెడ్ బాడీని స్వాధీనం చేసుకుని పోస్ట్ మార్టమ్ కోసం తరలించారు. ఈ విషయంలో పోలీసుల నుంచి ప్రకటన విడుదలైతే దీనిపై మరింత క్లారిటీ వచ్చే అవకాశముంది. అప్పటి వరకు ప్రవీణ్ పగడాల మృతిని ప్రమాదంగా ధృవీకరించలేం, అదే సమయంలో అది హత్య అనేది కూడా నిర్ధారించలేని పరిస్థితి.

# స్వరూపానందకు వారం రోజులు గడువు

విశాఖపట్టణం, మార్చి 26,

విశాఖ శ్రీ శారదా పీఠం వ్యవహారం ఎంతవరకు వచ్చింది? కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత స్వరూపానంద స్వామి కనిపించడం మానేశారా? స్వామి కబ్జాల వ్యవహారం బయటకు వస్తోందా? బయటకు రావడం కంటే సైలెంట్‌గా ఉండడమే బెటరని అంచనాకు వచ్చారా? మరి జీవీఎంసీ నోటీసులకు స్పందన లేకుంటే కూల్చివేతలు ఖాయమా? అవుననే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి.వైసీపీ రూలింగ్‌లో రాజభోగం అనుభవించిన వారిలో శ్రీ శారదా పీఠం స్వరూపానంద స్వామి ఒకరు. భక్తుల మాట కాసేపు పక్కనబెడితే ఆయన ఆశీర్వాదం కోసం రాజకీయ నేతలు, అధికారులు తెగ తిరిగేవారు. అయినా స్వామి జగన్, కొందరు మంత్రులకు మాత్రమే కనిపించేవారు. ఆ తర్వాత ప్రత్యేకంగా కొందరితో మాత్రమే మాట్లాడేవారు.వైసీపీ పాలనలో వందల కోట్ల రూపాయల విలువ చేసే భూములను ఆక్రమించుకున్నారని స్వామిపై ఆరోపణలు లేకపోలేదు. దీనికితోడు స్వామికి ప్రత్యేకంగా భద్రత సైతం ఏర్పాటు చేసింది. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు బాగా పరిపాలన చేస్తారంటూ రెండు ముక్కలు మాట్లాడారు. ధనుర్మాసం పూజలంటూ బయటకు వెళ్తానన్నారు. ఆ తర్వాత హైదరాబాద్‌లో సెటిలవుతానని చెప్పుకొచ్చారు.చివరకు స్వామి పత్తా లేకుండా పోయారు. ఇప్పుడు ఎక్కడ ఉన్నారో తెలీదు. స్వామి కోసం చాలామంది భక్తులు ఎదురు చూస్తున్నారు. స్వామి ఆశీర్వాదం తీసుకుంటే మంచి జరుగుతుందని కొందరు నమ్ముతారు. కూటమి వచ్చాక ఆయన భద్రతను పూర్తిగా తొలగించింది. ఇప్పుడు స్వామి కూడబెట్టిన ఆస్తులపై దృష్టిపెట్టింది.తాజాగా విశాఖ శ్రీ శారదా పీఠానికి గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ జోనల్ కమిషనర్ నోటీసులు ఇచ్చారు. రెవెన్యూ అధికారుల సర్వేలో 22 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించినట్లు గుర్తించారు. అందులో శాశ్వత కట్టడాలు నిర్మించారు. వాటిని వారంలోగా తొలగించాలని నోటీసులో ప్రస్తావించారు అధికారులు. లేకుంటే తామే కూల్చివేస్తామని మఠం మేనేజర్‌కి వాటిని అందజేశారు.తొలగింపుకు అయ్యే ఖర్చు శారదాపీఠం నుంచే వసూలు చేస్తామన్నారు. చిన ముషిడివాడలో శ్రీశారదా పీఠం ఉంది. అందులో దాదాపు 22 సెంట్ల భూమి ప్రభుత్వ స్థలం ఉంది. అందులో 203 చదరపు గజాల స్వయం జ్యోతి మండపం ఉంది. 13 గజాల స్థలం సర్వే సంఖ్య 90లో ఉంది. మిగిలిన స్థలం సర్వే సంఖ్య 91/9లో వుడా లేఅవుట్‌కి సంబంధించిన ఓపెన్ స్పేస్‌లో ఉంది.190 చదరపు గజాల ప్రాంతంలో సుబ్రహ్మణ్య స్వామి ఆలయం, వుడాకి సంబంధించి ఓపెన్ స్పేస్ ఉంది. ఓవరాల్‌గా చూస్తే శారదా పీఠంలో 9 శాశ్వత కట్టడాలు ఉన్నాయి. అందులో కొంత ప్రభుత్వ భూమి ఉంది. ప్రభుత్వం నోటీసులపై స్వామి నుంచి ఎలాంటి రియాక్షన్ లేదు. రేపో మాపో స్వరూపానందకు సంబంధించి ఇంకెన్ని కొత్త విషయాలు బయటకు వస్తాయో చూడాలి.

## శ్రీవారి ఆలయంలో ఆగమోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుమల,

తిరుమల శ్రీవారి ఆలయంలో మార్చి 30వ తేదీన ఉగాది ఆస్థానాన్ని పురస్కరించుకుని మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఆగమోక్తంగా జరిగింది.ఈ సందర్భంగా ఆలయం వెలుపల టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడుతో కలిసి టీటీడీ ఈవో జె.శ్యామలరావు మీడియాతో మాట్లాడుతూ సాధారణంగా ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు వచ్చే మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. స్వామివారి మూలవిరాట్టును వస్త్రంతో కప్పి ఆలయ శుద్ధి నిర్వహించారని చెప్పారు.ఈ ఆగమ ప్రక్రియ లో నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయమంతటా ప్రోక్షణం చేశారు. ఆ తరువాత స్వామివారి మూలవిరాట్టుకు కప్పిన వస్త్రాన్ని తొలగించి ప్రత్యేక పూజ, నైవేద్యం కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు.ఈ కార్యక్రమంలో పలువురు బోర్డు సభ్యులు, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం, ఇతర ఆలయ అధికారులు పాల్గొన్నారు.


# పోసాని ఎక్కే గుమ్మం... దిగే గుమ్మం...

విజయవాడ, మార్చి 26, (

పోసాని కృష్ణమురళికి బెయిల్ లభించింది. కానీ ఆ ఆనందం ఆయనకు ఎక్కువ రోజులు నిలవలేదు. ప్రతి సోమవారం తో పాటు గురువారం సిఐడి కార్యాలయానికి వచ్చి సంతకాలు చేయాల్సి ఉంది. సిఐడి కోర్టు బెయిల్ ఇచ్చినప్పుడే ఈ షరతు పెట్టింది. దీంతో పోసాని కృష్ణ మురళికి బెయిల్ అయితే లభించింది కానీ.. కేసుల నుంచి విముక్తి కలిగేలా కనిపించడం లేదన్న టాక్ వినిపిస్తోంది. గత నెల 26న ఆయన అరెస్ట్ అయ్యారు. కేసుల మీద కేసులు నమోదయ్యాయి. కస్టడీల మీద కస్టడీలు కొనసాగాయి. చివరకు 24 రోజుల అనంతరం ఆయన జైలు నుంచి విముక్తి పొందారు.వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చంద్రబాబుతో పాటు పవన్ కళ్యాణ్ పై అనుచిత వ్యాఖ్యలు చేశారు పోసాని కృష్ణ మురళి. ఫోటో మార్ఫింగ్ చేసి సైతం ఆయన కామెంట్స్ చేశారన్నది ప్రధాన ఆరోపణ. తొలుత ప్రకాశం జిల్లా పోలీసులు గత నెల 26న హైదరాబాదులో కృష్ణ మురళిని అదుపులోకి తీసుకున్నారు. అది మొదలు ఆయనపై కేసులు నమోదు అవుతూనే ఉన్నాయి. ప్రకాశం, కర్నూలు, గుంటూరు జిల్లా జైలులకు తరలిస్తూ ఆయన కస్టడీ 24 రోజులు పాటు కొనసాగింది. కొద్ది రోజుల కిందట అన్ని కేసులలో ఆయనకు బెయిల్ లభించింది. కానీ ఇంతలో సిఐడి పీటి వారెంట్ ఇచ్చింది. దీంతో పోసానిని కర్నూలు నుంచి గుంటూరు జిల్లా జైలుకు తరలించారు. అయితే న్యాయస్థానంలోనే తనకు ఆరోగ్యం బాగా లేదంటూ పోసాని కృష్ణ మురళి కన్నీటి పర్యాంతం అయ్యారు. అయినా సరే అప్పట్లో న్యాయస్థానం ఆయన రిమాండ్ ను కొనసాగించింది.ఈ నెల 21న పోసాని కృష్ణ మురళి సిఐడి కోర్టులో బెయిల్ పిటిషన్ వేశారు. మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోరారు. దీంతో కోర్టు షరతులతో కూడిన బెయిల్ ఇచ్చింది. రెండు లక్షల పూచికత్తుతో ఆయనకు బెయిల్ ఇచ్చింది కోర్టు. ప్రతి సోమ, గురువారాల్లో సిఐడి కార్యాలయానికి వచ్చి సంతకం చేయాలని న్యాయస్థానం ఆదేశించింది. మీడియాతో కేసుల గురించి అస్సలు మాట్లాడకూడదు అని సూచించింది. అదే సమయంలో పోసాని కృష్ణ మురళికి సిఐడి విచారణకు సహకరించాలని కూడా ఆదేశాలు ఇచ్చింది. దీంతో పోసాని కృష్ణ మురళికి ఉపశమనం దక్కలేదని తేలిపోయింది. తదుపరి కొనసాగింపు కూడా ఉంటుందని స్పష్టమైంది.కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే పోసాని కృష్ణ మురళి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో కాస్త యాక్టివ్ గానే కనిపించారు. అయితే ఉన్నట్టుండి ఆయన ఓ రోజు కీలక ప్రకటన చేశారు. తనకు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదని తేల్చేశారు. ఇకనుంచి రాజకీయాలు మాట్లాడనని కూడా చెప్పుకొచ్చారు. అయితే గతంలో పోసాని కృష్ణ మురళి చేసిన కామెంట్స్ ను టిడిపి, జనసైనికులు మరిచిపోలేదు. అందుకే పాత కేసులు తెరపైకి వచ్చాయి. పోసాని అరెస్టు జరిగింది. ఆయనకు బెయిల్ లభించింది. అయితే అది మనశ్శాంతి లేని బెయిల్ అని తేలిపోయింది. సో ముమ్మందు పోసాని వ్యవహార శైలి బట్టి కేసుల తీవ్రత ఉంటుందని విశ్లేషకులు సైతం తేల్చి చెబుతున్నారు.

ఇక పీకల్లోతు కష్టాల్లో బోరుగడ్డ

బోరుగడ్డ అనిల్ కుమార్(విషయంలో హైకోర్టు తీవ్ర వ్యాఖ్యానాలు చేసింది. ఆయన తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో బోరుగడ్డ మరోసారి కేసుల ఉచ్చులో పడాల్సి వచ్చింది. గత వైసిపి ప్రభుత్వంలో కూటమినేతలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడేవారు బోరుగడ్డ. వ్యక్తిగత కామెంట్లకు సైతం వెనుకడుగు వేసే వారు కాదు. చాలా రకాలుగా మాట్లాడిన సందర్భాలు ఉన్నాయి. ముఖ్యంగా పవన్ కళ్యాణ్, చంద్రబాబు, లోకేష్ లపై వ్యక్తిగతంగానే కాకుండా కుటుంబ పరంగా కూడా విమర్శలు చేశారు. అనుచిత వ్యాఖ్యలు కొనసాగించారు. అయితే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయనకు చుక్కలు కనిపిస్తున్నాయి. తాజాగా కోర్టు ధిక్కరణ కింద కూటమి ప్రభుత్వానికి ఆయన అస్త్రం అందించారు. దానిపైనే కేసులు నమోదు కావడంతో ఆయన హైకోర్టు ఆగ్రహానికి గురికావాల్సి వచ్చింది.రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉండేవారు బోరుగడ్డ. ఆ సమయంలో తన తల్లికి అనారోగ్యం ఉందంటూ ఆయన మధ్యంతర బెయిల్ పొందారు. అయితే సకాలంలో రాజమండ్రి జైల్లో తిరిగి లొంగిపోలేదు. అదే ఇప్పుడు ఆయనకు ఇబ్బందికరంగా మారింది. పోలీసులు అనిల్ కుమార్ పై హైకోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు బోరుగడ్డ ఎందుకు సకాలంలో జైల్లో లొంగి పోలేదని ప్రశ్నించింది. దీనిపై వివరణ ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చింది. దీంతో బోరుగడ్డ ఇరకాటంలో పడినట్లు అయ్యింది. వాస్తవానికి బోరుగడ్డ లొంగి పోవాల్సింది ముందు రోజు సాయంత్రం. కానీ ఆయన తరువాత రోజు ఉదయం రాజమండ్రి జైలుకు వచ్చి సరెండర్ అయ్యారు. దీంతో రాజమండ్రి జైలు అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగానే పోలీసులు కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు



చేశారు. దీనిపై విచారణ చేపట్టిన కోర్టు.. బోరుగడ్డకు నోటీసులు జారీ చేసింది.బోరుగడ్డ లొంగిపోవడం వెనుక పెద్ద ఎపిసోడ్ నడిచింది. తన తల్లి అనారోగ్యానికి సంబంధించి సమర్పించిన డాక్టర్ ధృవీకరణ పత్రం ఫేక్ అని పోలీసులు గుర్తించారు. వెంటనే వారు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ విచారణలో ఉండగానే.. బెయిల్ గడువు ముగిసింది. ఇంతలోనే తనకు బెయిల్ పొడిగించాలని మరోసారి బోరుగడ్డ కోర్టును ఆశ్రయించారు. దీనిపై సైతం కోర్టు విచారణ చేసింది. కానీ పోలీసులు బలమైన ఆధారాలు సమర్పించడంతో బెయిల్ పొడిగించడం కుదరదని తేల్చి చెప్పింది. అంతేకాదు ఎక్కడున్నా సరే.. అత్యవసరంగా వచ్చి అధికారుల ముందు లొంగిపోవాలని ఆదేశించింది. దీంతో జైలు అధికారుల ముందు లొంగిపోయారు బోరుగడ్డ. కానీ ఆయనపై పోలీసులు నమోదు చేసిన నకిలీ డాక్టర్ సర్టిఫికేట్ కేసు సహా.. హైకోర్టును తప్పుదోవ పట్టించారన్న కేసులు మాత్రం విచారణలో ఉన్నాయి. తాజాగా వీటిపై విచారణ జరిపిన కోర్టు.. బూరుగడ్డ వంటి వ్యక్తులు సమాజానికి ప్రమాదకరమని.. ఇలాంటి వారిని ప్రత్యేకంగా చూడాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించింది.ప్రధానంగా తప్పుడు డాక్టర్ సర్టిఫికెట్ సమర్పించి మధ్యంతర బెయిల్ పొందిన వైనంపై విచారణ నివేదికలను సీల్డ్ కవర్లో కోర్టు ముందు ఉంచాలని పోలీసులను న్యాయస్థానం ఆదేశించింది. నిర్దేశించిన సమయంలోపు జైలు అధికారుల ముందు ఎందుకు హాజరు కాలేదు వివరణ ఇవ్వాలని నోటీసులు జారీచేసింది కోర్టు. దీనిపై ప్రత్యేకంగా పిటిషన్ వేయాలని.. కేసు నమోదు చేయాలని ఆదేశించడం గమనార్హం.

# కాంగ్రెస్ వైపే.. కేసీఆర్...?

హైదరాబాద్, మార్చి 26,

సీఆర్ ఎప్పుడూ లేనిది ఇటీవల చంద్రబాబు గురించి ఎక్కువగా మాట్లాడుతున్నారు. ఆయన ఎన్డీఏ కూటమిగా తెలంగాణలో అడుగుపెడుతున్నారని కూడా ఆరోపిస్తున్నారు. తాను ఒంటరిగానే పోటీ చేస్తానని.. అధికారంలోకి వస్తానని చెబుతున్నారు. అసలు చంద్రబాబు పొత్తులతో పోల్చుకోవాల్సిన అవసరం కేసీఆర్ కు లేదు. కానీ రాజకీయ నాయకుల మాటలకు అర్థాలే వేరు అన్నట్లుగా ఆలోచిస్తే.. కేసీఆర్ మాటల్లో లోతైన అర్థం ఉంటుందన్న అభిప్రాయం వినిపిస్తోంది.నియోజకవర్గాల పునర్విభజనలో దక్షిణాదికి అన్యాయం జరుగుతుందని చెన్నైలో నిర్వహించిన సమావేశం తెలంగాణ రాజకీయాల్లో మార్పులు తీసుకువచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. ఇండియా కూటమిలో కీలకమైన పార్టీ డీఎంకే. ఆ పార్టీ ఓ విధానం తీసుకుని సమావేశం ఏర్పాటు చేసింది. కాంగ్రెస్ కూటమిలోని పార్టీ కాబట్టి కాంగ్రెస్ సీఎం హాజరయ్యారు. కేటీఆర్ కూడా డీఎంకే నేతలు వచ్చి పిలిచినప్పుడే వస్తానని చెప్పారు. ఆ ప్రకారం హాజరయ్యారు. ఈ సమావేశం ఎజెండా బీజేపీని టార్గెట్ చేయడం . అదే జరిగింది బీజేపీ దక్షిణాదికి అన్యాయంచేస్తోందని అందరూ వాదించారు. ఈ వాయిస్ వినిపించిన వారిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కూడా ఉన్నాయిచెన్నై



సమావేశం తర్వాత తెలంగాణ సమీకరణాలు మారిపోయే సూచనలు కనిపిస్తున్నాయి. జాతీయ స్థాయిలో బీజేపీకి వ్యతిరేకంగా పోరాడే వారిలో రేవంత్, కేటీఆర్ ఉంటారు. అదే ఫార్ములా తెలంగాణకు అన్వయించేందుకు ఓ అవకాశం ఏర్పడినట్లే . ఇప్పటికిప్పుడు కాకపోయినా భవిష్యత్ రాజకీయాలకు ఇదో పునాది అవుతుందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నారు. బీజేపీతో పొత్తు కోసం గతంలో బీఆర్ఎస్ ప్రయత్నించిందని స్వయంగా మోదీ చెప్పారు. తాను అవసరం లేదని చెప్పానన్నారు. భవిష్యత్ లోనూ బీఆర్ఎస్ తో పొత్తులు ఉండబోవని చెప్పారు. ఏపీ తరహాలో తెలంగాణలో కూడా ఎన్డీఏ ఉంటుందన్న ప్రచారం ఇటీవలి కాలంలో ఊపందుకుంది. టీడీపీ, బీజేపీ తెలంగాణలో కలుస్తాయని అంటున్నారు. దక్షిణ తెలంగాణలో పట్టు సాధించాలంటే.. టీడీపీ, జనసేనతో కలవడం మంచిదని బీజేపీ హైకమాండ్ అనుకుంటోందని చెబుతున్నారు. దక్షిణ తెలంగాణలో కాంగ్రెస్ బలంగా ఉంది. ఈ క్రమంలో బీఆర్ఎస్ ఒంటరిగా పోటీ చేస్తే అటు ఉత్తర తెలంగాణలో.. ఇటు దక్షిణ తెలంగాణలోనూ పార్లమెంట్ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలే వస్తాయన్న ఆందోళన ఉంది. బీజేపీ కలుపుకునే అవకాశం లేదు కాబట్టి మెల్లగా కాంగ్రెస్ వైపు వెళ్లే ప్రయత్నంలో ఓ అడుగు చెన్నైలో పడిందన్న అభిప్రాయం వినిపిస్తోంది ముందు ముందు జరగబోయే పరిణామాలు తదుపరి రాజకీయ దశ, దిశను మార్చే అవకాశం ఉంది

## రేవంత్ ఇంటికిక్యూ కడుతున్న ఆశావహులు

హైదరాబాద్, మార్చి 26

తెలంగాణలో మంత్రి వర్గ విస్తరణకు కాంగ్రెస్ అధిష్టానం అమోద ముద్ర వేసినట్టు తెలుస్తోంది. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ పెద్దలు మంత్రి వర్గ విస్తరణకు సానుకూల సంకేతాలు ఇచ్చినట్టు తెలుస్తోంది. తాజా మంత్రి వర్గ విస్తరణలో కనీసం నలుగురికి మంత్రి పదవులు దక్కే అవకాశం ఉన్నట్టు సమాచారం. మంత్రి పదవులతో పాటు డిప్యూటీ స్పీకర్, చీఫ్ విప్ పదవులను సైతం భర్తీ చేయనున్నారు.తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం సాయంత్రం ఢిల్లీ చేరుకున్నారు. ఆయనతో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఉన్నారు. సీఎం రేవంత్ బృందం ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సమావేశం అయ్యారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ కూడా ఈ భేటీలో పాల్గొ న్నారు.కాంగ్రెస్ పెద్దలతో జరిగిన భేటీలో తెలంగాణలో తాజా రాజకీయ పరిస్థితులు, మంత్రివర్గ విస్తరణలో ఎవరికి అవకాశం కల్పించాలనే అంశాలపై చర్చించారు. దీంతో పాటు ఏప్రిల్ 24 నుంచి 26 వరకు హైదరాబాద్‌లో నిర్వహించే అంతర్జాతీయ అంతర్జాతీయ సదస్సుపై సుదీర్ఘంగా చర్చించినట్లు కాంగ్రెస్ వర్గాలు వివరించాయి. హైదరాబాద్‌లో జరిగే భారత సంవిధాన్ సమావేశాలకు సుమారు 80 దేశాల నుంచి ప్రతినిధులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు.ఢిల్లీలో కాంగ్రెస్ కీలక నేతలతో జరిగిన భేటీలో తెలంగాణ మంత్రి వర్గ విస్తరణపై ఎక్కువగా చర్చ జరిగినట్టు నేతలు వివరించారు. ప్రస్తుతం తెలంగాణ మంత్రి వర్గంలో ఆరుగురికి చోటు కల్పించేందుకు అవకాశం ఉంది. ప్రస్తుతానికి నలుగురికి అవకాశం కల్పించాలని భావిస్తున్నారు. మిగిలిన రెండు ఖాళీలను మరో సారి భర్తీ చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

# బీసీ ఉచ్చులో బీజేపీ

హైదరాబాద్, మార్చి 26,

బీసీ రిజర్వేషన్ బిల్లు శాసన సభలోను, శాసన మండలిలో ఆమోదం పొందింది. ఇక బీసీ రిజర్వేషన్లు పెరగనున్నాయి. ఇప్పటి దాకా విద్య ఉద్యోగ, రాజకీయ అవకాశాల్లో బీసీలకు 29 శాతం రిజర్వేషన్లు అమల్లో ఉన్నాయి. దాన్ని పెంచుతూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీని కోసం రాష్ట్రవ్యాప్తంగా కుల గణన నిర్వహించింది. ఈ గణనలో 56.36 శాతం బీసీలు రాష్ట్రంలో ఉన్నట్లు తేలింది. ఈ మేరకు బీసీలకు 42 శాతానికి రిజర్వేషన్ల పెంచుతూ రేవంత్ సర్కార్ నిర్ణయం తీసుకుంది. ఆ మేరకు సంబంధింత బిల్లులకు చట్ట సభలు ఆమోద ముద్ర వేశాయి. అంటే ఇక నుంచి విద్యా సంస్థల్లో, ప్రభుత్వ నియామకాల్లో, అదే రీతిలో పంచాయతీ, మున్సిపాలిటీ, కార్పోరేషన్ వంటి స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల ఫలాలు బీసీలకు దక్కనున్నాయి. ఇంతటితో పని పూర్తి అయినట్లు కాలేదు. కేవలం రాష్ట్ర ప్రభుత్వంలోని చట్ట సభలు బిల్లుకు ఆమోద తెలిపి కేంద్రానికి పంపనుంది.దేశంలో రిజర్వేషన్ల పెంచాలన్నా, తగ్గించాలన్నా, ఆయా కులాల జాబితాను మార్చాలన్నా రాష్ట్రాలకు అధికారం లేదు. ఈ అంశం కేంద్ర జాబితాలోది. కేంద్రమే నిర్ణయం తీసుకోవాలి. ఇక చట్ట సభల ఆమోదం పొందిన ఈ రిజర్వేషన్ల పెంపు బిల్లును రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపనుంది. ఆ బిల్లును పార్లమెంట్ మూడింట రెండు వంతుల మెజార్టీతో ఆమోదించాలి. ఎందుకంటే సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పుల ప్రకారం ఎస్సీ,ఎస్టీ, బీసీలకు ఇచ్చే రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదు. అలా మించితే రాజ్యాంగ సవరణ చేసి షెడ్యూల్ -9లో చేర్చాలి. ఈ రిజర్వేషన్లు బీసీలకు రిజర్వేషన్ పెంచి ఇస్తే ప్రస్తుతం ఎస్సీలకు 15శాతం, ఎస్టీలకు 10 శాతం కలుపుకుంటే మొత్తం 67 శాతానికి చేరుకుంటుంది. ఇది సుప్రీం కోర్టు తీర్పులకు వ్యతిరేకం. అలా సవరణ చేయాలంటే అందుకు సరైన కారణాలు వెల్లడించారు. అందుకు తగిన గణాంక సమాచారం అందుబాటులో ఉంటే అప్పుడు తగిన కారణాలతో రిజర్వేషన్లు 50 శాతం కంటే ఎక్కువగా పెంచుకోవచ్చని సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఉన్నాయి. ఈ కారణలతోనే రేవంత్ సర్కార్ బీసీ కమిషన్ ఏర్పాటు చేసి లీగల్‌గా ఎదుర్కొనే రీతిలో పటిష్టంగానే బీసీ గణన చేపట్టింది. సమగ్ర కుటుంబ సర్వే తర్వాతనే బీసీ లెక్కలను తెల్చి చెప్పింది. ఆ తర్వాత చట్టసభల్లో ఈ బిల్లులకు ఆమోద ముద్ర పడింది. ఇక ఇప్పుడు బీసీ రిజర్వేషన్ల పెంపు బంతి కేంద్రం కోర్టులో పడేసింది. పార్లమెంట్‌లో మూడింట రెండు వంతుల మద్దతు ఇస్తే రాజ్యాంగ సవరణ వీలవుతుంది. అప్పుడే రాష్ట్రంలో పెంచిన బీసీ రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయి.కాంగ్రెస్ అధికారంలోకి రాక ముందే బీసీ గణన చేపడతామని చెప్పింది. బీసీ రిజర్వేషన్లు పెంచాల్సిన అవసరం ఉందని ఆ పార్టీ ముఖ్యనేత రాహుల్ గాంధీ చెప్పారు. తెలంగాణ ఎన్నికల్లో ఇదే ప్రస్తావించారు. అందుకు అనుగుణంగా రేవంత్ సర్కార్ ఇప్పుడు బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లును ఆమోదించి కేంద్రానికి



పంపింది. అయితే దేశవ్యాప్త కులగణన విషయంలో మోదీ సర్కార్ సానుకూలంగా స్పందిస్తుందా అన్నది వేచి చూడాలి. ఎందుకంటే పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో బీసీలంతా ఐక్యంగా ఉండాలని, బీసీ లెక్కలు అవసరం లేదన్న రీతిలో మోదీ నర్మగర్భంగా తన అభిప్రాయాన్ని వెల్లడించారు. ఇప్పుడు తెలంగాణలో బీసీ రిజర్వేషన్లు పెంపు బిల్లుకు ఆమోద ముద్ర వేస్తే అది కాంగ్రెస్ పార్టీకి దేశవ్యాప్తంగా ఓ అస్త్రంగా మారనుంది. తెలంగాణలో కాంగ్రెస్ ను గెలిపించినందుకు మేం బీసీలకు మేలు చేసేలా రిజర్వేషన్లు పెంచామని, పార్టీ మ్యానిఫెస్టోలో పెట్టింది చేసి చూపించామని చెప్పుకునే పరిస్థితి ఉంటుంది. అలా బీసీ ఓటు బ్యాంకు కాంగ్రెస్‌కు దగ్గరయ్యే అవకాశం లేకపోలేదు. ఇలా కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉండేలా మోదీ సర్కార్ తెలంగాణ బీసీ రిజర్వేన్ల పెంపు బిల్లుకు సానుకూలంగా స్పందిస్తుందా లేదా చూడాలి.తెలంగాణ బీసీ రిజర్వేషన్ల పెంపునకు అనుకూలంగా ఎన్డీఏ ప్రభుత్వం ఆమోద ముద్ర వేస్తే తేనె తుట్ట కదిపినట్లే. ఇదే రీతిలో అన్ని రాష్ట్రాల నుంచి రిజర్వేషన్ల పెంచాలన్న డిమాండ్లు వస్తాయి. బీజేపీ పాలిత రాష్ట్రాల నుంచి ఈ సమస్య ఎదురుకావచ్చు. ఒక వేళ ఈ రిజర్వేషన్ల బిల్లుపై ఎలాంటి చర్చ లేకుండా పక్కన పెడితే బీసీ వ్యతిరేక పార్టీగా బీజేపికి తెలంగాణలోను, దేశవ్యాప్తంగా ముద్రపడే అవకాశం ఉంటుంది. ఇలాంటి డిమాండ్లే ఏపీ నుంచి, ఇతర ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల నుంచి వచ్చే అవకాశం ఉంది. వారిని కాదని కేంద్రంలో బలహీనంగా ఉన్న బీజేపీ పార్టీ నిర్లయం తీసుకోలేని పరిస్థితి. ఒక వేళ తీసుకుంటే ఆ సక్సెస్ తన ఖాతాలో పడుతుందా లేక మొదటి నుంచి బీసీ రాగం వినిపించిన కాంగ్రెస్ ఖాతాలో పడుతుందా అన్న డైలమా కమలనాథుల్లో లేకపోలేదు. రానున్న రోజుల్లో ఈ బీసీ ఉచ్చు నుంచి బీజేపీ ఎలా తప్పుకుంటుందో వేచి చూడాలి. అయితే తెలంగాణలోని రాజకీయ పార్టీలను తీసుకుని ప్రధానికి కలవాలని ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే ఈ రిజర్వేషన్ల బిల్లు ఎందాక ముందుకు సాగి ఆచరణలోకి వస్తుందో మాత్రం వేచి చూడాలి.

# మహిళా రైతులకు డ్రోన్లు...

వరంగల్, మార్చి 26,

వసాయ రంగంలోనూ యంత్రాల వినియోగం రోజురోజుకు పెరుగుతోంది. సాగు విస్తీర్ణం పెరగడంతో కూలీల కొరత ఏర్పడుతున్న నేపథ్యంలో.. విత్తు నాటే సమయం నుంచి పంట ఇంటికొచ్చే సమయం వరకు పలు సందర్భాల్లో వివిధ రకాల యంత్రాలను రైతులు వినియోగిస్తున్నారు. దీంతో రైతులకు అవసరమైన యంత్రాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీపై అందిస్తున్నాయి. గత కొన్నేళ్లుగా తెలంగాణ రాష్ట్రంలో నిలిచిపోయిన వ్యవసాయ యాంత్రీకరణ పథకంను రేవంత్ సర్కార్ మళ్లీ అమలు చేసేందుకు నిర్ణయించింది. అయితే, ఈసారి మహిళలకే వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.తెలంగాణ ప్రభుత్వం మహిళా రైతులకు శుభవార్త చెప్పింది. వ్యవసాయ యాంత్రీకరణలో తొలిసారిగా మహిళా రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. 2018లో అప్పటి ప్రభుత్వం సబ్సిడీపై రైతులకు యాంత్రీకరణ పనిముట్లను అందజేసే కార్యక్రమాన్ని నిలిపివేసింది. గతంలో ఎస్సీ, ఎస్టీలకు 90శాతం, ఇతరులకు 50శాతం సబ్సిడీ ఉండేది. ప్రస్తుతం అందరికీ 50శాతం సబ్సిడీతో ఈ యాంత్రీకరణ పరికరాలను అందజేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.వ్యవసాయ యాంత్రీకరణలో తొలిసారిగా మహిళా రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 10,812 యూనిట్లు అందజేసేందుకు జిల్లా వ్యవసాయశాఖ అధికారులకు మార్గదర్శకాలతో కూడిన ఆదేశాలు జారీ చేసింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను రూ. 24.90 కోట్ల సబ్సిడీని రైతులకు అందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరంలోనే.. ఈనెల 31వ తేదీలోగా పథకాన్ని అమలు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. అయితే, ప్రస్తుతం సమయం తక్కువగా ఉండటంతో లబ్ధిదారుల ఎంపికలో అధికారులు తలమునకలయ్యారు.వ్యవసాయ పనుల్లో రైతులకు దోహదపడే 14 రకాల యంత్ర పరికరాలను 50శాతం సబ్సిడీతో మహిళా రైతులకు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా చేతిపంపులు, పవర్ స్ప్రేయర్లు, డ్రోన్లు, రోటోవేటర్లు, విత్తనాలు/ఎరువులువేసే పరికరాలు, ట్రాక్టర్లతో దమ్ముచేసే పరికరాలు, పవర్ టిల్లర్లు, ఎద్దులతో బోదలు పోసే పరికరాలు, ట్రాక్టర్లతో బోదలుపోసే పరికరాలు, పవర్ వీడర్స్, బ్రష్ కట్టర్స్, ట్రాక్టర్లు, మొక్కజొన్న కోత పరికరాలు, గడ్డిచుట్టే పరికరాలను ప్రభుత్వం సబ్సిడీపై అందించనుంది.ఈ నెలాఖరులోగా మహిళా రైతుల నుంచి దరఖాస్తులను అధికారులు స్వీకరించనున్నారు. జిల్లాలకు కేటాయింపుల ఆధారంగా ఆయా మండలాలకు నిధులు, లబ్ధిదారుల సంఖ్య కేటాయింపులు చేయనున్నారు. లక్ష రూపాయల లోపు యూనిట్ ఉంటే మండల వ్యవసాయ శాఖ అధికారి కన్వీనర్ గా ఉన్న కమిటీ, లక్షకు మించితే కలెక్టర్ చైర్మన్ గా ఉన్న కమిటీ లబ్ధిదారులను ఎంపిక చేయనుంది. ఎంపికయిన వారికి సబ్సిడీపై వారు కోరుకున్న యంత్రాలను అందిస్తారు.

# వైరల్ అవుతున్న కోమటిరెడ్డి కామెంట్స్

హైదరాబాద్, మార్చి 26,

కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఉన్న కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తనను మించిన నేత లేరన్న భావనలో ఉన్నట్లుంది. మంత్రి వర్గ విస్తరణపై కోమటిరెడ్డి చేసిన కామెంట్స్ ఇప్పుడు కాంగ్రెస్ లో కాక రేపుతున్నాయి. తనకు మంత్రి పదవి వస్తుందని అనుకుంటున్నానని అనడం వరకూ ఓకే కానీ, సామర్థ్యాన్ని బట్టి మంత్రులను ఎంపిక చేయాలని కోరడంలో ఆంతర్యమేంటని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రశ్నించారు. భువనగిరి పార్లమెంటు నియోజవర్గంలో జరిగిన ఎన్నికలు జరిగితే తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించానని తలిపారు. అదే సమయంలో ప్రజల పక్షాన తాను నిలబడతానని అన్న కోమటిరెడ్డి తనకు హోంశాఖ అంటే ఇష్టమంటూ మనసులో మాటను బయటపెట్టారు. అయితే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఒక విషయం గుర్తుంచుకోవాల్సి ఉంటుంది. 2018 ఎన్నికల్లో మునుగోడు నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలిచి పార్టీ నాయకత్వంపై అలిగి బీజేపీలోకి వెళ్లిన కోమటిరెడ్డి తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ తరుపున పోటీ చేసి ఎందుకు ఓటమి పాలయ్యారంటూ ప్రశ్నిస్తున్నారు. అంత కెపాసిటీ ఉంటే నాడు ఉప ఎన్నికల్లోనూ గెలిచేవారివిగా అంటూ కొందరు సోషల్ మీడియాలో సెటైర్లు వేస్తున్నారు. తనకు తాను తోపు అని ఊహించుకుంటే సరిపోదని, ప్రజలు ఆదరిస్తేనే ఎవరైనా ఎమ్మెల్యే అవుతారని తెలిపారు. కాంగ్రెస్ అధినాయకత్వం పై అలిగి బీజేపీ లోకి వెళ్లిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తర్వాత ఎందుకు మళ్లీ కాంగ్రెస్ లోకి వచ్చారని నిలదీస్తున్నారు. డబ్బు ఉంటేనే సరిపోతుందా? అని ఫైర్ అవుతున్నారు.. మీ సోదరుడు లాగా పార్టీని నమ్ముకుని ఉండకుండా ఎందుకు పార్టీని



మార్చాల్సి వచ్చిందో చెప్పాలన్నారు. కోమటిరెడ్డి కుటుంబానికి రెండు మంత్రిపదవులు ఇవ్వడమేంటని కూడా కాంగ్రెస్ అభిమానులు ప్రశ్నిస్తున్నారు. పార్టీలు తమ ప్రయోజనాల కోసం మారేవారికి మంత్రి పదవులు ఇవ్వకూడదని కొందరు ఇప్పటికే పార్టీ నాయకత్వానికి ఫిర్యాదులు పంపినట్లు తెలిసింది. పార్టీ సిద్ధాంతాలను నమ్ముకుని, దశాబ్దాలుగా కాంగ్రెస్ జెండా మోస్తూ ఆ పార్టీ నీడలోనే కష్టాలు పాలయిన నేతలకు మాత్రమే మంత్రి పదవి ఇస్తే బాగుంటుందని, అంతే తప్ప ఎన్నికలకు ముందు పార్టీలోకి వచ్చారంటూ మంత్రి పదవులు అప్పజెపితే ఫిరాయింపులకు అధినాయకత్వమే ప్రోత్సహించినట్లవుతుందని కూడా వ్యాఖ్యానిస్తున్నారు. గడ్డం వివేక్ కు కూడా ఇదే విధానం వర్తిస్తుందని, కాంగ్రెస్ ను నమ్ముకున్న వారికే మంత్రి పదవులు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీలో డిమాండ్ ఊపందుకుంది. మంత్రి వర్గ విస్తరణ వేళ ఇది పార్టీ హైకమాండ్ కు తలనొప్పిగా మారింది.

## ప్రధానిపై వ్యతిరేకత.. బంగ్లాదేశ్‌లో మరోసారి అల్లర్లు

ఢాకా మార్చి 26

గత ఏడాది బంగ్లాదేశ్‌లో పెద్ద ఎత్తున అల్లర్లు చెలరేగిన విషయం తెలసిందే. అయితే తాజాగా బంగ్లాదేశ్‌లో మరోసారి అల్లర్లు చెలరేగే అవకాశం ఉంది. మాజీ ప్రధాని షేక్ హసీనా రాజీనామా తర్వాత మహమద్ యూనస్ తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు చేశారు. అయితే మహమద్‌కు వ్యతిరేకంగా బంగ్లాదేశ్‌లో అల్లర్లు చెలరేగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో అక్కడి ఆర్మీ వర్గాలు అత్యవసర సమావేశం నిర్వహించినట్లు సమాచారం. ఆర్మీ చీఫ్ జనరల్ వకార్ ఉజ్ జమాన్ నేతృత్వంలో ఐదురురు లెఫ్టినెంట్ జనరల్స్, ఎనిమిది మంది మేజర్లు, ఇతర ముఖ్య అధికారులు ఈ సమావే:లో పాల్గొన్నారు. ప్రజల్లో అశాంతి, అపనమ్మకం పెరిగిందని రానున్న రోజుల్లో తీవ్ర పరిణామాలు ఎదురయ్యే అవకాశం ఉందని ఆర్మీ వర్గాలు తెలిపాయి.

## పురుగుల బారినుంచి కాపాడండి

ఆదిలాబాద్ గుడిహత్నూర్ మండలం కొల్హారీ గ్రామంలో గ్రామస్థులపై పురుగులు దండేత్తాయి. గ్రామస్థుల కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయి. గత సంవత్సరం రైతుల వద్ద నుండి జొన్నల కొనుగోలు చేసి చేసినా మార్క్ ఫెడ్ సంస్థ కొల్హారీ గ్రామ సమీపంలోని గోదాం లో నిలవ చేసారు.

# అధికారుల అత్యుత్సాహం

అదిలాబాద్, మార్చి 26, (

మంచిర్యాల జిల్లా కేంద్రంలో మున్సిపల్ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారు. జిల్లా కేంద్రంలోని వంద ఫీట్ల రోడ్డులో నివాసముంటున్న ఓ దళిత కుటుంబంపై శనివారం సాయంత్రం మున్సిపల్ అధికారులు, సిబ్బంది అత్యుత్సాహం ప్రదర్శించారు. ఇంటి పన్ను కట్టలేదని కుటుంబాన్ని బయటకు రమ్మని, మహిళ అని కూడా చూడకుండా వారి కోడలు పిల్లలను లోపల ఉండగానే దౌర్జన్యంగా గేటుకు తాళం వేసినట్లు బాధిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులు గడువు ఇవ్వాలని కోరిన మాట వినలేదని చెప్పారు. అనారోగ్యంతో బాధపడుతున్నామని చెప్పినా పట్టించుకోకుండా నానా హంగామా చేసి పరువు తీశారని వాపోయారు. దళితులమనే చిన్న చూపుతోనే మున్సిపల్ అధికార యంత్రాంగం హేళన చేసి పరువు తీశారని, మున్సిపల్ నిబంధనలు ఉల్లంఘించి తమను మనస్తాపానికి గురిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని కోరారు.ట్యాక్స్ కట్టలేదని చెప్పడానికి ఇద్దరు, ముగ్గురు వచ్చినా సరిపోతుంది కదా చాలా మంది ఎందుకు వచ్చారని అడగటంతో ఇంటి వద్ద గొడవ జరిగింది. ఇష్టం వచ్చినట్లు మాట్లాడకూడదని, నోటీసులు ఇచ్చి వెళ్లిపోవాలని బాధిత కుటుంబం కోరింది.

పైసలు కట్టకపోతే రౌడీయిజం చేయడానికి వచ్చారా అని స్థానికులు మంచిర్యాల మున్సిపల్ అధికారులు, సిబ్బందిని నిలదీశారు. బకాయి ఉంటే ప్రశ్నించండి, నోటీసులు ఇచ్చి వెళ్లిపోవాలి కానీ ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేయడం ఏంటని నిలదీశారు.

ప్రజల్ని కొట్టి, వారి మీద దాడిచేసి డబ్బులు వసూలు చేయడానికి రావడం ఏంటని ప్రశ్నించారు.మీరు అధికారుల్లాగ ప్రవర్తించండి, రౌడీలు, గూండాల మాదిరగా అంత మంది రావడం ఏంటి, వచ్చి సామాన్యులపై రౌడీయిజం సరికాదని స్థానికులు అన్నారు. పర్మిషన్ ఉంటే మాత్రం ఐడీ కార్డులు వేసుకుని చాలా మంది ఒక్క ఇంటి మీదకు వచ్చి గుండాయిజం చేసి, వారి ఇంటి గేటుకు తాళం వేయడం సరికాదంటూ అధికారులతో స్థానికులు వాగ్వాదానికి దిగారు. బిల్లులు చెల్లించకపోయినా, ట్యాక్స్ కట్టకపోయినా ప్రజలకు దాని వల్ల ఏం నష్టం జరుగుతంది, ఏ ప్రయోజనాలు కోల్పోతారో చెప్పాలి కానీ దౌర్జన్యం సరికాదని అధికారులకు హితవు పలికారు. మంచిర్యాలలో జరిగిన ఘటన జిల్లా వ్యాప్తంగా హాట్ టాపిక్ అవుతోంది‘మేం దళిత సామాజిక వర్గానికి చెందిన వాళ్లం. మున్సిపల్ అధికారులు 15 నుంచి 20 మంది వరకు మా ఇంటి మీదకు వచ్చారు. మున్సిపల్ టాక్స్ కట్టలేదు. మీ టైం అయిపోయింది అన్నారు. మాకు ఒక్కరోజు టైం ఇవ్వండి సార్ అని అడిగాం.

కోడలు, పిల్లలు లోపలు ఉన్నారు. అనారోగ్యం వల్ల పైసలు కట్టలేకపోతున్నాం. కొంచెం టైం ఇస్తే బకాయి పైసలు కట్టే?స్తాం సార్ అంటే వినలేదు. బతిమిలాడినా వినకుండా మున్సిపల్ అధికారులు, సిబ్బండి మా గేటుకు తాళం వేశారు. పక్కింటి వాళ్లు మా బాధలేక సాయం చేయడానికి వచ్చారు. దళితులం అయినందుకే మా కుటుంబాన్ని ఇబ్బంది పెట్టాలని చూశారు. వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని’ గుర్రంస్వామి కోరారు

# రోడ్డు ప్రమాదంలో 13 మందికి తీవ్ర గాయాలు

యాదాద్రి

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ధర్మోజి గూడెం జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది బుధవారం తెల్లవారుజామున విజయవాడ నుండి హైదరాబాద్ వైపు వెళ్తున్న భారీ కంటైనర్ ను వెనుక నుండి ఆరంజ్ ట్రావెల్ , సాయి కృష్ణ ట్రావెల్స్ బస్సులు ఢీకొట్టాయి. ఈ ప్రమాదంలో 13 మందికి తీవ్ర గాయాలు కాగా ఒకరి పరిస్థితి విషమంగా వుంది. క్షతగాత్రులను ప్రభుత్వాసుపత్రి తరలించారు. .. అరెంజ్ ట్రావెల్ బస్సు డ్రైవర్ క్యాబిన్ లో ఇరుక్కు పోవడం తో క్రేన్ సహాయం తో బయటకు తీసారు. ఘటనతో జాతీయ రహదారి పై భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పాడింది. సంఘటన స్థలానికి ఏసీబీ మధుసూదన్ రెడ్డి, ట్రాఫిక్ ఏసిపి ప్రభాకర్ రెడ్డి చేరుకొని సుమారు రెండు గంటల పాటు శ్రమించి వాహనాలను తొలగించి ట్రాఫిక్ ను క్లియర్ చేసారు. సిన పోలీసులు.....

# ఆరు పథకాల అమలు కాలేదని బీజేపీ నిరసన

యాదాద్రి

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఎస్ లింగోటం గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తామన్న ఆరు పథకాలు అమలుపరచలేదని పెద్ద ఎత్తున మహిళల నుండి దరఖాస్తులను సేకరిస్తున్న బిజెపి శ్రేణులు ఈ కార్యక్రమంలో మునుగోడు బిజెపి కన్వీనర్ దూడలబిక్షం, శాగ చంద్రశేఖర్ రెడ్డి, పలువురు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

తరువాత బీజేపీ నాయకులు మాట్లాడుతూ

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలో భాగంగా ఆరు పథకాలు అమలు పరచాలని మరియు ఆసరా పింఛన్లు 4000 రూపాయలు మహిళలకు 2500 రూపాయలు ఇస్తామని చెప్పి ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు అవుతున్న అమలుపరచలేదని దానికి నిరసనగా మునుగోడు నియోజకవర్గంలో బిజెపి పార్టీ ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో దరఖాస్తుల స్వీకరిస్తున్నాం ఈ కార్యక్రమానికి మహిళల నుండి పెద్ద ఎత్తున స్పందన వస్తుంది... కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన అమలుపరిచే వరకు బిజెపి పార్టీ ప్రజల తరపున పోరాడుతుందని తెలిపారు.....

# నేడు ప్రపంచ రంగస్థల దినోత్సవం


( పెండ్యాల రామ్ కుమార్, మద్దని )

ప్రపంచ రంగస్థల దినోత్సవం ప్రతి ఏట మార్చి 27న ప్రపంచవ్యాప్తంగా రంగస్థల కళాకారులచే జరుపబడుతున్న ఉత్సవం. ఇది 1961లో ఇంటర్నేషనల్ థియేటర్ ఇనిస్టిట్యూట్ వారిచే ప్రారంభించబడింది.

నాటకం సర్వజనీయం, సర్వకాలీనం. ప్రాముఖ్యత కలిగిన ప్రాచీన కళల్లో నాటక కళ ఒకటి. ఒక దేశం ప్రేరణా, ప్రమేయం లేకుండా ఈ నాటక కళ వివిధ దేశాల్లో విడివిడిగా ఎదిగింది. దాదాపుగా ఒకే కాలంలో పాశ్చాత్య దేశాల్లోనూ, భారతదేశంలోనూ నాటక ప్రక్రియ మొదలయ్యింది. కాలాన్ని బట్టీ, ప్రదేశాన్ని బట్టీ, సంస్కృతిని బట్టీ నాటకం రూపం మారుతుందేగానీ అంతర్లీనంగా దాని మూల సూత్రం మాత్రం అందరికీ ఒక్కటే ఉంటుంది. అందువల్లే నాటకం బహుళాదరణ పొందిన రంగస్థల ప్రక్రియగావిరసిల్లుతుంది. ప్రస్తుతమున్న నాటకం కాలక్రమేణా రూపం మార్చుకుంటా విశ్వజనీయమయ్యింది. దాని గుర్తుగానే ప్రపంచ రంగస్థల దినోత్సవం పుట్టింది.

1961లో వియన్నాలో ఇంటర్నేషనల్ థియేటర్ ఇనిస్టిట్యూట్ వారు నిర్వహించిన 9వ ప్రపంచ కాంగ్రెస్‌లో ఆనాటి అధ్యక్షుడు 'ఆర్వికివియా' ప్రపంచ రంగస్థల దినోత్సవ ప్రతిపాదన చేశాడు. సభ్యులందరూ ప్రతిపాదనను అంగీకరించారు. ఆ తరువాత ఏడాది పారిస్‌లో జరిగిన రంగస్థల సమాఖ్యలో పూర్తి స్థాయిలో మొదలయ్యింది.

రంగస్థల దినోత్సవం ప్రపంచమంతా విస్తరించి ఐక్యరాజ్య సమితి, యునెస్కో లచే ప్రాధాన్యత పొందింది. ఈ వేడుకలలో




భాగంగా అన్ని దేశాల్లో జరుగుతున్న నాటకాలు, ప్రదర్శనలు, ప్రక్రియల ప్రమాణాలపై పరిశీలకులు, నాటక ప్రియులు వచ్చి సమీక్షించుకుంటారు. ప్రతి సంవత్సరం నాటకరంగంలో నిష్ణాతులైన ఒకరిని సమన్వయకర్తగా ఎంచుకొని, ప్రముఖుల మాటగా వారి మనోగత సారాన్ని ఆ సంవత్సరపు సందేశంగా రంగస్థల ప్రపంచానికి అందిస్తారు. 1962లో మొదటి ప్రపంచ రంగస్థల దినోత్సవ సందేశాన్ని జీన్ కాక్టే (ఫ్రాన్స్) అందించాడు.

ప్రపంచవ్యాప్తంగా అనేక రూపాలలో నాటకాన్ని ప్రోత్సహించడం.

ప్రజలకు నాటకం యొక్క ప్రాముఖ్యతపై అవగాహన కలిపించడం.

విస్తృత స్థాయిలో నాటక సంస్థలకు ప్రోత్సహించడంలో ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులకు అవగాహన కలిపించి వారి ద్వారా నాటకరంగాన్ని అభివృద్ధి చేయడం. మానసిక ఉల్లాసంకోసం నాటకాన్ని ఆస్వాదింపజేయడం. నాటకం ద్వారా పొందుతున్న మానసిక ఉల్లాసాన్ని ఇతరులతో పంచుకోవడం.

# తెరపైకి మరో భార్య బాధితుడు

బెంగళూరు, మార్చి 26, (

చెన్నై టెక్ బిలియనీర్ ఇంటి వ్యవహారం రచ్చకెక్కింది. లక్ష కోట్ల కంపెనీలకు అధిపతి అయిన ప్రసన్న శంకర్ భార్య బాధితుడు అయ్యాడు. ఆయన వ్యక్తిగత జీవితం హాట్ టాపిక్‌గా మారింది. ప్రముఖ హెచ్ఆర్ టెక్ స్టార్టప్ 'రిప్లింగ్' సహ వ్యవస్థాపకుడు, అనేక స్టార్టప్ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టిన ప్రసన్న శంకర్ నారాయణ ప్రస్తుతం తన భార్య దివ్య శశిధర్ తో విడాకుల వివాదంలో చిక్కుకున్నారు. పోలీసులు అరెస్ట్ చేస్తారేమోనని భయపడి ప్రస్తుతం తాను పరారీలో ఉన్నానని ప్రసన్న శంకర్ నారాయణ స్వయంగా సోషల్ మీడియాలో పోస్టు చేశారు.. దీంతో ఇది దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. దీంతో పోలీసులు ఈ విషయంపై స్పందించారు.. తాము అరెస్టు చేయమని చెప్పడంతో ఈ వివాదానికి కాస్త బ్రేక్ పడినట్లయింది.. ఈ క్రమంలో ప్రసన్న శంకర్ పోలీసులపై కూడా పలు ఆరోపణలుచేశారు. హెచ్ఆర్ టెక్ స్టార్టప్ 'రిప్లింగ్' సహ వ్యవస్థాపకుడు, అనేక స్టార్టప్ కంపెనీల్లో పెట్టుబడిదారుడిగా ప్రసన్న శంకర్ నారాయణ వ్యవహరిస్తున్నారు. ప్రసన్న శంకర్ నారాయణ, దివ్య దంపతులు.. వారికి తొమ్మిదేళ్ల కుమారుడు ఉన్నాడు. కొంతకాలంగా వీరిద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో అమెరికా కోర్టులో విడాకుల పిటిషన్ దాఖలైంది. దివ్య, ఆమె కుమారుడు అమెరికా పౌరులు. ఈ నేపథ్యంలో, భరణంగా నెలకు తొమ్మిది కోట్ల రూపాయలు చెల్లించాలని దివ్య డిమాండ్ చేయగా, దీనిపై చర్చలు జరుగుతున్నాయి. టెక్ వ్యవస్థాపకుడు ప్రసన్న శంకర్ సోషల్ మీడియాలో సంచలన ఆరోపణలు చేశారు. తన నుండి విడిపోయిన భార్య, చెన్నై పోలీసులు తనను వేధిస్తున్నారని ఆరోపించారు. తిరుచ్చిలోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుండి పట్టభద్రుడయిన శంకర్, సింగపూర్‌కు చెందిన క్రిప్టో సోషల్ నెట్‌వర్క్ వ్యవస్థాపకుడు. తన భార్యకు వివాహేతర సంబంధం ఉందని తెలుసుకున్న తర్వాత తనకు కష్టాలు ఎదురయ్యాయని ఆరోపించాడు. తన భార్య ద్రోహానికి ఆధారాలు దొరికిన తర్వాత, ఆమె విడాకుల కోసం భారీగా పరిహారాన్ని కోరిందని శంకర్ పేర్కొన్నాడు. చర్చలు నిలిచిపోయినప్పుడు, ఆమె తనపై గృహ హింస ఆరోపణలు చేస్తూ తప్పుడు పోలీసు ఫిర్యాదు దాఖలు చేసిందని ఆరోపించాడు. భారతదేశంలో కాకుండా అమెరికాలో విడాకుల కోసం దాఖలు చేయడం ద్వారా ఆమె ప్రయోజనం పొందడానికి ప్రయత్నించిందని, ఎందుకంటే భారతదేశంలో తాను విడాకులకు దరఖాస్తు చేసుకున్నానని కూడా అతను చెప్పాడు. ప్రసన్న శంకర్ నారాయణ, దివ్య దంపతులు. వారికి తొమ్మిదేళ్ల కుమారుడు ఉన్నాడు. కొంతకాలంగా వీరిద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో అమెరికా కోర్టులో విడాకుల పిటిషన్ దాఖలైంది. దివ్య, ఆమె కుమారుడు అమెరికా పౌరులు. ఒప్పందంలోని నిబంధనల ప్రకారం, అతను తన భార్యకు సుమారు రూ.9 కోట్ల రూపాయలు, అలాగే నెలకు రూ.4.3 లక్షలు చెల్లించాల్సి ఉంది, అదే సమయంలో వారి కొడుకు ఇద్దరి కస్టడీలో ఉండాలి. తన భార్య దివ్యకు వివాహేతర సంబంధం ఉందని, ఈ విషయమై గొడవలు జరిగాయని అంటున్నాడు ప్రసన్న. తన కుమారుడిని కిడ్నాప్ చేసినట్టు దివ్య ఫిర్యాదు చేసిందని, అంతర్జాతీయ పిల్లల అక్రమ రవాణాకు సంబంధించిన సెక్షన్లతో కేసు నమోదైందని తెలిపాడు. అమెరికా పోలీసులు, కోర్టు ఈ ఆరోపణలను విచారించి, అవి నిరాధారమైనవని తేల్చి తనకు అనుకూలంగా తీర్పునిచ్చాయన్నాడు. ఆ తర్వాత కూడా నేను దాడి చేసి అత్యాచారం చేసినట్టు, నగ్న వీడియోలు సర్క్యులేట్ చేస్తున్నట్టు దివ్య తనపై సింగపూర్ లో ఫిర్యాదు చేయగా, సింగపూర్ పోలీసులు తనకు క్లీన్ చిట్ ఇచ్చారని తెలిపాడు. అమెరికా కోర్టు ప్రసన్నకు ప్రతి వారాంతంలో కుమారుడితో గడిపేందుకు అనుమతినిచ్చింది. వారం క్రితం దివ్య తన కుమారుడితో అమెరికా నుంచి చెన్నైకి వచ్చింది. అమెరికా కోర్టు ఆదేశాల మేరకు, ప్రసన్న తన స్నేహితుడు గోకుల్ ద్వారా కుమారుడిని వీకెండ్ లో తీసుకువెళ్ళాడు. అయితే, దివ్య తన కుమారుడిని ప్రసన్న కిడ్నాప్ చేశాడని చెన్నై పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే కుమారుడు తనతో సంతోషంగా ఆడుకుంటున్నాడని ప్రసన్న సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడు. దివ్య ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ నమోదు చేయని పోలీసులు, డబ్బుల కోసం డిమాండ్ చేశారని ప్రసన్న ఆరోపించారు. కొడుకును కిడ్నాప్ చేసినట్టు తన భార్య దివ్య ఫిర్యాదు చేయడంతో, ప్రస్తుతం తాను చెన్నై పోలీసుల నుంచి తప్పించుకుని తిరుగుతున్నానని. పోలీసులు ట్రాక్ చేస్తున్నారని ప్రసన్న శంకర్ వాపోయాడు. ప్రసన్న శంకర్ ఒక కామ పిశాచి అని దివ్య సంచలన ఆరోపణలు చేశారు. రహస్యంగా మహిళల వీడియోలు రికార్డు చేసేవాడని తెలిపారు. ఈ కారణంగానే అతడు సింగపూర్ లో అరెస్టయ్యాడని, ఆ తర్వాత విడుదలయ్యాడని చెబుతున్నారు. ఏది ఏమైనా వీరి వ్యవహారం ప్రస్తుతం రచ్చకెక్కింది.

విడాకులకు దారి తీసిన పరిస్థితులను తన ఎక్స్ వేదికగా వెల్లడించాడు ప్రసన్న శంకర్ నారాయణ? తన భార్య దివ్యకు వివాహేతర సంబంధం ఉందని.. దీనిపై గొడవలు జరిగాయని తెలిపాడు.. తన భార్య తనపై అత్యాచారం, గృహ హింస, అపహరణ ఆరోపణలు చేసిందని.. పోలీసులలోని తన సంబంధాలను ఉపయోగించుకుని నిరాధారమైన ఆరోపణలతో తనను హింసించిందని ప్రసన్న శంకర్ ఆరోపించారు. అయితే భర్త ప్రసన్న శంకర్ నారాయణపై భార్య దివ్య సంచలన ఆరోపణలు చేశారు. ప్రసన్న శంకర్ నారాయణ ఒక కామపిశాచి అని, రహస్యంగా మహిళల వీడియోలు రికార్డు చేసేవాడని ఆరోపించారు. ప్రసన్న శంకర్ నారాయణ, దివ్య దంపతుల విడాకుల వ్యవహారం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

# ఘట్ కేసర్ కు మారనున్న గులాబీ మీటింగ్

హైదరాబాద్, మార్చి 26, (

బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకల్ని వరంగల్ బదులు ఘట్‌కేసర్‌లో నిర్వహించాలని ఆ పార్టీ భావిస్తోంది. తొలుత వరంగల్‌లో నిర్వహిస్తారని ప్రచారం జరగడంతో ఈ మేరకు స్థానిక బీఆర్ఎస్ నేతలు వరంగల్ రింగ్ రోడ్డును ఆనుకుని ఉన్న దేవన్నపేట, కడిపికొండ సమీపంలోని భట్టుపల్లి స్థలాన్ని కూడా పరిశీలిస్తున్నారు. అనూహ్యంగా పార్టీ అధినేత కేసీఆర్ సభ నిర్వహణ స్థలాన్ని మార్చేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. మేడ్చల మల్కాజ్ గిరి జిల్లా పరిధి ఘట్ కేసర్ సమీపంలో సభ నిర్వహించేందుకు నిర్ణయించినట్లు తెలిసింది. ఈ మేరకు అక్కడి బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు సభ నిర్వహణకు అనువైన స్థలాన్ని పరిశీలించాల్సిందిగా సూచించినట్లు పార్టీ నేతలు చెబుతున్నారు. సభా స్థలం మార్పుపై అధికారికంగా పార్టీ నుంచి ఎలాంటి నిర్ణయం వెలువడనప్పటికీ.. ఘట్ కేసర్ ను ఫైనల్ చేసే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. బీఆర్ఎస్ (టీఆర్ఎస్) పార్టీ 2001 ఏప్రిల్ 27వ తేదీన ఆవిర్భవించగా.. పార్టీ ఏర్పడి 20 ఏళ్లు అవుతున్న సందర్భంగా 2021 నవంబర్ 29 దీక్ష దివస్ రోజున 'విజయ గర్జన సభ' పేరున భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు అప్పట్లో పార్టీ సన్నాహాలు చేసింది. ఈ మేరకు వరంగల్ నగర శివారులోని దేవన్నపేట సమీపంలో ఉన్న నిరుప్ నగర్ తండా స్థలాన్ని పరిశీలించారు. మొత్తంగా 1100 ఎకరాల్లో సభ నిర్వహించేలా ప్లాన్ వేశారు. అందులో 300 ఎకరాల్లో సభా ప్రాంగణం, నాలుగు చోట్ల 800 ఎకరాల్లో వెహికిల్ పార్కింగ్ కోసమని అంచనా వేశారు. కానీ అప్పటికే ఆ చుట్టుపక్కల మొత్తం రైతులు వరి, పత్తి, తదితర పంటలు సాగు చేసుకుంటుండగా, ఆ పొలాలన్నీ చదును చేసేందుకు ప్రయత్నించారు. దీంతో అక్కడి రైతులు తీవ్రంగా వ్యతిరేకించి, ఆందోళనలు చేపట్టారు. రోడ్డెక్కి నిరసనలు చేపట్టడంతో పాటు పొలాల వద్దే మకాం ఏర్పాటు చేసుకుని తమ భూములను చదును చేయకుండా కాపలా ఉన్నారు. అప్పటి ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు ఇలా.. ఎవరు వచ్చినా అడ్డుకుని తమ నిరసనను వెల్లగక్కారు. కాగా అప్పటికే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత రావడం, అంతలోనే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో విజయ గర్జన సభను పార్టీ వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. గతంలో విజయ గర్జన సభ రద్దు కాగా.. పార్టీ ఏర్పడి 25 ఏళ్లు అవుతున్న సందర్భంగా 2025 ఏప్రిల్ 27న నిర్వహించనున్న రజతోత్సవ సంబరాలను పార్టీ అధిష్టానం మరోసారి వరంగల్ నే ఎంచుకుంది. ఈ మేరకు కొద్ది రోజుల కిందట పార్టీ అధినేత కేసీఆర్ పార్టీ నేతలతో సమావేశమై వరంగల్ లో భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు చేయాల్సిందిగా ఆదేశించారు. దీంతో ఆ పార్టీ నేతలు దేవన్నపేట, భట్టుపల్లి ప్రాంతాల్లోని స్థలాలను పరిశీలిస్తున్నారు. అక్కడి రైతులతో మాట్లాడి స్థలాలను వెకెట్ చేయించే ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ ఇంతలోనే పార్టీ నిర్ణయం మారినట్లు తెలుస్తోంది. పార్టీ అధినేత కేసీఆర్ రజతోత్సవ సంబరాలను హైదరాబాద్ కు అతి సమీపంలో ఉన్న మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా పరిధి ఘట్ కేసర్ లో నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఈ మేరకు అక్కడి ఎమ్మెల్యే మల్లారెడ్డికి సమాచారం అందించినట్లు సమాచారం. సభ నిర్వహణకు స్థలం పరిశీలించాల్సిందిగా సూచించడంతో మల్లారెడ్డి ఈ మేరకు ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు తెలిసింది. ఓ వైపు వరంగల్ లో సభ నిర్వహణ కోసం దేవన్నపేట సమీపంలో ప్రాంతాన్ని పరిశీలిస్తుండగా, మరో వైపు ఘట్ కేసర్ పేరు అనూహ్యంగా తెర మీదకు వచ్చింది. దీంతో సభ ఎక్కడ జరుగుతుందోననే చర్చ జరుగుతోంది. హైదరాబాద్ కు దగ్గర్లో ఉన్న ఘట్ కేసర్ లో నిర్వహిస్తారా.. లేదా గతంలో వరంగల్ విజయ గర్జన సభ క్యాన్సిల్ అయ్యింది కాబట్టి వరంగల్ లోనే నిర్వహిస్తారా అనేది హాట్ టాపిక్ గా మారింది. కాగా రెండు, మూడు చోట్ల స్థలాన్ని పరిశీలించి, ఎక్కడ అనుకూలంగా ఉంటే అక్కడే సభ నిర్వహించే అవకాశం ఉంటుందని పార్టీ నాయకులు అంటున్నారు. కాగా సభ నిర్వహణ స్థలం మార్పుపై అధికారికంగా గులాబీ పార్టీ నాయకులు ఇంతవరకు స్పందించకపోవడంతో వరంగల్ లోనే సభ ఉంటుందని స్థానిక నాయకులు చెబుతున్నారు. మరి పార్టీ అధినేత సభ నిర్వహణపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో.. ఏ స్థలాన్ని ఫైనల్ చేస్తారో చూడాలి.

# అప్పులు ఉన్నా ఐటీ టీవి

## తెలంగాణపై లోకసభలో కేంద్రమంత్రి

హైదరాబాద్, మార్చి 26, (

తెలంగాణ రాష్ట్రం ఆర్థికంగా ఎదుగుదల పథంలో ఉన్నప్పటికీ, దాని అప్పుల భారం గురించి కేంద్ర ప్రభుత్వం ఇటీవల లోక్‌సభలో కీలక వివరాలను వెల్లడించింది. కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి ప్రకారం, తెలంగాణ రాష్ట్ర అప్పు ప్రస్తుతం రూ.4,42,298 కోట్లుగా ఉంది. ఈ మొత్తంతో దేశంలోని రాష్ట్రాల అప్పుల జాబితాలో తెలంగాణ 24వ స్థానంలో నిలిచింది. ఈ అప్పులు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి తెచ్చినప్పటికీ, అదే సమయంలో రాష్ట్రంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో గణనీయమైన పురోగతి కనిపిస్తోంది. గత ఆరు సంవత్సరాల్లో 10,189 ఐఖీ కంపెనీలు ప్రారంభమవ్వడం దీనికి నిదర్శనం. కేంద్ర మంత్రి హర్ష మల్హోత్రా ఇచ్చిన సమాచారం ప్రకారం, ఈ కంపెనీలు రాష్ట్ర ఆర్థిక వృద్ధికి ఊతమిచ్చాయి. గత ఐదేళ్లలో ఈ సంస్థల ద్వారా రూ.14,865 కోట్ల టర్నోవర్ సాధించడం గమనార్హం. అయితే, అదే కాలంలో 3,369 ఎ సంస్థలు మూతపడటం కూడా ఆందోళనకర విషయం. ఈ గణాంకాలు తెలంగాణలో ఎ రంగం వేగంగా విస్తరిస్తున్నప్పటికీ, దాన్ని నిలబెట్టుకోవడంలో సవాళ్లు ఉన్నాయని సూచిస్తున్నాయి. రాష్ట్రంలో అప్పులు పెరగడానికి వివిధ కారణాలు ఉండవచ్చు. మౌలిక వసతుల అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ఇతర ఖర్చులు ఇందులో భాగంగా ఉంటాయి. అయినప్పటికీ, ఎ రంగం ద్వారా వచ్చే ఆదాయం ఈ అప్పుల భారాన్ని తగ్గించే దిశగా ఒక అవకాశంగా కనిపిస్తోంది. తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్‌ను ఎ హబ్‌గా మార్చడంలో సాధించిన విజయం దేశవ్యాప్తంగా గుర్తింపు పొందింది. అయితే, సంస్థలు మూతపడకుండా నిరంతరం వృద్ధిని కొనసాగించేందుకు వ్యూహాత్మక చర్యలు అవసరం.

మొత్తంగా, తెలంగాణ ఆర్థిక స్థితి ఒక వైపు అప్పుల భారంతో కొనసాగుతుండగా, మరోవైపు ఎ రంగంలో అవకాశాలతో సమతుల్యం పాటిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ రెండు అంశాలను సమర్థవంతంగా నిర్వహించగలిగితే, భవిష్యత్తులో ఆర్థిక స్థిరత్వం సాధ్యమవుతుంది. ఐఖీ కంపెనీల సంఖ్యను పెంచడంతో పాటు వాటి దీర్ఘకాలిక ఉనికికి ప్రణాళికలు రూపొందించడం ద్వారా అప్పులను నియంత్రించే దిశగా అడుగులు వేయవచ్చు.

# ఎవరికి ఎర్త్... ఎవరికి బెర్త్...

హైదరాబాద్, మార్చి 26,

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు పూర్తవుతుంది. దీంతో మంత్రివర్గ విస్తరణ గురించి కొంతకాలంగా ప్రచారం జరుగుతూనే ఉంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో ఎప్పుడెప్పుడు మంత్రివర్గ విస్తరణ జరుగుతుందని ఆశావాహులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆసక్తికరంగా ఎదురుచూస్తున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు పూర్తయిన నేపథ్యంలో మంత్రివర్గ విస్తరణకు సమయం ఆసన్నమైంది. ఉగాది సందర్భంగా ఈ విస్తరణ జరిగే అవకాశం ఉందని ప్రచారం సాగుతోంది. కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్ నివాసంలో కీలక సమావేశం జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు పలువురు నేతలు హాజరైన ఈ భేటీలో మంత్రివర్గ విస్తరణపై చర్చలు జరిగాయి. పార్టీ అధిష్ఠానం ఈ విషయంలో నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. ప్రస్తుతం రాష్ట్రంలో ఆరు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. వీటిని ఎవరికి కట్టబెట్టాలనే దానిపైనా అధిష్ఠానం ఓ అభిప్రాయానికి వచ్చినట్టు తెలుస్తోంది. కొత్త మంత్రివర్గంలో రెండు బీసీ, ఒక రెడ్డి, ఒక ముస్లిం, ఒక ఎస్సీ సామాజిక వర్గాలకు అవకాశం దక్కే సూచనలు కనిపిస్తున్నాయి. బీసీ కోటాలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్లు వినిపిస్తుండగా, ఎస్సీ కోటాలో చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకట్ స్వామి పేరు ప్రముఖంగా ఉంది. రెడ్డి కోటాలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మధ్య పోటీ నెలకొంది. మైనారిటీ కోటాలో ఎమ్మెల్సీ మీర్ అమీర్ అలీఖాన్‌కు అవకాశం ఉండగా, ఇటీవల ఎమ్మెల్సీగా ఎన్నికైన విజయశాంతి పేరు కూడా చర్చలో ఉంది. అయితే, ప్రస్తుత మంత్రివర్గంలోని ఇద్దరు మంత్రులను తొలగించే అవకాశం ఉందని సోషల్ మీడియాలో ఊహాగానాలు సాగుతున్నాయి. మంత్రి కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావును తప్పించే సూచనలు కనిపిస్తున్నాయి. వరుస వివాదాల్లో చిక్కుకున్న కొండా సురేఖ పదవి కోల్పోతారనే చర్చ పార్టీ వర్గాల్లోనూ జరుగుతోంది. కొత్త మంత్రివర్గ జాబితా మరో రెండు రోజుల్లో బయటపడే అవకాశం ఉంది. ఈ విస్తరణతో రేవంత్ రెడ్డి టీమ్‌లో కొత్త ఊపు వస్తుందని కాంగ్రెస్ శ్రేణులు ఆశిస్తున్నాయి.

నలుగురికి అవకాశం

తెలంగాణలో కేబినెట్ విస్తరణకు సమయం ఆసన్నమైంది. ఈమేరకు కాంగ్రెస్ అధిష్టానం ప్రత్యేక చొరవ చూపుతోంది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కాంగ్రెస్ అగ్రనేతలైన రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, మీనాక్షి నటరాజన్, కేసీ వేణుగోపాల్‌లతో సుదీర్ఘ చర్చలు జరిపారు. ఈ సమావేశంలో క్యాబినెట్‌లో నలుగురు కొత్త మంత్రులను చేర్చేందుకు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా ఈ నిర్ణయం ఉందని తెలుస్తోంది. కొత్తగా మంత్రులుగా చేరనున్న వారిలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముదిరాజ్, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, జి. వివేక్, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఉన్నట్లు సమాచారం. ఈ నలుగురూ విభిన్న సామాజిక వర్గాల నుంచి వచ్చినవారు కావడం గమనార్హం. వాకిటి శ్రీహరి ముదిరాజ్ సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తూ బీసీలకు ప్రాధాన్యతనిచ్చే కాంగ్రెస్ విధానాన్ని ప్రతిబింబిస్తారు. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, రోడ్లు?భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సోదరుడిగా, పార్టీలో సీనియర్ నాయకుడిగా గుర్తింపు పొందారు. జి. వివేక్, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన నేతగా, పార్టీకి కొత్త ఊపు తెచ్చే అవకాశం ఉంది. సుదర్శన్ రెడ్డి నిజామాబాద్ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ ప్రాంతీయ సమతుల్యతను సాధించేందుకు ఎంపికయ్యారు. ప్రస్తుతం తెలంగాణ క్యాబినెట్‌లో 12 మంది మంత్రులు ఉండగా, గరిష్టంగా 18 మంది వరకు ఉండే అవకాశం ఉంది. ఈ విస్తరణతో ఆరు ఖాళీల్లో నాలుగు భర్తీ కానున్నాయి. ఈ చర్చల్లో ప్రాంతీయ, సామాజిక సమీకరణలను పరిగణనలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా, గత ఎన్నికల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. ఈ విస్తరణతో పార్టీలో అసంతృప్తిని తగ్గించి, ప్రభుత్వ పనితీరును మరింత బలోపేతం చేయాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ఈ నిర్ణయం తెలంగాణ రాజకీయాల్లో కొత్త ఒరవడిని సృష్టించనుంది. కొత్త మంత్రుల ఎంపికతో ప్రభుత్వంలో సమతుల్యత, సామాజిక న్యాయం స్పష్టంగా కనిపించనున్నాయి.

## ప్రజాస్వామ్యంలో వన్ నేషన్ - వన్ ఎలక్షన్ విప్లవాత్మక మార్పు కు నాంది: బీజేపీ తెలంగాణ రాష్ట్ర నాయకులు దేవకి వాసుదేవరావు




ఖమ్మం ప్రతినిది (భారత శక్తి న్యూస్ ), మార్చ్ 26:భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకత్వం ఆదేశానుసారం ఒకటో పట్టణ అధ్యక్షులు గడిల నరేష్ ఆధ్వర్యంలో ఒకే దేశం – ఒకే ఎన్నిక భారతదేశంలో ఏకకాలిక సంస్కరణ ఎన్నికల కార్యశాల కార్యక్రమం జరిగింది . ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా బీజేపీ తెలంగాణ రాష్ట్ర నాయకులు దేవకి వాసుదేవరావు పాల్గొని ప్రజాస్వామ్యంలో వన్ నేషన్ – వన్ ఎలక్షన్ విప్లవాత్మక మార్పు అని ఎన్నికల సంస్కరణలలో అభివృద్ధి వేగవంతం అవుతుందని తెలియజేశారు . ఎన్నికల వ్యయాన్ని తగ్గించి అభివృద్ధికి బాటలు వేయొచ్చు అని అన్నారు . అదేవిధంగా బిజెపి నాయకులు ఒకే దేశం ఒకె ఎన్నిక పై బీజేపీ నాయకులు అవగాహన చేసుకుని డివిజన్ల వారీగా పోలింగ్ బూతుల వారీగా ప్రజలకి తెలియచేయాలని కోరారు . అంతేకాక బీజేపీ నాయకులు ప్రతీ ఒక్కరు ఒక సైనికునిలా పని చేయాలని అన్నారు . అధికారపార్టీ చేసిన బూటకపు వాగ్దానలను ఎండగట్టలన్నారు . ప్రతీ ఒక్కరు గ్రామ స్థాయి నుండి పట్టణ స్థాయి వరకు నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశ ప్రజలు సుబిక్షంగా ఉంటున్నారని రాబోగు రోజుల్లో ఖమ్మం ఖిల్లా పైన కూడా కాషాయం జెండా ఎగిరే దిశగా ప్రతీ ఎన్నికకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు . ఈ కార్యక్రమంలో ఒకే దేశం ఒకే ఎన్నిక కన్వినర్ మంద సరస్వతి , కో కన్వినర్ తుమ్మ శివ , అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య , జిల్లా నాయకులు పాల్గొన్నారు .

## నిబంధనలకు విరుద్ధంగా ప్రెస్ క్లబ్ నిర్వహణ

### -జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ కు టీడబ్ల్యూజేఎఫ్ వినతి

### -చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన కలెక్టర్



ఖమ్మం ప్రతినిది (భారత శక్తి న్యూస్ ), మార్చ్ 26: నిబంధనలకు విరుద్ధంగా ఖమ్మం జిల్లా కేంద్రం ప్రెస్ క్లబ్ నిర్వహణ కొనసాగుతోందని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఖమ్మం జిల్లా కమిటీ కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ కు వినతిపత్రం సమర్పించింది. ఐడీవోసీలో కలెక్టర్ ను బుధవారం కలిసి టీడబ్ల్యూజేఎఫ్ నేతలు వినతిపత్రం సమర్పించారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ప్రెస్ క్లబ్ నిర్వహణలో చోటు చేసుకుంటున్న లోపాలను సరి చేసేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఖమ్మం జిల్లా కేంద్రం ప్రెస్ క్లబ్ నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైందని వినతిపత్రంలో పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రెస్ క్లబ్ ను నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఎలాంటి లెక్కాపత్రం లేకుండా... ఆడిటింగ్ లు జరపకుండా దీనిని అడ్డగోలు వేదికగా మార్చారని ఫిర్యాదు చేశారు. ప్రెస్ క్లబ్ లో జవాబుదారీతనం లోపించిందన్నారు. ప్రెస్ క్లబ్ లో ప్రెస్ మీట్ రుసుం వసూళ్లలో అనేక లోటుపాట్లు ఉన్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కాబట్టి ఆడిటింగ్ చేయించి ప్రభుత్వ అధికారి ద్వారా పర్యవేక్షణ చేయించాలని కోరారు. ప్రెస్ క్లబ్ సభ్యత్వాలు ఇచ్చి ప్రభుత్వ అధికారి ద్వారా ఎన్నిక నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. అప్పటి వరకూ అడ్ హక్ కమిటీని ఏర్పాటు చేసి ఇకనైనా ప్రెస్ క్లబ్ నిర్వహణ సవ్యంగా సాగేలా చూడాలని కోరారు. ప్రెస్ క్లబ్ ఆడిటింగ్ లోపాల పైనా ప్రభుత్వ అధికారి ద్వారా విచారణ చేయించాలని విన్నవించడంతో ఈ మేరకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. వినతిపత్రం సమర్పించిన వారిలో టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులు గరిడేపల్లి వెంకటేశ్వర్లు, సయ్యద్ ఖదీర్, దువ్వా సాగర్, ఆవుల శ్రీనివాస్, వేగినాటి మాధవరావు, మానుకొండ రవికిరణ్, షేక్ జానీపాష, సుభాని, మేగా దేవేందర్, అర్షద్, యాకుబ్ పాష తదితరులు పాల్గొన్నారు.

## బెట్టింగులపై ప్రత్యేక దృష్టి: పోలీస్ కమిషనర్




ఖమ్మం ప్రతినిది (భారత శక్తి న్యూస్ ), మార్చ్ 26:ఐపీఎల్ బెట్టింగులపై ప్రత్యేక దృష్టి పెట్టి పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేయాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పోలీస్ అధికారులకు ఆదేశించారు. పోలీస్ కాన్ఫరెన్స్ హాలో పోలీస్ అధికారులతో జరిగిన నేర సమీక్ష సమావేశంలో పోలీస్ స్టేషన్ల వారిగా నమోదైన గ్రేవ్, నాన్ గ్రేవ్,పోక్సో కేసులలో చేసిన దర్యాప్తు, విచారణ స్థితిగతులు, పెండింగ్ కేసుల పురోగతిపై సమీక్ష జరిపారు. సత్వర పరిష్కారం, సక్రమ విచారణ కోసం సంబంధిత దర్యాప్తు అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ బెట్టింగ్,లోన్ యాప్ కార్యకలాపాలపై పూర్తిగా నిఘాను పెంచాలని, బెట్టింగ్ నిర్వహిస్తున్నారని సమాచారం వస్తే చాలు వెంటనే దాడులు చేయాలని ఆదేశించారు.సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ శిక్షల నుండి తప్పించుకొలేరనే భావన నేరస్తుల్లో కలిగించాలని పోలీస్ అధికారులకు ఆదేశించారు. కీలకమైన కేసుల్లో..కేసు నమోదు నుంచి అభియోగ పత్రాలు దాఖలు వరకు ప్రతి అంశలో కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళ్లాలని అన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో విధిగా విజబుల్ పోలీసింగ్ అమలు చేయాలని తద్వారా నేరాలు నియంత్రణలో వుంటాయని అన్నారు. ఎట్టి పరిస్థితులలో పోలీస్ కమిషనరేట్ పరిధిలో అక్రమ రవాణా జరుగరాదని, అధికారులు సమన్వయంతో పటిష్టమైన నిఘా పెడుతూ పూర్తిగా కట్టడి చేయాలని పోలీసు అధికారులకు ఆదేశించారు. అదేవిధంగా తీవ్రమైన నేరాలు, పోక్సో, ఎస్సీ ఎస్టీ కేసుల దర్యాప్తుల్లో మరింత నాణ్యత ప్రమాణాలను పాటించాలని, పెండింగ్ ఉన్న ఎఫ్ఎస్ఎల్ రిపోర్ట్స్, పోస్టుమార్టం రిపోర్ట్స్, నేరస్తుల అరెస్టు చేయని కేసులలో నేరస్తులను అరెస్టు చేసి త్వరగా ఇన్వెస్టిగేషన్ పూర్తిచేసి చార్జిషీట్ దఖాలు చేయాలని సూచించారు.

అలవాటుగా నేరాలు చేసే నేరస్తులపై హిస్టరీ షీట్‌లను తెరచి సరిహద్దు జిల్లాల పోలీస్‌స్టేషన్ల అధికారులతో నిరంతరం సమాచారాన్ని పంచుకుంటూ వారి కదలికలపై నిఘా ఉంచి వారి ద్వారా భవిష్యత్‌లో ఎటువంటి నేరాలు జరగకుండా నివారించాలి.నిర్మానుష్య ప్రాంతాలను అడ్డాలుగా చేసుకొని అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని గుర్తించి కేసులు నమోదు చేయాలని, పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రతి రోజూ డ్రంక్ అండ్ డ్రైవ్,ర్యాష్ డ్రైవింగ్ పై తనిఖీలు నిర్వహించాలని అధికారులకు సూచించారు.సమావేశంలో అడిషనల్ డీసీపీ ఆడ్మీన్ నరేష్ కుమార్,ట్రైనీ ఐపిఎస్ అధికారి సాయి రిత్విక్, ఏసీపీలు రమణమూర్తి, తిరుపతి రెడ్డి, రహెమాన్, రఘు, వేంకటేశ్, సాంబరాజు, రవి, సర్వర్,శ్రీనివాసులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నియమ నిబంధనలు ఉల్లంఘించకండి, ట్రాఫిక్ నియత్రణకు ప్రజలు సహకరించండి:జిల్లా ఎస్పీ డా .జి.జానకి షర్మిల



భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 26: నిర్మల్ జిల్లా లో ట్రాఫిక్ నియంత్రణ పరికరాలను, యంత్రాలను, డ్రంక్ అండ్ డ్రైవ్ మెషీన్ లను జిల్లా ఎస్పీ డా .జి.జానకి షర్మిల సరఫరా చేశారు.జిల్లా పోలీస్ ముఖ్య కార్యాలయం లో జిల్లా లోని అన్ని పోలీస్ స్టేషన్లకు ట్రాఫిక్ నియత్రణ పరికరాలను సరఫరా చేసిన జిల్లా ఎస్పీ.నిర్మల్ పట్టణంలో ఏర్పాటు చేసిన అత్యాధునిక సీసీటీవీ కెమెరాలతో నిఘా ఉంచటం జరుగుతుంది కనుక ప్రజలు ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలనీ మరియు అందరూ స్వచ్ఛందంగా ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని తెలియజేసారు. ఈరోజు స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయం లో జిల్లా పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించి జిల్లా లో ట్రాఫిక్ నియాత్రణ పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ వాహనదారులు ట్రాఫిక్ నియమ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని తెలిపారు. ముఖ్యంగా హెల్మెట్ లేకుండా వాహనం నడుపరాదని,రాంగ్ రూటు ప్రయాణం, ట్రిపుల్ రైడింగ్ వంటివి ప్రమాదమని, సెల్ఫోన్ డ్రైవింగ్ మరియు రేష్ డ్రైవింగ్ వల్ల మీకే కాకుండా ఎదుటి వారి ప్రాణానికి కూడా ప్రమాదం అని తెలియజేసారు.పట్టణ ప్రజలు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటిస్తే ఎటువంటి ప్రమాదాలు జరుగవన్నారు. ప్రజలు ప్రమాదాలకు గురి కాకుండా, ప్రమాదాలు గురైనప్పుడు ప్రాణనష్టం తగ్గించడానికి ట్రాఫిక్ నియంత్రణ చర్యలకు ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అవినాష్ కుమార్, రాజేష్ మీన , ఏ.ఓ యూనస్ అలి, ఇన్స్పెక్టర్ లు అజయ్ కుమార్, గోవర్ధన్ రెడ్డి, నైలు, గోపినాథ్, ప్రవీణ్ కుమార్, కృష్ణ, మల్లేష్, సమ్మయ్య, ఆర్ ఐ లు రాం నిరంజన్, శేఖర్, రామకృష్ణ, రమేష్, అన్ని పోలీస్ స్టేషన్ ల ఎస్.ఎచ్.ఓ లు ఆర్.ఎస్ఐ లు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్ వల్లూరు క్రాంతి

### -పదిమంది వైద్యులకు షోకాజ్ నోటీసులు




సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, మార్చి 26 :సంగారెడ్డి జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని బయోమెట్రిక్ హాజరును పరిశీలించారు. ఈసందర్భంగా సుమారు పదిమంది వైద్యులు క్యాజువల్ లీవులు ఎక్కువగా తీసుకున్నట్లు , రోజువారీ విధులకు గైర్హాజరయినట్లు కలెక్టర్ గుర్తించారు. వారికి షోకాజ్ నోటీసులు జరీ చేయాలనీ, ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ అనుమతి లేకుండా ఎక్కువ రోజులుగా విధులకు హాజరు గాని వైద్యాధికారులను డైరెక్టర్ ఆఫ్ మెడికల్ఎడ్యుకేషన్ శాఖ కార్యాలయానికి సరెండర్ చేయాలని సూపరిండెంట్ను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆసుపత్రి లోని అన్ని వార్డులను పరిశీలించారు. ఆసుపత్రిలో సిబ్బంది సమయపాలనపాటించాలన్నారు. సిబ్బంది ఉదయం 9:15 వరకు విధులకుహాజరుకావాలని, ప్రతి రోజు సిబ్బంది వైద్యుల హాజరును పరిశీలించాలని ఆసుపత్రి సూపరిండెంట్ ను ఆదేశించారు.వైద్యులు, సిబ్బంది తమ విధులు, బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించాలన్నారు. ఆస్పత్రి కి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు.ఆస్పత్రిలో రోగులకు అవసరమైన అన్ని రకాల వసతులు కల్పించాలని సూచించారు. సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి లో రోగుల సహాయయకులకు కార్పొరేట్ సామాజిక బాధ్యత (%జూ=%) నిధులు ఉపయోగించి నిర్మించే ప్రత్యేక వసతి భవన నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆరోగ్య శాఖ అధికారులకు ఆదేశించారు . ఆసుపత్రికి వచ్చే రోగులకు తాగునీటి సమస్య తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి చేపట్టాల్సిన మార్పుల పై కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రోగులతో మాట్లాడారు. రోగులకు ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇన్ పేషెంట్ గా చేరిన వారికి అందిస్తున్న భోజనం, పాలు, బ్రెడ్ ఎలా ఉంది అని అడిగి తెలుసుకున్నారు. రోగులకు నాణ్యమైన పౌష్టిక ఆహారం అందించాలని సిబ్బందికి ఆదేశించారు . అనంతరం ఆసుపత్రిలోని ఫిజియోథెరపీ కేంద్రాన్ని,దంతవైద్య విభగాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఫిజియోథెరపీ కేంద్రంలో అవసరమైన పరికరాలను ఏర్పాటు కు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతో ప్రతి ఉద్యోగి తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాలని అన్నారు . ఈ కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ అనిల్ కుమార్ , వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు .

## కరీంనగర్ ప్రజలను, విద్యార్థులను కించపరిచారు

### -ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలను హుస్నాబాద్ కు తరలించడం అన్యాయం

### -ముఖ్యమంత్రికి లేఖ పంపిన మాజీ మేయర్ సునీల్ రావు

కరీంనగర్, మార్చి 26(భారత శక్తి):కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీ కి మంజూరి చేసిన ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ను సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ కు తరలించడం జిల్లా ప్రజలను,



ఎంతో ఆశతో ఎదురుచూస్తున్న విద్యార్థులను కించాపరిచినట్లేనని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మేయర్ వై. సునీల్ రావు వెంటనే కరీంనగర్ కు తిరిగి మంజూరు చేస్తూ ఆదేశాలు ఇవ్వాలని రాతపూర్వకంగా లేఖను పంపారు. ఈ పరిణామం చాలా శోచనీయమని, కరీంనగర్ జిల్లా కేంద్రం లో ఉన్న శాతవాహన యూనివర్సిటీలోని జిల్లా హెడ్ క్వాటర్ ను, ప్రజలు విద్యార్థుల మనోభావాలను కించ పరిచే విధంగా ఇంజనీరింగ్ కళాశాలలను సిద్దిపేట జిల్లా పరిదిలోని హుస్నాబాద్ ప్రాంతంలో ఏర్పాటు చేయడం అనేది చాలా దారుణమైన చర్యగా పేర్కొన్నారు. కరీంనగర్ ఎంతో మంది విద్యార్థిని విద్యార్థులకు అనువుగా, వెసులు బాటు, సౌకర్యం గా ఉన్నప్పటికీ అలాంటి విషయాన్ని తిరస్కరించి, హుస్నాబాద్ ప్రాంతంలో ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేయడం చాలా దారుణమన్నారు.దీని వల్ల భవిష్యత్తులో ఎంతో మంది విద్యార్తిని విద్యార్థులు ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు.. శాతవాహన యూనివర్సిటీ క్యాంపస్ ఏరియాలో ఎకరాల కొద్ది భూమి ఉండి ఎంత సౌకర్యాలు ఉన్నప్పటికీ హుస్నాబాద్ లో ఏర్పాటు చేసేందుకు మొగ్గు చూపడం శోచనీయం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నిర్ణయాన్ని వెంటనె ఉపసంహరించుకొని... కరీంనగర్ జిల్లా కేంద్రం లోని శాతవాహన యూనివర్సిటీ ఆవరణలో ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో జిల్లా ప్రజలు, విద్యార్థిని విద్యార్థులు, విద్యార్థి సంఘాల నుండి తీవ్రమైన వ్యతిరేకత ఆంధోళనలు చేపడతారని చెప్పారు. కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీ కి మంచి పేరు ప్రతిష్ఠలు వచ్చేలా ప్రభుత్వం ద్వారా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల తరలింపు విషయంలో ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవ తీసుకొని పునరాలోచన చేయాలాన్నారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కరీంనగర్ నగర అభివృద్ధి కి వ్యతిరేక మైన కార్యక్రమాలు మానుకోవాలి. కరీంనగర్ నగరంలో పుట్టి పెరిగిన వ్యక్తిగా కరీంనగర్ నగరాన్ని విస్మరించి... ఈ ప్రాంతానికి నష్టం జరిగే కార్యక్రమాలు చెపట్టవద్దు. శాతవాహన యూనివర్సిటీ లో అన్ని రకాల కోర్సులు అందుబాలోకి రావాలని ఈ ప్రాంత విద్యార్థులు, ప్రజల చిరకాల కోరిక. అలాంటిది ఇప్పుడిప్పుడే అందుబాటులోకి వస్తున్న కళాశాలను ఇతర ప్రాంతాలకు తరలించడం మంచి పద్దతి కాదు. కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీని అభివృద్ధి చేసి విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పించాల్సింది పోయి... శాతవాహన యూనివర్సిటీ క్యాంపస్ ను నిర్వీర్యం చేసే ప్రయత్నం చేయడం చాలా దారుణం. ఇప్పటికైన పునరాలోచన చేసి ప్రభుత్వం నుండి మంజూరు అయిన ఇంజనీరింగ్, లా కళాశాలలను శాతవాహన యూనివర్సిటీని క్యాంపస్ ఆవరణలోనే ఏర్పాటు చేయాలని సునీల్ రావు డిమాండ్ చేశారు.

## ఏఎస్ఐ రామన్న భార్యకు 70లక్షలు

### హెచ్ డీ ఎఫ్ సి ఇన్స్యూరెన్స్ చెక్కును అందజేసిన సీపీ గౌస్ అలం



కరీంనగర్, మార్చి 26(భారత శక్తి):కరీంనగర్ లోని సితారాంపూర్ కు చెందిన ఏఎస్ఐ టి. రామస్వామి ఇటీవల అగ్ని ప్రమాదంలో మరణించిన సంగతి తెలిసిందే. రామస్వామి జీతం అకౌంట్ హెచ్ డీ ఎఫ్ సి బ్యాంకులో ఉన్నందున దానికి సంబంధించి పాకేజ్ లో ఉండగా అందుకు గాను 70 లక్షల ఇన్స్యూరెన్స్ డబ్బులు మంజూరు అయ్యాయి.

ఈ సందర్భంగా బుధవారం కమిషనరేట్ కార్యాలయంలో కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ అలం చేతుల మీదుగా 70లక్షల రూపాయల చెక్కును రామస్వామి భార్యకు అందజేశారు.ఈ కార్యక్రమంలో బ్యాంకు అధికారులు కే.ఈ.శ్యామ్ సుందర్, సురేష్ తాటికొండ, ఎం.ఏ.హుస్సేన్ లు పాల్గొన్నారు.

# బిజెపి, బీఆర్ఎస్ దోపిడీ దొంగలే




కరీంనగర్, మార్చి 26(భారత శక్తి):బిజెపి, బీఆర్ఎస్ రెండు పార్టీలు దోపిడి దొంగలేనని, పది సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్నపుడు బీ ఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రజలను మోసం చేసుకుంటూనే కాలమెల్లదీసిందనీ యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అజీమ్ ఆరోపించారు.. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి కనుసన్న లలోనే రాష్ట్రంలో బి ఆర్ ఎస్ అధికారంలో ఉండి రాష్ట్ర ప్రజలను మోసం చేస్తూ రాష్ట్రాన్ని దోచుకున్నారని ఆరోపించారు.

బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ మతిభ్రమించి రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్ నాలుగు సార్లు గెలిచి కరీంనగర్ కి ఏం చేశారని ప్రశ్నించారు. బీ ఆర్ ఎస్ ప్రభుత్వం అధికారం లో వున్నప్పుడు నిరుద్యోగ బృతి ?3,000 ఇస్తానని హామీఇచ్చి ఇవ్వలేకపోయారనీ చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా యువజన కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్లు ఫహాద్, జరిపోతుల వాసు,కొత్తపెల్లి మండల్ వైస్ ప్రెసిడెంట్ ఉల్లందుల అనిల్, అంజిత్ రెడ్డి, రాజు లు పాల్గొన్నారు.

# ఆకాంక్షలు నెరవేర్చకుంటే నిరసన తప్పదు:టీజీఇజెఎసి చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి



కరీంనగర్, మార్చి 26(భారత శక్తి):ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల సమస్యల సాధనకు తక్షణం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ఆ పథకాలను ప్రజలకు చేర్చే ఉద్యోగ ఉపాధ్యాయల పెన్షనర్ల పట్ల ఉదాసీనత పనికిరాదని, తమ ఆకాంక్షలు నెరవేర్చనియెడల నిరసన తప్పదని టీటీజేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు. నగరంలోని టీఎన్జీఎస్ భవన్లో టీజిఇజేఏసీ జిల్లా కమిటీ ఏర్పాటు సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం టీజిఇజేఏసీ సెక్రెటరీ జనరల్ గా మడిపల్లి కాలి చరణ్, కో చైర్మన్లుగా ఐలేని కరుణాకర్ రెడ్డి, కట్ట రవీంద్ర చారి, తూముల తిరుపతి, పెద్ది విజయ్, ముల్కల కుమార్, శశిధర్ శర్మ, డాక్టర్ శ్రీనివాసరెడ్డి, కోట రామస్వామి, మోసం అంజయ్య, పెండ్యాల కేశవరెడ్డి, ఖాజా మన్సూర్ అలీ, వంగ వెంకటేశ్వర్లు, పరుశురాముల గౌడ్, కోశాధికారిగా సంగెం లక్ష్మణరావు, అదనపు ప్రధాన కార్యదర్శిగా బిక్షపతి, డాక్టర్ అరవింద్ రెడ్డి, ప్రవీణ్ రావు, వెంకన్న, రాజశేఖర్ రెడ్డి, అభినవ్, సురేందర్ రెడ్డి, రాజిరెడ్డి, అజయ్, గజన్ లాల్ ,గురు ప్రసాద్, నారాయణరెడ్డి, రాజమహేందర్ రెడ్డి పులి నగేష్ గౌడ్, మహిళా విభాగం చైర్మన్గా శారద, సెక్రటరీ జనరల్ గా ఎం. వీణ మహిళ బాధ్యులుగా సునీత, విజయలక్ష్మి, స్వరూప,భాగ్యలక్ష్మి, భూపేందర్ కౌర్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐక్య ఉద్యమం ద్వారా ప్రభుత్వం పై ఒత్తిడికి తక్షణ కార్యచరణ ప్రారంభించాలని హక్కుల సాధనకై ఉద్యమించాల్సిన పరిస్థితిలు తలెత్తాయని అన్నారు. ఆర్థిక ఇతర ఆర్థికపరమైన అంశాలపై రాష్ట్ర జేఏసీ ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదన సమర్పించిందని, తక్షణం విధానపరమైన నిర్ణయం తీసుకొని ఉద్యోగ ఉపాధ్యాయ పెంచిన ఆకాంక్షలను నెరవేర్చాలని వారి పేర్కొన్నారు. గత సంవత్సరం నరకాలంగా ఎంతో ఓపికతో ఉద్యోగులు ఎదురు చూశారని ప్రభుత్వాలు స్పందించకుంటే తీవ్రమైన నిరసనను, ఉద్యమ తీవ్రతను ఎదుర్కోవాల్సి ఉంటుందని వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో టీఎన్జీవో రాష్ట్ర ఊపాధ్యక్షులు నరసింహస్వామి, నాయకులు కిరణ్ కుమార్, రాజేష్ భరద్వాజ్, హర్మిందర్, సుమంత్ రావు, నారాయణ కరుణాకర్, నరసయ్య, పిఆర్ టి యు,టి ఆర్ టి యు, యుటిఎఫ్ పెన్షనర్లు నాయకులు పాల్గొన్నారు.

# శ్రమ దోపిడీకి గురవుతున్న ఉపాధి హామీ కూలీలు

## రోజు కూలీ 600 రూపాయలు ఇవ్వాలి

## బి కె యం యు రాష్ట్ర కార్యదర్శి సృజన్ కుమార్



కరీంనగర్, మార్చి 26(భారత శక్తి):ఉపాధి హామీ కూలీలకు పనికి సరైన కూలీ రావడం లేదని, శ్రమ దోపిడీకి గురవుతున్నారని, రోజు వారి కూలీ 600 రూపాయలు ఇవ్వాలని బి కె యం యు రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం కరీంనగర్ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ కూలిలను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సృజన్ కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న బడుగు బలహీన వర్గాలకు చేతినిండా పని కల్పించి వారిని ఆర్థికంగా ఆదుకువాలనే ఉపాధి హామీ పథకం లక్ష్యం నెరవేరడం లేదని,కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయంపులు పెంచాలని, జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి పని కల్పించాలని, కూలీలకు కోలుతలు పెట్టి పని చేయించడం ద్వారా పని ప్రదేశాల్లో భూములు గట్టి పడడం వల్ల రోజు వారి కూలీ కేవలం వంద రూపాయలు పడుతున్నాయని దింతో కూలీలు శ్రమ దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కొలతలు నిబంధన లేకుండా ప్రతి రోజు కూలీ 600 రూపాయలు చెల్లించాలని, ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు అయిన త్రాగునీరు, నీడ సౌకర్యం, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్ల పంపిణి, ప్రధమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలని అన్నారు.పని ప్రదేశం కిలో మీటర్ దూరం దాటితే రవాణా సౌకర్యం కల్పించాలని, పార, గడ్డ పార పదును వేయడానికి డబ్బులు చెల్లించాలని, 200 రోజులు పని కల్పించాలని, ఉపాధి కూలీలకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, పని గ్యారంటీ చట్టాన్ని అమలు చేయాలని సృజన్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ శ్రీనివాస్, రాజయ్య, మల్లేశం, రజిత, కవిత, రాజేశ్వరి, విజయ, కనుకవ్వ, లక్ష్మి, శోభరాణి తదితరులు పాల్గొన్నారు.

# బ్యాడ్మింటన్ కాంస్య పతకం సాధించిన పల్లెం రాజాలింగు.

## -అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన మాజీ సింగరేణి కార్మికుడు.




మందమరి టౌన్, మార్చ్ 26 (భారత శక్తి):ఇటీవల గోవాలో జరిగిన జాతీయ వెటరన్ బ్యాడ్మింటన్ పోటీలలో మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన పల్లెం రాజలింగు మాజీ సింగరేణి కార్మికుడు పాల్గొని కాంస్య పతకం సాధించారు. 75 సంవత్సరాల విభాగం డబుల్స్ పోటీలో విజేతగా నిలిచి కాంస్య పతకం అందుకున్నారు. జాతీయ స్థాయిలో గెలుపొందిన పల్లెం రాజాలింగు వచ్చే నెల అంతర్జాతీయ స్థాయిలో థాయిలాండ్ లో జరుగనున్న పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాజలింగు మాట్లాడుతూ గతంలో రెండుసార్లు అంతర్జాతీయ స్థాయికి ఎంపికయ్యారని 75ఏళ్ల వయస్సులో ఆడే అవకాశం సత్తా ఉన్న ఆర్థిక స్తోమత లేక వెళ్ళకపోయినట్లు తెలిపారు.

# ఏప్రిల్ 2నుంచి జరిగే కార్యక్రమాలను విజయవంతం చేయాలి: పురుమల్ల శ్రీనివాస్



కరీంనగర్, మార్చి 26(భారత శక్తి)కేంద్రా హెూం శాఖా మంత్రి అమిత్ షా అంబేద్కర్ ను అవమానపరిచేలా చేసిన వాఖ్యలకు నిరసనగా కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో వచ్చే నెల 2నుంచి దేశ వ్యాప్తంగా జరిగే జై భీమ్, జై బాపు, జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించి విజయవంతం చేయాలని కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి పురుమల్ల శ్రీనివాస్ అన్నారు. బుధవారం కరీంనగర్ రూరల్ మండలం చర్లభూత్కూరు గ్రామంలో శ్రీనివాస్ ఆధ్వర్యంలో కరీంనగర్ రూరల్ మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామానికి ఏప్రిల్ 2వ తేదీ నుండి 10 వ తేదీ వరకు "జై బాపు, బై భీమ్, జై సంవిధాన్" ప్రజా చైతన్య యాత్ర చేపట్టాలని, ఆ కార్యక్రమంలో.. ప్రతీ కార్యకర్త పాల్గొని ప్రతి గడపకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన, చేస్తున్న సంక్షేమ పథకాల గురించి తెలియజేయాలని తెలిపారు.ఈ సమావేశంలో నాయకులు ఆసంపెల్లి శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సాయిని తిరుపతి, కరీంనగర్ రూరల్ మండల అధ్యక్షులు కాం రెడ్డి రాం రెడ్డి, కరీంనగర్ రూరల్ మండల గ్రామాల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# సజావుగా ధాన్యం కొనుగోలు జరిగేలా పటిష్ట కార్యాచరణ రూపొందించాలి: జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్





ఖమ్మం ప్రతినిది (భారత శక్తి న్యూస్ ), మార్చ్ 26:యాసంగి మార్కెటింగ్ సీజన్ లో ఖమ్మం జిల్లాలో సజావుగా ధాన్యం కొనుగోలు జరిగేలా పటిష్ట కార్యాచరణ రూపొందించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. భక్త రామదాసు కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు సన్నాహక సమావేశంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ లో ధాన్యం కొనుగోలు ఖమ్మం జిల్లాలో విజయవంతంగా జరిగిందని అభినందించారు. రైతు కోసం పనిచేస్తున్నామనే అంశాన్ని ప్రతి ఒక్కరు జ్ఞాపకం పెట్టుకోవాలని కలెక్టర్ సూచించారు. రైతులు పండించిన వరి పంట విస్తీర్ణం, పంట కోతల సమయం, కొనుగోలు కేంద్రాలకు ఎప్పుడు పంటలు తీసుకుని వస్తారనే అంశం వ్యవసాయ శాఖ ప్రణాళిక బద్ధంగా షెడ్యూల్ చేయాలని అన్నారు. సన్న రకం, దొడ్డు రకం దాన్యం కొనుగోలుకు వేర్వేరు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు.ధాన్యం కొనుగోలు కేంద్రాలలో వచ్చే ధాన్యం అంచనా ప్రకారం అవసరమైన వెయింగ్, తేమ యంత్రాలు, ప్యాడీ క్లీనర్, టార్పాలిన్, గన్ని సంచులు మొదలైన మౌళిక వసతులు ఉండేలా చూడాలని అన్నారు.వేయింగ్ యంత్రాలను, తేమ యంత్రాల పని తీరు చెక్ చేసి సర్టిపై చేయాలని అన్నారు. త్రాగు నీరు, విద్యుత్ సరఫరా, లైట్లు మొదలగు సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. వేసవి దృష్ట్యా త్రాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని, చల్లని త్రాగు నీరు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, అవసరమైన మేర ఓఆర్ఎస్ ప్యాకేట్లు పెట్టుకోవాలని అన్నారు. వడదెబ్బ తగిలితే వారికి ప్రాథమిక చికిత్స అందించే ఏర్పాటు చేయాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన టెంట్లను ఏర్పాటు చేయాలని అన్నారు.రైతులు పండించిన సన్న రకం ధాన్యాన్ని వ్యవసాయ విస్తరణ అధికారులు సర్టిపై చేయాలని కలెక్టర్ సూచించారు. గ్రామాలలోనే తేమ యంత్రాలు అందుబాటులో పెట్టి, తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తీసుకుని వచ్చేలా చూడాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ముందుగా రైతులకు బస్తాలు ఇవ్వడానికి వీలు లేదని అన్నారు. కొనుగోలు సమయంలో మాత్రమే రైతులకు బస్తాలు ఇవ్వాలని అన్నారు. కొనుగోలు కేంద్రంలో అందుబాటులో ఉన్న బస్తాల వివరాలను ఎప్పటికప్పుడు నోటీసు బోర్డులో అప్ డేట్ చేయాలని అన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత వెంటనే వివరాలను ట్యాబ్ ఎంట్రీ చేసేలా చూడాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల ఇంచార్జిలకు నూతన సిమ్ కార్డులను అందించి డేటా ఎంట్రీ సత్వరం జరిగేలా చూడాలని అన్నారు. రైతులకు 48 గంటల వ్యవధిలో డబ్బులు జమ అయ్యేలా చూడాలని అన్నారు. రైస్ మిల్లులో ఎట్టి పరిస్థితుల్లోనూ తాళ్ళు కట్ చేయడానికి వీలు లేదని, నాణ్యతను కొనుగోలు కేంద్రాల దగ్గరే పరిశీలించి పంపాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద, రైస్ మిల్లుల వద్ద ఎక్కడ హమాలీల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు ఒకేసారి జరుగుతున్న నేపథ్యంలో రవాణా వాహనాలకు ఇబ్బందులు రాకుండా మందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైస్ మిల్లులకు తరలించేలా పటిష్ట వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సరిహద్దు ప్రాంతాలలో ఇతర రాష్ట్రాల నుంచి సన్న రకం ధాన్యం రాకుండా చూడాలని అన్నారు. అనంతరం వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ద్వారా రైతులందరికీ విజ్ఞప్తి పేరున రబీ వ్యవసాయ మార్కెటింగ్ సీజన్ కు సంబంధించిన కనీస మద్దతు ధరలు తెలిపే కరపత్రాన్ని జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సమావేశంలో డిఆర్డిఓ సన్యాసయ్య,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ జి. శ్రీలత, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం.ఏ. అలీం, జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్, జిల్లా సహకార అధికారి గంగాధర్, ప్రత్యేక అధికారులు, సెంటర్ ఇన్చార్జి లు ఐ.కె.పి., సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు షీ టీం మీద అవగాహన సదస్సు

మందమర్రి టౌన్, మార్చి 26 (భారత శక్తి): పట్టణంలోని శివాని ఉన్నత పాఠశాలలలో విద్యార్థులకి షీ టీమ్ అవగాహనా కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా షీ టీం సభ్యులు మాట్లాడుతూ ఆకతాయిల ఆట కట్టించి మహిళలకు రక్షణ కల్పించేది షి టీం కర్తవ్యం అని, పిల్లలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి, మహిళలు ఏదైనా సమస్య వస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని, అలాగే సైబర్ నేరాల గురించి తెలిపారు. వచ్చిన ఫిర్యాదు పై తక్షణమే షీ టీం పోలీసులు స్పందించి సంబంధిత విభాగాలకు సమాచారం అందజేయడం ద్వారా ఫిర్యాదు చేసిన మహిళకు షీ టీం బృందాలు సహాయం చేస్తాయని తెలిపారు. ఆకతాయిల నుండి మరి ఏ ఇతర వేధింపులకు గురవుతున్న మహిళలు ఫిర్యాదు చేయాలనుకుంటే 6303923700 నెంబర్ సంప్రదించాలని కోరారు. అలాగే అత్యవసర సమయంలో డయల్ 100 కి ఫిర్యాదు చేయాలన్నారు, ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఈ అవగాహన



కార్యక్రమంలో షీ టీం సభ్యులు మహిళా కానిస్టేబుల్ జ్యోతి,శ్రీలత, పాఠశాల ఇంచార్జ్ రవీందర్, ఉపాధ్యాయులు, కళాభారతి, ప్రియాంక, మల్లేశం, మహేశ్వరి, మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# మూడేళ్లుగా పైపులైన్ కోసం రోడ్డు తవ్వి వదిలేసిన వైనం,రోడ్డు వేయాలని కమిషనర్ వినతి



కరీంనగర్, మార్చి 26(భారత శక్తి):మున్సిపల్ కాంట్రాక్టర్ కు చేసిన పనులకు బిల్లులు రాకనో మరి,ఆ రోడ్డును వేయద్దు అనో..మరి...అక్కడి వారు కొంతమంది ఆ కాంట్రాక్టర్ కు నచ్చకనో మరి మూడేళ్లుగా రోడ్డును తవ్వి వదిలేయగా డివిజన్ ప్రజలను నాన ఇబ్బందులు పడుతున్నారు. ఈ వైనం ఎక్కడో జరిగింది కాదు.సాక్ష్యాత్తు నగరంలోని 6వ డివిజన్ పరిధిలోకి వెంకటసాయి థియేటర్ వెనకాలో సంధి.గత మూడు సంవత్సరాల నుంచి పైప్ లైన్ కోసం అని కాంట్రాక్టర్ రోడ్డును తవ్వి వదిలేయడం తో రోడ్డు మొత్తం డామేజ్ అయింది.దీంతో దుమ్ము ధూళి తో చుట్టూ నివసిస్తున్న ప్రజలకు ఆరోగ్య సమస్యల బారినియపడుతున్నాడు. ఈ రోడ్డుపైన నడుస్తున్న పాదచారులకు, వాహన దారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని నగర పాలక కాంట్రాక్టర్ అసోసియేషన్ కన్వీనర్ దుగ్గు మహేందర్ రాకేష్, డివిజన్ వాసి, న్యాయవాది వాసాల హరీష్ లు నగరపాల సంస్థ కమిషనర్, అడిషనల్ కమిషనర్ లకు కలిసి వినతి పత్రం అందజేశారు. అలాగే ఆ సంధి లో రొడ్డును తవ్విన ప్రదేశం యొక్క ఫోటోలు చూపించి, సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించి కమిషనర్ వారితో మాట్లాడుతూ కాంట్రాక్టర్ గారితో రోడ్డు వేయిస్తానని తమకు హామీ ఇవ్వడం జరిగిందని దగ్గు మహేందర్ తెలియజేశారు.

# రాజీవ్ యువ వికాస పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి: జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్‌అధ్యక్షులు కొరివి



కరీంనగర్, మార్చి 26(భారత శక్తి):కరీంనగర్ జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, నిరుద్యోగ యువతి యువకులు రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు కొరివి అరుణ్ కుమార్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గతంలో ఎన్నడూ కనీ విని ఎరుగని రీతిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా తెలంగాణ రాష్ట్రంలోని యువతీ యువకులందరికీ మేలు కలిగే విధంగా దాదాపు 6000 కోట్ల రూపాయలు కేటాయించి రాజీవ్ యువ వికాసం రూపొందించారని ఆయన తెలియజేశారు. గత టిఆర్ఎస్ పాలనలో ఎస్సీ ఎస్టి సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించి దళితులకు అన్యాయం చేశారని, అదేవిధంగా అన్ని కార్పొరేషన్లను నిర్వీర్యం చేశారని, కానీ కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగ యువతను ఆదుకోవాలనే సదుద్దేశంతో ఈ పథకాన్ని రూపొందించారని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే మీసేవ కేంద్రాల ద్వారా ఈ పథకానికి దరఖాస్తులు తీసుకుంటున్నారని ఏప్రిల్ 5 చివరి తేదీ అని ఆయన తెలియజేశారు. 50 వేల నుండి 4 లక్షల వరకు రుణాలు ఇస్తారని స్కీమును బట్టి 60% నుండి 90% వరకు సబ్సిడీ ఉంటుందని ఆయన తెలియజేశారు. ఈ పథకం ద్వారా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 5 లక్షల మంది యువతకు లబ్ధి చేకూరుతుందని అన్నారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# ఉత్సాహంగా ఉల్లాసంగా అల్ఫోర్స్ హైస్కూల్ "బ్లాసూమ్" వార్షికోత్సవం



కరీంనగర్, మార్చి 26(భారత శక్తి):విద్యార్థులకు సామాజిక అవగాహనతో పాటు నైతిక విలువల పట్ల అవగాహన పెంపొందించాలని తద్వారా సమాజంలో సముచిత స్థానాన్ని పొందుతారని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి అన్నారు. కరీంనగర్ లోని కిసాన్ నగర్ లోగల ప్రవేట్ మందిరంలో "బ్లాసూమ్" పేరుతో నిర్వహించినటువంటి అల్ఫోర్స్ హై స్కూల్ కిసాన్ నగర్ పాఠశాల వార్షికోత్సవ వేడుకలు ఉల్లాసంగా ఉత్సాహంగా నిర్వహించారు. ముందుగా ప్రాంగణంలో ఏర్పాటుచేసిన సరస్వతి మాత విగ్రహానికి పూలమాలవేసి, జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను నరేందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తప్పనిసరిగా తల్లిదండ్రులను నిర్దేశించినటువంటి లక్ష్యాలను చేరుకొని సమాజంలో అందరికీ ఆదర్శంగా ఉండాలని సూచిస్తూ విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలలో నేర్చుకున్నటువంటి విషయాలను ఎప్పటికప్పుడు సాధన చేస్తూ విషయాలలో పట్టు సాధించి సమాజంలో అగ్రగామిగా కొనసాగాలని చెప్పారు. ఈ క్రమంలో విద్యార్థులు మరింత దృష్టి సారింప చేసి, మార్పులు అనుగుణంగా వ్యవహరిస్తూ అగ్రభాగాన ప్రముఖంగా నిలవాలని కోరారు. పలు దేశాలైన ఆస్ట్రేలియా, కెనడా ,అమెరికాలో విద్యార్థుల సమయాన్ని సద్వినియోగం చేసుకుంటారని, ఎప్పుడు కూడా దేశం అభివృద్ధి చెందాలనే తపనతో ఉంటారని మరియు ప్రతి విద్యార్థి కూడా వివిధ పోటీ పరీక్షల్లో పాల్గొనడమే కాకుండా విజయం సాధించాలని మరి లక్ష్యాలను నెరవేర్చుకోవాలని చెప్పారు. తల్లిదండ్రులు కూడా వారి పిల్లలను ఎప్పటికప్పుడు ఉత్సాహపరుస్తూ ముందుకు సాగాలని కోరారు.వేడుకలలో భాగంగా ఫలు పోటీ పరీక్షలలో నిలిచినటువంటి అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించినటువంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు, నాటికలు ఆలోచింపచేసాయి మరియు సభికులను ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నెలవారీ నేర సమీక్ష సమావేశాలు నిర్వహించాలి

## -హుజూరాబాద్ సబ్ డివిజన్ నేర సమీక్షలో పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం







కరీంనగర్, మార్చి 26(భారత శక్తి):ప్రతి నెల ఏసిపి అధికారులు డివిజన్ స్థాయి నేర సమీక్ష సమావేశాలు నిర్వహించాలని, సిఐలు తరుచూ పోలీస్ స్టేషన్లు తరుచూ సందర్శించాలని, అప్పుడే శాంతిభద్రతలు అదుపులో ఉంటాయనీ కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ అలం ఆదేశించారు. మంగళవారం హుజురాబాద్ సబ్ డివిజన్ ఏసీపీ కార్యాలయంలో కరీంనగర్ పోలీసు కమీషనర్ గౌష్ ఆలం డివిజన్ స్థాయి నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా పోలీసు కమీషనర్ మాట్లాడుతూ పిటిషన్ మేనేజ్మెంట్ సిస్టం ను సరైన పద్దతిలో అవలంభించాలన్నారు. ఆయా సర్కిల్ ఇన్స్పెక్టర్లు వారి పరిధిలోని పోలీసు స్టేషన్లను తరుచూ సందర్శిస్తూ పనితీరును పర్యవేక్షించాలని, అలాగే ఏసీపీ అధికారులు డివిజన్ స్థాయిలో ప్రతినెల నేర సమీక్షలు నిర్వహించాలనీ ఆదేశించారు. సీసీసీ ద్వారా వచ్చే ఫిర్యాదులను ప్రాధాన్యత కల్పించి త్వరితగతిన పరిష్కరించాలన్నారు.

:ంశాంతి భద్రతల తలెత్తకుండా::

ఆకస్మాత్తుగా తలెత్తే శాంతి భద్రతల సమస్యలను పరిష్కరించేందుకు సరైన లాఠీ , హెల్మెట్ తో సంసిద్ధంగా వుండలన్నారు. ఎస్ హెచ్ ఓ గా విధులు నిర్వహిస్తున్న ఎస్సై, ఇన్స్పెక్టర్ స్థాయి అధికారులు పోలీసు స్టేషన్ మేనేజ్మెంట్ సక్రమంగా నిర్వహించాలనీ, పోలీసుస్టేషన్, పరిసరాలు కనీస శుభ్రతను పాటించేలా చూడాలని తెలిపారు. సరైన పద్ధతిలో రికార్డుల నిర్వహణ, నమోదైన కేసుల వివరాలు సిసిటిఎన్ఎస్ లో పొందుపరిచి, పెండింగ్ కేసులపై సమీక్ష చేసి, వాటికి గల కారణాలు తెలుసుకున్నారు. త్వరితగతిన వాటిని పూర్తి చేయాలనీ సూచించారు.

::పట్టుబడ్డ వాహనాలు వేలం వేయాలి::

పోలీసు స్టేషన్ ఆవరణలో పలు కేసుల్లో పట్టుబడి స్వాదీనంలో ఉన్న వాహనాలు రికార్డుల్లో నమోదు చేసి, స్టేషన్లలో వదిలివేయబడిన వాహనాలను వేలం వేయుటకు పై అధికారులకు తెలపాలన్నారు.

రికార్డ్ నిర్వహణ, సీసీటీఎన్ఎస్, రిసెప్షను, కోర్టు డ్యూటీ, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, బీట్, పెట్రోలింగ్, పాయింట్ బుక్ ల ఏర్పాటు, సమన్లు మొదలుగు విధులను సమర్ధవంతంగా నిర్వహించి రాష్ట్ర స్థాయి లో గుర్తింపు పొందాలన్నారు.

::డివిజన్ మొత్తాన్ని సెక్టార్లుగా విభజించాలి::

డివిజన్ మొత్తాన్ని సెక్టార్లుగా విభజించాలని ప్రతి సెక్టార్ కి ఏఎస్సై లేదా హెడ్ కానిస్టేబుల్ లను ఇంచార్జ్ అధికారులుగా నియమించాలని, తిరిగి సెక్టార్లను, ఒకే మార్గంలో వుండే రెండు మూడు గ్రామాలని కలిపి సబ్ ఇన్స్పెక్టర్లుగా విభజించి దానికి కానిస్టేబుళ్లను కేటాయించాలని సూచించారు. దీని ద్వారా క్షేత్ర స్థాయిలో సమస్యలు తెలుసుకోవడంతోపాటు ప్రజలకు సేవలందించగలమన్నారు.

::రౌడీ, హిస్టరీ షిటర్లపై ప్రత్యేక నిఘా::

రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. ప్రతి నెల వారికి సంబందించిన నూతన సమాచారం ఎప్పటికప్పుడు సేకరించి నమోదు చేసుకోవాలన్నారు.

::గంజాయి పై ఉక్కుపాదం మోపాలి ::

గంజాయి రవాణా, అక్రమ ఇసుక రవాణా, పి.డి.ఎస్. బియ్యం, పేకాట స్థావరాలను గుర్తించి ఆడేవారిని పట్టుకోవడం, వంటి వాటిని గుర్తించి తగిన కేసులు నమోదు చేసి, వాటిపై ఉక్కుపాదం మోపాలన్నారు.గంజాయిని నిర్మూలించేందుకు తీసుకునే చర్యల్లో భాగంగా స్థానిక పాఠశాల, కళాశాలల్లో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేస్తూ అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

::రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలు బ్లాక్ హెూల్స్ పెట్టాలి::

సైబర్ నేరాల సంఖ్య రోజురోజుకీ పెరుగుతున్నందున, వాటి బారిన పడకుండా ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. పెండింగ్ వారెంట్ల అమలు చేయాలన్నారు.

రోడ్డు ప్రమాదాలు తరుచూగా జరిగే ప్రాంతాలను బ్లాక్ హెూల్స్ గా గుర్తించి, రోడ్డు ప్రమాదాల నివారణకై చర్యలు చేపట్టాలన్నారు.

::వాహనాలను తనిఖీ చేసిన సీపీ::

డివిజన్ లోని పోలీసుస్టేషన్లకు, అధికారులకు కేటాయించబడిన వాహనాలను తనిఖీ చేసారు. వాహనాలను సక్రమంగా వాడుకోవాలన్నారు. డ్రైవర్లకు ఎప్పటికప్పుడు సరైన శిక్షణ అందించాలన్నారు. రానున్న రోజుల్లో వచ్చే పండుగలైన రంజాన్ , శ్రీరామనవమి, హనుమాన్ జయంతి దృష్ట్యా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తుతో పాటు తగిన భద్రతా పరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

ఈ సమావేశంలో హుజురాబాద్ ఏసీపీ సిహెచ్ శ్రీనివాస్, జమ్మికుంట సిఐ రవి, జమ్మికుంట రూరల్ సిఐ కిషోర్, హుజురాబాద్ రూరల్ సీఐ వెంకట్, సీసీఆర్బి సంతోష్ కుమార్ రమేష్ ,సైబర్ సెల్రమేష్ , ఐటీ కోర్ సరిలాల్, డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్ల ఎస్సై లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీలత మెటర్నటీ నర్సింగ్ హెూమ్ లో మొబైల్ అల్ట్రా సౌండ్ మెషిన్ సీజ్ : జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ



కరీంనగర్, మార్చి 26(భారత శక్తి):తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, కరీంనగర్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ ఆధ్వర్యంలో అల్ట్రా సౌండ్ స్కానింగ్ ఫెర్టిలిటీ కేంద్రాలపై స్పెషల్ డ్రైవ్ టీం తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా నగరంలోని శ్రీలత మెటర్నటీ నర్సింగ్ హెూమ్ హాస్పిటల్లో అనధికారికంగా రిజిస్టర్డ్ కానీ మొబైల్ అల్ట్రా సౌండ్ మిషను కనుగొని రెవెన్యూ, పోలీస్ శాఖ ఏ ఎస్ ఐ తో కూడిన స్పెషల్ డ్రైవ్ తనిఖీ బృందము శ్రీలత మెటర్నిటీ నర్సింగ్ హెూమ్ కి నోటీసు ఇచ్చి మొబైల్ అల్ట్రా సౌండ్ మిషను సీజ్ చేశారు. బుధవారం సీజ్ చేసిన వివరాలను డాక్టర్ వెంకటరమణ తెలియజేశారు.

హాస్పిటల్లో స్కానింగ్ కొరకు వచ్చే పేషెంట్లు వివరాలతో కూడిన ఫామ్ ఎఫ్ ఫారం ను పూర్తి పూర్తి చేసి ఏ రోజుకు ఆ రోజు ఆన్లైన్లో అప్డేట్ చేస్తున్నటువంటి విధానాన్ని పరిశిలించామని చెప్పారు. అవుట్ పేషెంట్ రిజిస్టర్ లు, పి.సి.పి.ఎన్.డి.టి జిల్లా అప్రోప్రియేట్ అథారిటీ కమిటీ ద్వారా రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్స్, అందులో పని చేస్తున్న డాక్టర్స్ క్వాలిఫికేషన్ వెరిఫికేషన్, గర్భస్థ పూర్వ, గర్భస్థ లింగ నిర్దారణ చట్టం %-% 1994 మరియు రూల్స్ 1996 అమలవుతున్న తీరు, గర్భస్థ శిశువుగా ఉన్నప్పుడూ స్త్రీ, పురుష లింగ నిర్దారణ పరీక్షలు చేసినట్లయితే పరీక్షలు చేసిన వారికి, చేయించుకున్న వారికి, అందుకు ప్రోత్సహించిన వారికి చట్ట ప్రకారం మూడు సంవత్సరాల వరకు జైల్ శిక్ష, పది వేల రూపాయల జరిమానా విధించబడుతుందని చెప్పారు. అలాగే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, తెలిపే బోర్డులు ప్రదర్శిస్తున్నారా లేదా స్కానింగ్ కేంద్రాలలో కచ్చితంగా రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, ధరల పట్టిక, సరైన రికార్డుల నిర్వహణ ఉండాలని, ప్రతి నెల జరిగే స్కానింగ్ వివరాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి పంపిస్తున్న తీరు, లింగ నిర్దారణ పరీక్షలు చట్ట రీత్యా నేరమని, పుట్టబోయే బిడ్డ ఆడ, మగ అని చెప్పకూడదని బోర్డులు స్కానింగ్ కేంద్రాలలో ప్రదర్శించడాన్ని తనిఖీ చేయడం జరిగిందన్నారు.. ఈ స్కానింగ్ కేంద్రల, ఫెర్టిలిటీ కేంద్రాల యొక్క తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని డాక్టర్ వెంకటరమణ తెలియజేశారు. ఈ స్పెషల్ డ్రైవ్ తనిఖీ లో మొబైల్ అల్ట్రా సౌండ్ మిషన్ సీజ్ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాములు, జూనియర్ అసిస్టెంట్ బాపు దేవ్ , ఏ.యస్.ఐ. విజయమణి , పి.ఓ.,డి.టి.టి. డా. ఉమాశ్రీ, పి.సి.పి.ఎన్.డి.టి ప్రోగ్రామ్ అధికారి, డా. సనా జవేరియా , సఖి కన్సల్టెంట్, డి. లక్ష్మి , డాటా ఎంట్రీ ఆఫరేటర్, కె. రమేశ్, డెమో, రాజగోపాల్ , సుపెర్వైజర్ సయ్యద్ సబీర్ పాల్గొన్నారు.

# నకిలీ కల్తీ విత్తనాల సరఫరా చేసే ముఠా అరెస్ట్

## -రూ.9,12,500/-పత్తి విత్తనాలు స్వాధీనం

## -బెల్లంపల్లి ఏసీపీ ఏ. రవికుమార్






మందమర్రి టౌన్, మార్చి 26 (భారత శక్తి): మందమర్రి పోలీస్ స్టేషన్ సర్కిల్ పరిధిలో నకిలీ పత్తి విత్తనాలను సరఫరా చేసే ముఠాను అరెస్ట్ చేసి నట్టు బెల్లంపల్లి ఏసిపి ఏ. రవికుమార్ స్థానిక పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సంవత్సరంలో తెలిపారు. పై కేసులో గోవిందల శంకర్ అరెస్టు చేసి పరారిలో ఉన్న అబ్దుల్ రజాక్ కోసం, అంబర్ కిషోర్ జా ఐపీస్ డి ఐ జి, సిపి రామగుండం ఒక ప్రత్యేక టిం ను ఏర్పాటు చేసి అబ్దుల్ రజాక్ కోసం వెతుకుతుండగా, బుధవారం అబ్దుల్ రజాక్ ను మందమర్రిలో ఉదయం పూట పట్టుకొని విచారించగా అతడు గుజరాత్ నుండి పత్తి విత్తనాలను తీసుకొని వచ్చి వివిధ రైతులకు అమ్ముతాడని తెలియజేసినాడు. అలాగే ఇంతకు ముందు మందమర్రి కి చెందిన జానీ, చంద్రయ్య బాలకృష్ణ లకు పత్తి విత్తనాలు అమ్మానని, వీరికి అమ్మిన తరువాత అదేవిధంగా మందమర్రి చెందిన తిరుపతి సహాయంతో పొన్నారం కు చెందిన బొలిశెట్టి జనార్దన్ కు కూడా 7 సంచుల (ఒక సంచి లో 45 కిలోలు) 315 కిలోల పత్తి విత్తనాలు అమ్మడని తెలుపగా, ఇట్టి సమాచారం మేరకు మందమర్రి కి చెందిన తిరుపతిని మరియు పొన్నారం కి చెందిన జనార్దన్ పట్టుకొని విచారించగా జనార్దన్ కొనుగోలు చేసిన పత్తి విత్తనాలను తిరుపతి సహాయంతో దేవాపూర్ లోని చింతగూడ గ్రామంలో సల్పల వాగు పక్కకు దాచి అవసరం ఉన్న వారికి అమ్ముతారని తెలుపగా సంఘటిత స్థలానికి వెళ్లి తనిఖీ చేయగా అక్కడ 7 సంచుల (ఒక సంచి లో 45 కిలోలు) 315 కిలోల పత్తి విత్తనాలు దొరికినాయి వీటి విలువ విలువ రూ.7,87,500/- దొరికిన పత్తి విత్తనాలను స్థానిక మండల వ్యవసాయ అధికారిచే పంచనామ చేయించి నిందితులను అరెస్ట్ చేయడం జరిగినది.ఏసీపీ రవికుమార్ మాట్లాడుతూ ఈ నకిలీ పత్తి విత్తనాలు వాడడం వల్ల భూమి యొక్క సారవంతం కోల్పోయి రానున్న రోజుల్లో పంట యొక్క దిగుబడి తగ్గుతుంది మరియు పర్యావరణం పై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ యొక్క గైపోసిట్ నకిలీ పత్తి విత్తనాలు వాడడం వల్ల రైతులకు చర్మ సంబంధిత వ్యాధులు కూడా వచ్చే అవకాశం ఉంది.కావున ప్రజలు ఎవరైనా నకిలీ పత్తి విత్తనాలు అమ్మిన, కొన్న, సరఫరా చేసిన, నిల్వ ఉంచుకున్న వారిపైన చట్టపరమైన కఠిన చర్యలు తీసుకొనబడును, అలాగే వీటి సమాచారం గురించి ఎవరికైనా తెలిసిన దగ్గరలోని పోలీసులకు తెలియజేయగలరని, తెలియజేసిన వారి యొక్క వివరాలు గొప్యంగా ఉంచబడునని ఏ. రవికుమార్ ఎసిపి( బెల్లంపల్లి) తెలియజేసినారు, నకిలీ పత్తి విత్తనాలను అమ్ముతున్న సరఫరా చేస్తున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ముఠాను నకిలీ పత్తి విత్తనాలతో సహా ఎంతో చాకచక్యంగా పట్టుకున్న శశిధర్ రెడ్డి సీఐ మందమర్రి, ఏ. ఆంజనేయులు దేవపూర్ ఎస్సై, హెడ్ కానిస్టేబుల్ పున్నం చంద్, కా నిస్టేబుల్స్ సంపత్, రాకేష్, మహేష్, సమ్మయ్య, సురేంధర్, షఫీ, రవి, తిరుపతి, మధు, హెూంగార్డ్స్ తిరుపతి, రమేష్, చంద్ర మోహన్ లను ఎసిపి( బెల్లంపల్లి ) అభినందించారు.

# ఢిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిని కలిసిన సుడా చైర్మన్



కరీంనగర్, మార్చి 26(భారత శక్తి):ఢిల్లీలో ఏఐసిసి ప్రధాన కార్యదర్శి, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ ను బుధవారం ఆమె నివాసంలో సుడా చైర్మన్, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు.తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి జిల్లా కాంగ్రెస్, నగర కాంగ్రెస్ అధ్యక్షులతో ఢిల్లీలో భేటీ అయ్యారు. ఈ భేటీలో పలు అంశాలపై ఏఐసిసి ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ చర్చించారు. ఇందులో భాగంగా ఢిల్లీలో నిజామాబాద్ డిసిసి అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, నిజామాబాద్ సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కేశ వేణు తో కలిసి మీనాక్షి నటరాజన్ తో భేటీ అయ్యారు.

# ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి క్యాంప్ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

## -20 మందికి రూ. 5.25 లక్షల మేరకు లబ్ధి

ఖమ్మం బ్యూరో, భారత శక్తి, మార్చి 26: ప్రైవేట్, కార్పొరేట్ హాస్పిటళ్లలో అత్యవసర వైద్య చికిత్స పొందిన పేదలకు ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి సిఫారసుతో ముఖ్యమంత్రి సహాయ నిధి ( సీఎంఆర్ఎఫ్) చెక్కులు మంజూరయ్యాయి. ఈ మేరకు బుధవారం నగరంలోని గట్టయ్య సెంటర్ లో గల ఎంపీ క్యాంప్ కార్యాలయంలో వైరా, మధిర నియోజకవర్గాలకు చెందిన 20 మందికి చెక్కులను కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్, టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సభ్యులు, నాయకులు అందజేశారు. రూ. 5.25 లక్షల మేరకు లబ్ధి చేకూరింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఎంపీ గారు ప్రత్యేక చొరవతో వేగంగా చెక్కులు మంజూరు చేయిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సర్కార్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సభ్యులు ఉమ్మినేని కృష్ణ, ఇమామ్ భాయ్, ఓబీసీ కార్పొరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు హారికా నాయుడు, నాయకులు స్ఫూర్తి ఓం రాధాకృష్ణ, కన్నెబోయిన సీతారామయ్య, ఖమ్మం పాటి రమేష్,



కృష్ణారెడ్డి, ఒంటికొమ్ము శ్రీనివాసరెడ్డి, ఉత్తేజ్ నాయక్, తాళ్లూరి రాము, తిరుమలి రెడ్డి, చింతమల్ల గురుమూర్తి, ఎయిర్టెల్ నరసింహారావు, జింగిపల్లి ప్రసాద్, మొగిలిచర్ల సైదులు, మందడపు నాగేశ్వరరావు, భాగం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సమస్యల పరిష్కారం కోసం 28న నిరసన దీక్ష:బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి



కరీంనగర్, మార్చి 26(భారత శక్తి):కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని , అందుకే రైతాంగ సమస్యల పరిష్కారం కోరుతూ బిజెపి ఆధ్వర్యంలో ఈ నెల 28 న కరీంనగర్లోని కలెక్టరేట్ వద్ద రెండు గంటల నిరసన దీక్ష నిర్వహిస్తున్నామని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం నగరంలోని బిజెపి జిల్లా కార్యాలయంలో కిసాన్ మోర్చా నాయకులు, ఉమ్మడి జిల్లా ముఖ్య నేతల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎలాంటి చిత్తశుద్ధి లేదన్నారు. ప్రధానంగా రుణమాఫీ విషయంలో ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలకు, వాస్తవ పరిస్థితులకు పొంతన లేకుండా పోయిందని, నేటికీ జిల్లాలో వేలాది మంది రైతులు రుణమాఫీ కోసం రైతులు కాళ్ళ అరిగేలా సంబంధిత కార్యాలయాలు అధికారుల చుట్టూ తిరుగుతున్నారని ఆరోపించారు. రైతు భరోసా విషయంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతాంగాన్ని గోసపెడుతుందన్నారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని , రైతు రుణమాఫీ, రైతు భరోసా అంశాలలో రైతాంగానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నిరసన దీక్ష కార్యక్రమం జరుగుతుందన్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ అధికారంలో రావడానికి ఎన్నో మాయమాటలు చెప్పి , అడ్డదారిలో అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రధానంగా ఆరూ గ్యారంటీలు, 420 హామీలు, అడ్డగోలు వాగ్దానాలతో ప్రజలను నయవంచన గురి చేసిందన్నారు. అన్నం పెట్టే రైతన్నను కూడా తీవ్రంగా మోసం చేసిందన్నారు. రుణమాఫీ పై అనేక ఆంక్షలు , కొర్రిలు, నిబంధనలు పెట్టి రైతాంగాన్ని ఏడిపిస్తుందన్నారు. సాక్షాత్తు అసెంబ్లీ వేదికగా వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రెండు లక్షల పై రుణం ఉన్నవారికి, రుణమాఫీ వర్తించదని ప్రకటన చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో అందరికీ రుణమాఫీ చేస్తామని, నేడు కొందరికే రుణమాఫీ చేస్తూ రైతులను కాంగ్రెస్ సర్కార్ నట్టేట మోసం చేసిందని ఆయన ఈ సందర్భంగా మండిపడ్డారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుగ్గిలపు రమేష్, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి , జగిత్యాల జిల్లా అధ్యక్షులు యాదగిరి , మాజీ ఎంపీపీ వాసాల రమేష్, పార్లమెంటు కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు , కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి, నాయకులు కరివేద మహిపాల్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

## టీయూడబ్ల్యూజే (ఐజేయు) జాతీయ నాయకులు దాసరి కృష్ణారెడ్డి

ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)మార్చి26: జర్నలిస్టుల సమస్యల సాధన కోసం టియుడబ్ల్యూజే (ఐజేయు) పక్షాన పోరాటం కొనసాగిస్తామని ఐజేయు సీనియర్ జాతీయ నాయకులు దాసరి కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు గడ్డం రాజిరెడ్డి అధ్యక్షతన జిల్లా యూనియన్ నూతన సభ్యత్వాల నమోదు కార్యక్రమం లాంచనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన దాసరి కృష్ణారెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి ముందుండి పోరాటం సాగిస్తున్న సంఘం టియుడబ్ల్యూజే మాత్రమే నని అన్నారు. ఆరు దశాబ్దాల యూనియన్ చరిత్రలో అక్రిడిటేషన్ లు, హెల్త్ కార్డులు, ఇండ్ల స్థలాలు సాధించి పెట్టడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో వరంగల్ నగరంతో సహా మండల కేంద్రాలలో జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు,ఇండ్లు సాధించేందుకు పోరాడుతామన్నారు. రాష్ట్రంలో వివిధ కారణాలతో మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలను ఆదుకునేందుకు కృషి చేయడం జరుగుతుందని చెప్పారు. భవిష్యత్తులో కూడా జర్నలిస్టుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ సమస్యల సాధనకై జర్నలిస్టులకు అండగా టీయూడబ్ల్యూజే నిలుస్తుందని, అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, హెల్త్ కార్డుల జారి, ఇతర సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకుపోయి అమలుపరిచేలా చర్యలు తీసుకుంటామన్నారు. టీయూడబ్ల్యూజే ( ఐజేయు) యూనియన్ కు మరే యూనియన్ సాటి రాదని గుర్తుచేసిన ఆయన దశాబ్దాల చరిత్ర ఉన్న యూనియన్ పై జర్నలిస్టులకు ఎంతో విశ్వాసం ఉందని వారి విశ్వాసానికి అనుగుణంగా జర్నలిస్టు బాధ్యులుగా పనిచేస్తామన్నారు. ఈ



సందర్భంగా త్వరితగతిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్, వెల్ఫేర్ కన్వీనర్ వల్లాల వెంకటరమణ, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపల్లి మధు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంకనాల సంతోష్,పెండెం వేణు మాధవరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్,జిల్లా కోశాధికారి బచ్చు పురుషోత్తం, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు వేముల నాగరాజు, బొల్లారపు సదయ్య, జాతీయ కౌన్సిల్ సభ్యులు వల్లాల బుచ్చి రెడ్డి, జిల్లా నాయకులు డాక్టర్ పొడిశెట్టి విష్ణు వర్ధన్, వరప్రసాద్, ఎంఏ. నయీం, గన్ను సంతోష్, పులికంటి రాజేందర్, ముదిగిరి ఓదెలు, అల్లె రామారావు, ఖాదర్ పాషా, ఎం. రాజేంద్ర ప్రసాద్, రాంమోహన్, బి. శ్రీహరి రాజు, కిరణ్ రెడ్డి, దామోదర్, ఎండి ఉస్మాన్ పాషా, తాండూరి గోపి తదితరులు పాల్గొన్నారు.

# మాల్ ప్రాక్టీస్ కు తావివ్వకుండా పదవతరగతి పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలి : జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, మార్చి 26: మాల్ ప్రాక్టీస్ కు తావివ్వకుండా పదవతరగతి పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. బుధవారం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దేవుని పల్లి కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పలు తరగతి గదులను, చీఫ్ సూపరింటెండెంట్ గదులను పరిశీలించారు. అనంతరం చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటు అధికారులతో మాట్లాడుతూ, పరీక్ష సమయానికి ముందే విద్యార్థులను నిశిత పరిశీలన చేసి కేంద్రం లోనికి పంపించాలని, మాల్ ప్రాక్టీస్ కు పాల్పడకుండా పరిశీలించాలని తెలిపారు.

కేంద్రంలో త్రాగునీరు, టాయిలెట్స్, మెడికల్ సదుపాయాలు, రవాణా వంటి వాటిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ సూపరింటెండెంట్ వెంకటరమణ, డిపార్టుమెంటు అధికారిని మేరీ వర్ధనం, కామారెడ్డి తహసీల్దార్ జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

# కెసిఆర్ చరిత్ర చెబితేనే బిఆర్ఎస్ నేతలు ఉలికి పడుతున్నారు!

## కేంద్ర మంత్రి బండి అన్నదాంట్లో తప్పేముంది

## బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ డిప్యూటీ మేయర్ రమేష్



కరీంనగర్, మార్చి 26(భారత శక్తి):చరిత్ర తెలిసిన వాళ్లకు కేసీఆర్ అసలు బాగోతం ఏంటో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదని , కేంద్రమంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు చరిత్రలో ఉన్నవే, మాట్లాడుకున్నవే నని , బిఆర్ఎస్ నేతలు వాళ్ల జాతిపిత , ఉద్యమ నేత కెసిఆర్ గురించి వాస్తవాలు తెలియకపోతే తెలుసుకోవాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు , మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిలపు రమేష్ హితవు పలికారు.. బుధవారం నగరంలోని బిజెపి జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశంలో రమేష్ మాట్లాడుతూ కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ఇటీవల కెసిఆర్ గురించి చేసిన వ్యాఖ్యల్లో తప్పేములేదనీ, కెసిఆర్ చరిత్ర గురించి చెబితే గులాబి నేతలు ఉలిక్కి పడుతున్నారని, వాస్తవాలను జీర్ణించుకోలేక అవాకులు చేవాకులు పేలుతున్నారని ఘాటుగా విమర్శించారు. కేసీఆర్ అసలు చరిత్ర లో దొంగ నోట్ల అంశంలో, కేంద్రమంత్రిగా పని చేసినప్పుడు సహారా స్కాం, ఈఎస్ఐ స్కాం లలో ఆయన పేరు ప్రధానంగా వినిపించిందని, పత్రికల్లో కథనాలు వచ్చాయని, ఈచరిత్ర గురించి కరీంనగర్ బిఆర్ఎస్ నేతలకు తెలియకపోతే తెలుసుకుంటే మంచిదన్నారు.

అసలు కరీంనగర్ బిఆర్ఎస్ అధ్యక్షుడు కి కనీస రాజకీయ పరిజ్ఞానం లేదని పేర్కొన్నారు. చల్ల హరిశంకర్ ప్రజా క్షేత్రంలో నుంచి వచ్చిన నాయకుడు కాదని, ఏ ఎన్నికల్లో కూడా పోటీ చేసిన చరిత్ర లేదని, ఓ నామినేటెడ్ పొలిటిషన్ అన్నారు. అయితే కరీంనగర్ పార్లమెంటు నుండి రెండుసార్లు గెలుపొంది, కేంద్ర మంత్రి అయిన బండి సంజయ్ కుమార్ గురించి మాట్లాడే అర్హత, స్థాయి కాదన్నారు.

బిఆర్ఎస్ నగర అధ్యక్షుడు హరి శంకర్ పరిధికి మించి మాట్లాడుతున్నారని, నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడితే మంచిదనీ హెచ్చరించారు. ఈ సమావేశంలో బిజెపి నాయకులు , మాజీ ఎంపీపీ వాసాల రమేష్, తాజా మాజీ కార్పొరేటర్ కాసర్ల ఆనంద్, వంగల పవన్, బండ రమణారెడ్డి , నరహరి లక్ష్మారెడ్డి, బండారి గాయత్రీ దేవి, శ్రీనివాస్ , తణుకు సాయి , న్యాలకొండ ప్రసన్న రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అట్రాసిటీ కేసుల్లో బాధితులకు న్యాయం అందించాలి


## విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, మార్చి 26(భారత శక్తి): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు వీలైనంత త్వరగా న్యాయం అందించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. కేసుల నమోదు, పురోగతి, బాధితులకు చెల్లించాల్సిన పరిహారం తదితర అంశాలపై జిల్లాస్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం జరిగింది. షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో నమోదైన అట్రాసిటీ కేసులు, పరిష్కరించిన కేసులు, బాధితులకు అందిన పరిహారం గురించి కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో కేసు పూర్వాపరాలను పరిశీలించి బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగే విధంగా అధికారులు చర్య తీసుకోవాలని అన్నారు. కేసుల్లో భాగంగా అవసరమైన కుల ధ్రువీకరణ పత్రం వీలైనంత త్వరగా జారీ చేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మానిటరింగ్ కమిటీ సభ్యులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. చింతకుంట లోని అంబేద్కర్ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని, భగత్ నగర్లో కేటాయించిన స్థలానికి ప్రహరీ గోడ నిర్మించాలని సభ్యులు కోరారు. కోర్టు చౌరస్తాలో గల అంబేద్కర్ విగ్రహం కూడలి శుభ్రంగా ఉంచాలని కోరారు. ఈ అంశాలను వెంటనే పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ అధికారులు ఆదేశించారు. డబుల్ బెడ్



రూమ్ ఇండ్ల కేటాయింపులో ఎస్సీ ఎస్టీలకు ప్రాధాన్యత ఇవ్వాలని కమిటీ సభ్యులకు కోరగా ప్రభుత్వానికి నివేదిస్తామని కలెక్టర్ తెలిపారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ అట్రాసిటీ కేసుల విషయంలో త్వరిత గతిన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఎఫ్ఐఆర్, చార్జిషీట్, పరిష్కారం అయిన కేసులు, విచారణలో ఉన్న కేసులకు సంబంధించిన వివరాలను సంవత్సరం వారీగా వెల్లడించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు, ఆర్డీవో మహేష్, డిటిడిఓ జనార్ధన్, బీఎండబ్ల్యూ పవన్ కుమార్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ అనిల్ ప్రకాష్, ఏసిపి వెంకటస్వామి పాల్గొన్నారు.

# పోస్టల్ ద్వారా మీ ఇంటి వద్దకే భద్రాచలం శ్రీరాములోరి తలంబ్రాలు ప్రసాదం: పోస్టల్ ఎస్పి ఎల్ వి మురళి కుమార్



సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, మార్చి 26 :శ్రీరామ నవమి సందర్భంగా భద్రాచలంలోని శ్రీ సీతా రాముల వారి కళ్యాణోత్సవ తలంబ్రాలను తపాలా శాఖ ద్వారా భక్తులకు అందించే సేవలను ప్రారంభించినట్లు సంగారెడ్డి డివిజన్ పోస్టల్ ఎస్పీ ఎల్ వి మురళి కుమార్ తెలిపారు. భద్రాచలం వెళ్లలేని భక్తుల సౌకర్యార్థం ఈ సేవలను రాష్ట్ర దేవాదాయ శాఖతో ఒప్పందం చేసుకొని ముందుకు తీసుకు వచ్చామని పేర్కొన్నారు.

స్పీడ్ పోస్ట్ ద్వారా అంతరాలయ అర్చన కళ్యాణ తలంబ్రాలు 10 గ్రాములు, ఒక ముత్యం, పసుపు ,కుంకుమ, మిస్రి, ఖాజు, 80 గ్రాముల ప్రసాదం కోసం భక్తులు తమ దగ్గరలోని పోస్ట్ ఆఫీస్ కి వెళ్లి 450/- రూపాయలు చెల్లించి బుక్ చేసుకోవచ్చని తెలిపారు.

అలాగే ముత్యాల తలంబ్రాల 20 గ్రాములు , ఒక ముత్యం ప్రసాదం కోసం 150/- రూపాయలు చెల్లించి సేవలు పొందవచ్చని పేర్కొన్నారు. తెలంగాణ పోస్టల్ సర్కిల్ ఆధ్వర్యంలో సంగారెడ్డి డివిజన్ పరిధిలో కూడా ఏప్రిల్ 1వ తేదీ వరకు ఈ సేవలు అన్ని పోస్ట్ ఆఫీస్ లలో అందుబాటులో ఉంటాయని వివరించారు. ఈ అవకాశాన్ని భక్తులుసద్వినియోగపరుచుకొని , భద్రాచలం శ్రీ రాములోరి ఆశీస్సులు పొందాలని సంగారెడ్డి పోస్టల్ ఎస్పి ఎల్ వి మురళి కుమార్ సూచించారు.

# అర్హులైన నిరుపేద లబ్ధిదారుల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు మార్కవుట్ ఇవ్వాలి : జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, మార్చి 26: అర్హులైన నిరుపేద లబ్ధిదారుల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు మార్కవుట్ ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో గృహ నిర్మాణం, పంచాయతీ రాజ్, విద్యుత్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు అర్హులైన నిరుపేద లబ్ధిదారుల జాబితాల ప్రతిపాదనల మేరకు మంజూరు ఉత్తర్వులు జారీచేయడం జరిగిందని, అట్టి నిర్మాణాలకు సిద్ధంగా ఉన్న లబ్ధిదారులకు మార్క్ అవుట్ ఇవ్వాలని ఆదేశించడం జరిగిందని తెలిపారు. ఇండ్ల నిర్మాణాలను త్వరగా చేపట్టాలని, బేస్ మెట్ వరకు ఇంటి నిర్మాణాలు జరిగిన వాటి వివరాలు యాప్ లో అప్ లోడ్ చేయాలని, అట్టి వాటికి ప్రభుత్వం నుండి లక్ష రూపాయలు మొదటి విడతలో ప్రభుత్వం నుండి నిధులు లబ్ధిదారునికి విడుదల చేయడం జరుగుతుందని తెలిపారు. ఇంకనూ ప్రారంభించని ఇండ్లను త్వరగా నిర్మాణాలు చేపట్టాలని తెలిపారు. లబ్ధిదారులను నిర్మాణాలకు ప్రోత్సహించాలని సూచించారు. ఇందిరమ్మ డేమో ఇళ్లను త్వరగా నిర్మాణాలు పూర్తిచేయాలని తెలిపారు. మండలాల వారీగా ఇంటి నిర్మాణాలపై పంచయటీకార్యదర్శులు, ఎంపీడీఓ లతో సమీక్షించారు. రెండు పడక గదుల నిర్మాణాల కాలనీల్లో నీటి సరఫరా, విద్యుత్ సరఫరా వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఆయా పనులు త్వరగా పూర్తిచేయాలని అన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో చందర్, హౌసింగ్ పి.డి. విజయపల్ రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రావణ్ కుమార్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, పంచాయతీ రాజ్ ఈఈ దుర్గా ప్రసాద్, ఆంజనేయులు, మిషన్ భగీరథ ఇంజనీర్లు, డిప్యూటీ ఈ ఈ లు, ఎంపీడీఓ లు, తదితరులు పాల్గొన్నారు.

# అనుమానమే పెనుభూతమై,కూతురు పట్ల తండ్రి అసభ్య ప్రవర్తన పోక్సో కేసు నమోదు

మందమర్రి టౌన్,మార్చి 26 (భారత శక్తి): అనుమానమే పెనుభూతమై బిడ్డ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన తండ్రి సభ్య సమాజమే తలదించుకునేలా ఉన్నాయి ఈ సంఘటన పట్టణంలోని యాపత్ ప్రాంతంలో మంగళవారం చోటుచేసుకుంది. పట్టణ ఎస్సై ఎస్.రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం ఆకుదారి సతీష్ తన 8వ తరగతి చదువుతున్న 15 ఏళ్ల కూతురిపట్ల అసభ్యంగా ప్రవర్తించాడు, అడ్డుకోబోయిన భార్యను చేతులతో, కర్రతో కొట్టాడు అని బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిన్న రాత్రి మందమర్రి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి, మహిళా పోలీస్ అధికారి చేత బాధితురాలు యొక్క వాంగ్మూలం నమోదు చేశాము.

బుధవారం నిందితుడు అయినా ఆకుదారి సతీష్ (ఆటో డ్రైవర్, పశువుల కాపరి)ను అదుపులోకి తీసుకొని విచారించగా.... నిందితునికి భార్యకు మధ్య గత కొంతకాలంగా గొడవలు జరుగుతున్నవి, నిందితుని పెద్ద కూతురు అయిన బాధితురాలు తనకు పుట్టలేదు అన్న అనుమానంతో ఆమెపై ఎప్పుడు కోపంగా ఉండేవాడు, బుధవారం నాడు ఇంట్లో పోచమ్మ పండుగ చేసుకుందామని బాధితురాలని నిన్న మధ్యాహ్నం హాస్టల్ నుండి తీసుకువచ్చిన తండ్రి ఆ తర్వాత బయటకు వెళ్లి మద్యం తాగి వచ్చి కోపంతో కూతురి బట్టలు చింపి ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో, అడ్డుకోబోయిన నిందితుని భార్య ను కర్రతో కొట్టినాడు. ఇట్టి సంఘటనపై కేసు నమోదు చేసి ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితున్ని జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం కోర్టులో




హాజరు పరచడమైనది. ఆ తర్వాత బాధితురాలని కౌన్సిలింగ్ నిమిత్తం భరోసా సెంటర్ కి పంపించడం జరిగింది.

# జామాయిల్ చెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకోవాలి: బాధితులు జంపాల రవీందర్

ములుగు జిల్లా ప్రతినిధి, మార్చి 26 (భారత శక్తి): భూ సమస్యలపై రెవెన్యూ అధికారులు స్పందించి న్యాయం చేయాలని, జామాయిల్ చెట్లను నరికిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితులు జంపాల రవీందర్ కుటుంబ బాధితులు తెలిపారు. బాధితుడు మాట్లాడుతూ గత 26 సంవత్సరాలుగా సర్వేనెంబర్ 1865/1/ఉ.1865/1ఇ గల భూమి వెంకటాపూర్ శివారు లింగాపూర్ వద్ద ఉంటుంది ఈ భూమిలో 26 సంవత్సరాలుగా కాస్తులుండి ప్రతి సంవత్సరం ఏదో ఒక పంటను తీసుకుంటూ ఉన్నాము మా తల్లిదండ్రులకు కూడా మేము చిన్నతనంలో కూడా వారు ఈ భూమిని తీసుకొని కాస్తు చేసేవారు అలాగే మా కుటుంబంలో అన్నదమ్ములం పెద్దాయన అనంతరం మా భూమిని కాస్తు చేస్తూ అందులో జామాయిల్ మొక్కలు నాటాము కానీ కొందరు దుష్టశక్తులు మా భూమి పై కన్నేసి కబ్జా చేయడానికి పూనుకున్నారు వారికి మాకు గొడవ ఉన్నప్పటికీ మాకు తెలవకుండా మాకు గిట్టని వారు ఆ భూమిని వేరే అతనికి కౌలుకి ఇవ్వడం జరిగింది అతను భూమిలో మొక్కజొన్న వేశారు మేము వద్దు అని చెప్పినప్పటికీ వినిపించుకోకుండా మొక్కజొన్న వేశారు అలాగే జామాయిల్ తోట లో ప్రతి చెట్టును నరికి వేయడం జరిగిందని అన్నారు దాన్ని చూసిన మేము సహించలేక భూమి మీదకి పోవడంతో మాపై గొడవకు వచ్చారు దీని గురించి పోలీస్ స్టేషన్ కు ఫిర్యాదు చేశామని వారు అన్నారు. అలాగే అధికారులు కూడా స్పందించి మాకు తగిన న్యాయం చేయాలని బాధితులు తెలిపారు. వివరణ





కొరకు వెంకటాపూర్ ఎస్సై కి ఫోన్ చేయగా ఫోన్ లిఫ్ట్ చేయలేదు.

# బోనకల్ మండల స్థాయి బాలల పరిరక్షణ కమిటీ ఏర్పాటు



ఖమ్మం బ్యూరో, భారత శక్తి, మార్చి 26: బోనకల్ మండల స్థాయి బాలల పరిరక్షణ కమిటీని బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాలల పరిరక్షణ విభాగము నుండి వచ్చిన అవుట్ రీచ్ వర్కర్ ఎండీ లాల్ బి మాట్లాడుతూ 0-18 సం పిల్లలకు గాను సంబంధించిన అంశములు అనగా బడి బయట పిల్లలు, బాల కార్మికులు, బాల్య వివాహములు, భిక్షాటన దత్తత చట్టపరంగా తీసుకొనుటకు గల నియమ నిబంధనలు అక్రమ దత్తత వల్ల కలిగే చట్టపరమైన చర్యలు గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల తహసిల్దార్ పున్నం చందర్ మాట్లాడుతూ ఎవరైనా తల్లిదండ్రులు వారి పిల్లలకు బాల్య వివాహం జరిపినట్లైతే చట్టప్రకారం శిక్షార్హులు అవుతారని అన్నారు. ఎంపీడీవో రమాదేవి మాట్లాడుతూ పిల్లల హక్కుల భంగం కలగకుండా గ్రామస్థాయిలో ప్రజలలో చైతన్యం తీసుకురావడంలో స్వచ్ఛంద సంస్థలు మరియు అన్ని శాఖల సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కె చందర్ మాట్లాడుతూ గ్రామాన్ని ఒక యూనిట్ గా తీసుకొని ప్రత్యేకించి బాల కార్మికుల విషయంలో మ్యాపింగ్ చేసుకుని పని చేయాలని అన్నారు. కమిటీ మూడు నెలలకు ఒకసారి సమావేశమై గ్రామ స్థాయిలో ఉన్న బాలల సంరక్షణ కమిటీల నుంచి వచ్చినటువంటి పిల్లలకు సంబంధించిన విషయాలపై చర్చించి తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపర్వైజర్ దానయ్య, ఐకెపి ఎపిఎం సురేంద్ర బాబు, పోలీసు డిపార్ట్మెంట్ ఎస్వీ కోటారెడ్డి, స్వచ్ఛంద సంస్థ ఎఫర్ట్ సభ్యులు బోయినపల్లి సురేష్, గురవమ్మ, రాణి, బాలికలు సింధు, లక్ష్మి తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మహిళల పట్ల,బాలల పట్ల వేదింపులకు పాల్పడితే శిక్షలు తప్పవు.

### మహిళా, బాలల పట్ల వేధింపులపై ధైర్యంగా పిర్యాదు చేయాలి.

### పోలీసు భరోసా సెంటర్,షీ టీమ్స్ కార్యాలయాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ నరసంహా



సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) మార్చి 26:వేదింపులకు, దాడులకు గురైన వారికి బరోసా,ధైర్యం కల్పించాలని షీ టీమ్స్, భరోసా సెంటర్స్ ఆద్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని మహిళా, పిల్లల రక్షణా చట్టాలు, శిక్షల గురించి వివరించాలని జిల్లా ఎస్పీ కే నరసింహ భరోసా సెంటర్, షీ టీమ్స్ సిబ్బందిని ఆదేశించారుసూర్యాపేట జిల్లా కేంద్రం లో జాతీయ రహదారి వెంట గల మహిళా భరోసా సెంటర్, షీ టీమ్స్ కార్యాలయాలను జిల్లా ఎస్పీ సందర్శించి కార్యాలయం నంధు నిర్వహిస్తున్న రికార్డ్స్ ను పరిశీలించారు,సిబ్బంది నిర్వహిస్తున్న పనులులు, మహిళల, పిల్లల రక్షణ పట్ల తీసుకుంటున్న చర్యలు,కౌన్సిలింగ్ నిర్వహణ, అవగాహన కార్యక్రమాల నిర్వహణ ను పరిశీలించి సిబ్బందికి సలహాలు సూచనలు అందించారు. భరోసా సెంటర్ సిబ్బంది, షీ టీమ్స్ సిబ్బంది జిల్లాలో పని చేస్తున్న తీరును ఎస్పీ వివరించారు. దాడులకు,వేదింపులకు గురి అవుతున్న బాలల పట్ల, మహిళల పట్ల మానవతా దృక్పదం తో పని చేయాలి, వారికి సామాజిక అభద్రతా భావం ఏర్పడకుండా ధైర్యం కల్పించాలి, ఎప్పటికప్పుడు న్యాయ సహాయం అందించాలి, వైద్యం, మానసిక ధైర్యం కల్పించాలని జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల్లో, పట్టణాలు, కాలనీలలో భద్రత చట్టాల అమలు గురించి, పోలీసు శాఖ తీసుకుంటున్న చర్యల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి, రద్ధి ప్రాంతాల్లో ఆకతాయిలపై నిగా ఉంచాలి, విద్యాసంస్థల్లో కమిటీలు ఏర్పాటు చేయాలి ఎలాంటి సమస్య వచ్చిన, వేదింపులు జరిగిన సమాచారం వచ్చేలా నిఘా ఉంచాలని ఆదేశించారు వేదింపులు, అత్యాచారం, నిరాదరణకు గురైన బాధిత మహిళలకు, పిల్లలకు ఒకే చోట న్యాయపరమైన, వైద్యం పరమైన సదుపాయాలు, సామాజిక భద్రత, నైతిక భద్రత, మానసిక ధైర్యం, అవసరమైన వారికి చదువు ఇలా అన్ని సౌకర్యాలు ఒకే చోట కల్పిస్తూ, బాధితులకు మనోధైర్యం కల్పించే విధంగా రాష్ట్ర పోలీసు మహిళ అండ్ చెల్డ్ వెల్ఫేర్ అధ్వర్యంలో జిల్లా బరోసా సెంటర్ ను ఏర్పాటు చేయడం జరిగినదని జిల్లా ఎస్పీ గారు అన్నారు. బరోసా సెంటర్, షీ టీమ్స్ యొక్క విధి విధానాలు, లక్ష్యాలు, ఉద్దేశం, లైంగిక దాడులకు గురైన మహిళల, బాలల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సంరక్షణ చర్యలు, కల్పించాల్సిన భద్రత మొదలగు అంశాలపై, కళాశాలల్లో విద్యార్ధులకు, సమాజంలో మహిళల భద్రత, రక్షణ చట్టలపై నిర్వహించాల్సిన అవగాహన కార్యక్రమాలు గురించి బారోసా సెంటర్, షీ టీమ్స్ సిబ్బందికి వివరించారు. వేదింపులపై ధైర్యంగా పిర్యాధు చేయాలని కోరారు.

మహిళల, బాలల రక్షణలో చట్టాలు బలోపేతం చేయబడ్డాయి, ఎవరైనా వేదింపులు, లైంగిక దాడులకు పాల్పడితే జైలు శిక్షలు తప్పవు అని హెచ్చరించారు. పిల్లలపై లైంగిక దాడులు పోక్సో చట్టం కేసుల్లో జీవితకాలం శిక్షలు పడుతున్నాయి అన్నారు. సాంకేతికత ఆధారాలతో నాణ్యమైన దర్యాప్తును చేస్తున్నాము, ఫాస్ట్ ట్రాక్ లో మాదిరిగా నేరాల్లో త్వరగా శిక్షలు అమలైయ్యేలా పోలీసు శాఖ పని చేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ బరోసా సెంటర్ ఎస్ ఐ మౌనిక, షీ టీమ్స్ ఎస్సై నీలిమ ఏఎస్ఐ లు సైదాభి, సాలయ్య, బారోసా సెంటర్, షీ టీమ్స్ సిబ్బంది ఉన్నారు.

# నా ఆదాయ మార్గం సినిమానే.. ఆ విషయంలో క్లారిటీ ఇచ్చిన పవన్ కల్యాణ్

: ఒకవైపు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా ప్రజలకు సేవ చేస్తూనే మరోవైపు అంగీకరించిన సినిమాల్లోను నటిస్తున్నారు పవన్ కల్యాణ్ (. అయితే, ఆయన సినీరంగంలో కొనసాగుతారా? వరుస సినిమాలు చేస్తారా? అని అభిమానులు కొన్ని రోజులుగా ఆందోళన చెందుతోన్న విషయం తెలిసిందే. తాజాగా ఈ విషయంపై పవన్ క్లారిటీ ఇచ్చారు. ఓ తమిళ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన సినిమాల గురించి మాట్లాడారు. డబ్బు అవసరం ఉన్నంతవరకూ నటిస్తూనే ఉంటానన్నారు.



# దుర్మార్గుడికి మహా దుర్మార్గుడికీ జరిగే యుద్ధం.. 'లూసిఫర్'



'అనగనగా ఒక రాజ్యంలో ఒక మహారాజు ఉండేవాడు. ఆ రాజుకి పిల్లలు ఉండేవారు. పెద్ద సైన్యమూ ఉండేది. ఆయన్ను పొగడడానికి వందీమాగధులు ఉండేవారు. ఆ మహారాజు ఎంతో మంచి వాడు కావటం వల్ల కొంత మంది దుర్మార్గులు దురాలోచనతో కుట్ర పన్ని ఆయన రాజ్యంలోకి చొరబడ్డారు. అనుకోకుండా మహారాజు చనిపోయాడు. మంచి వాళ్లుగా నటించిన ఆ దుర్మార్గుల చేతుల్లోకి ఆ రాజ్యం వెళ్లిపోయింది. ఆ విధంగా ఆ రాజ్యం రాజును కోల్పోయి రాబందుల రాజ్యం అయింది' ఇదే కథను నేటి రాజకీయ కోణంలో ఆవిష్కరిస్తే అదే 'లూసిఫర్'

%అసలు ఇదీ కథ..

ముఖ్యమంత్రి పీకే రామదాసు అలియాస్ పీకేఆర్ (సచిన్ ఖేడ్కర్) మరణం తర్వాత రాష్ట్రంలో రాజకీయ శూన్యత ఏర్పడుతుంది. తదుపరి సీఎంగా ఎవరిని ఎంపిక చేయాలన్న దానిపై ఐయూఎఫ్ (ఇండియన్ యూనియన్ ఫ్రంట్)లో తర్జనభర్జనలు జరుగుతుంటాయి. పీకే రామదాసు మరణం తర్వాత ఐయూఎఫ్‌ను ముందుకు తీసుకెళ్తానంటూ ఆయన అల్లుడు బిమల్‌నాయుడు అలియాస్ బాబీ (వివేక్ ఒబెరాయ్) ముందుకు వస్తాడు. అందుకు పార్టీలో కీలకనేత అయిన మహేశ్ వర్మ (సాయికుమార్) వత్తాసు పలుకుతాడు. తనకు కావాల్సినట్లు అనుమతులు ఇస్తే, పార్టీకి ఫండింగ్ ఇప్పిస్తానని బాబీ చెబుతాడు. పీకేఆర్‌కు అత్యంత సన్నిహితుడు, ప్రజాదరణ కలిగిన నాయకుడు స్టీఫెన్ గట్టుపల్లి (మోహన్‌లాల్) మాత్రం దీన్ని వ్యతిరేకిస్తాడు. రాష్ట్రంలోకి మాదక ద్రవ్యాలను తీసుకురావొద్దని బాబీని హెచ్చరిస్తాడు. దీంతో పథకం ప్రకారం స్టీఫెన్‌ను బాబీ అరెస్టు చేయిస్తాడు. మరి జైలుకు వెళ్లిన స్టీఫెన్ ఎలా బయటకు వచ్చాడు? బాబీ తీసుకురావాలనుకున్న డ్రగ్స్‌ను రాష్ట్రానికి రాకుండా అడ్డుకున్నది ఎవరు? పీకేఆర్ తర్వాత రాజకీయ వారసుడిగా ఎవరు వచ్చారు? కనుసైగతో అందరినీ శాసించే స్టీఫెన్ గతం ఏంటి? అన్నది చిత్ర కథ!

రాజులేని రాజకీయ చదరంగం..

చదరంగంలో రాజు లేకపోతే ఆట ముగిసినట్టే. ఇక్కడ 'లూసిఫర్'లో రాజు మరణంతోనే ఆట మొదలవుతుంది. సాక్షాత్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి చనిపోతే, ఆ స్థానాన్ని భర్తీ చేసేదెవరు? అన్న ప్రశ్న ప్రతి ఒక్కరిలోనూ ఉత్పన్నమయ్యేది. వాస్తవ సంఘటనల నుంచి స్ఫూర్తి పొంది తీసుకున్న అంశం కావడంతో ప్రతి ఒక్కరూ దానికి కనెక్ట్ అవుతారు. దానినే ఆద్యంత ఆసక్తికరంగా ట్విస్ట్‌లతో మలిచి కథను అందించారు రచయిత మురళీ గోపి. దాన్ని అంతే థ్రిల్లింగ్‌గా తెరపై ఆవిష్కరించారు దర్శకుడు పృథ్వీరాజ్ సుకుమారన్.

పీకేఆర్ మరణం తర్వాత ఆ స్థానంలోకి వచ్చేందుకు బాబీ కుట్రలు పన్నడం, దాన్ని స్టీఫెన్ అడ్డుకోవడం ఇలా ఇద్దరి మధ్య నువ్వా-నేనా అన్నట్లు ఫేస్ ఆఫ్ సన్నివేశాలు సాగుతాయి. సాధారణంగా ఇలాంటి కథల్లో ప్రేక్షకుడు ఆలోచించేది ఖాళీ అయిన ముఖ్యమంత్రి కుర్చీలోకి మన కథానాయకుడు వస్తాడని అనుకుంటారు. కానీ, ఇక్కడే ఊహించని కథను మలుపు తిప్పాడు దర్శకుడు. ప్రజల్లో విపరీతమైన ఆదరణ ఉన్నా స్టీఫెన్‌లో ఎక్కడా కూడా అధికారకాంక్ష కనిపించదు. ఆ క్యారెక్టరైజేషన్, హావభావాలు చాలా భిన్నంగా ఉంటాయి. పాత్ర సెటిల్డ్‌గా ఉంటుంది. అతిగా స్పందించడం, భారీ డైలాగ్‌లు చెప్పడం ఉండదు. కేవలం 'కింగ్ మేకర్'గానే ఆ పాత్రను తీర్చిదిద్దిన విధానం బాగుంటుంది. అనవసరంగా ఉంది అని చెప్పడానికి ఒక్క పాత్ర కూడా ఉండదు. ప్రతిదీ ప్లాట్‌కు కనెక్ట్ అయ్యేలా డిజైన్ చేసుకున్నారు. అది మురళీగోపి మేజిక్.

మాస్ అంశాలు మేళవిస్తూనే..

చదరంగంలో ఉన్నట్లే ఇందులోని ప్రధాన పాత్రలు బలంగా ఉంటాయి. మోహన్‌లాల్ ఇందులో కథానాయకుడు అనడం కన్నా, బలమైన పాత్రధారి అంటే బాగుంటుందేమో. ఎందుకంటే సినిమా మొత్తం ఆయన నిడివి 40-45 నిమిషాలకు మించి ఉండదు. అయినా కూడా ఆయన ఈ పాత్ర తాలూకా ప్రభావం సినిమా మొత్తం ఉంటుంది. కనిపించేది తక్కువే అయినా ఆ కాసేపు స్క్రీన్ దదదదలాడేలా సీన్స్ ఉంటాయి. అడవిలో రౌడీలతో ఫైట్ సీన్, 'దుర్మార్గుడికి మహా దుర్మార్గుడికీ జరిగే యుద్ధం ఇది' అంటూ బాబీకి వార్నింగ్ ఇచ్చే సీన్, జైలులో ఉండి ఒక్క ఫోన్‌కాల్‌తో బాబీ డీల్‌ను నాశనం చేయడం తదితర సన్నివేశాలతో హీరో పాత్రలోని మాస్ కోణాన్ని మరింత ఎలివేట్ చేశాడు దర్శకుడు. ఇక జతిన్ రామదాస్ పాత్ర ఇచ్చే ట్విస్ట్, సభను ఉద్దేశించి అతడు చేసే ప్రసంగం ప్రేక్షకులతో విజిల్స్ వేయిస్తుంది. క్లైమాక్స్‌లో స్టీఫెన్ ఎవరో చెబుతూ సాగే సన్నివేశాలే ఇప్పుడు 'ఎల్2: ఎంపురాన్'పై మరింత ఆసక్తిని పెంచాయి.

కాసుల వర్షం

మలయాళంలో అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మించిన సినిమాల్లో 'లూసిఫర్' ఒకటి. రూ.30 కోట్లతో తీస్తే, రూ.125 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. అత్యధిక కలెక్షన్లు రాబట్టిన, ఎనిమిదో మలయాళ చిత్రంగా రికార్డు సృష్టించింది. తెలుగులో చిరంజీవి కథానాయకుడిగా మోహన్‌రాజా దర్శకత్వంలో 'గాడ్ ఫాదర్' పేరుతో రీమేక్ చేశారు. వివేక్ ఒబెరాయ్‌కు వినీత్ డబ్బింగ్ చెప్పగా, బెస్ట్ డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా కేరళ స్టేట్ అవార్డు వరించింది.

ఏ ఓటీటీలో ఉంది

'లూసిఫర్' ప్రస్తుతం మలయాళ, తెలుగు, తమిళ భాషల్లో అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా అందుబాటులో ఉంది. హిందీ వెర్షన్ 'సోనీలివ్'లో స్ట్రీమింగ్ అవుతోంది. చిరంజీవి నటించిన తెలుగు రీమేక్ వెర్షన్ 'గాడ్‌ఫాదర్'ను నెట్‌ఫ్లిక్స్‌లో చూడవచ్చు.

# ఉగాది శక్తి

%ఉగాది అనగానే అందరికీ గుర్తుకొచ్చేది పచ్చడే. షడ్రుచుల సమాహారంతో సుఖదుఃఖాలను సమానంగా తీసుకోవాలని అన్యాపదేశంగా సూచించే ఇది కాలాలకు అనుగుణంగా ఆరోగ్య సంరక్షణకూ తోడ్పడుతుంది. వసంతకాలంలో ఒకింత తగ్గే బలం పుంజుకునేలా, జబ్బులను ఎదుర్కొనేలా శరీరాన్ని తీర్చిదిద్దుతుంది. ఉగాది పండుగ నాడు సంప్రదాయంగా పచ్చడిని తింటుంటాం గానీ దీని ఆరోగ్య ప్రయోజనాల గురించి పెద్దగా తెలియదనే చెప్పుకోవాలి. ఇందులో వాడే దినుసులన్నీ ఔషధ గుణాలతో నిండినవే మరి. త్వరలో ఉగాది రానున్న నేపథ్యంలో వీటి గొప్పతనం, ప్రయోజనాలను తెలుసుకుందాం. పండుగ నాడే కాదు నిత్య జీవితంలోనూ వాడుకునే తీరును అవగతం చేసుకుందాం.

ఆయుర్వేదం సంవత్సరాన్ని మూడేసి రుతువుల చొప్పున ఆదాన, విసర్గ కాలాలుగా విభజిస్తుంది. ఆదాన కాలంలో (శిశిర, వసంత, గ్రీష్మ రుతువుల్లో) సూర్యుడు ప్రబలంగా ఉండి, జీవుల నుంచి బలాన్ని లాక్కుంటాడు. అదే విసర్గ కాలంలో (వర్ష, శరత్, హేమంత రుతువుల్లో) చంద్రుడు బలాన్ని ప్రసాదిస్తాడు. ఉగాది ఆదాన కాలంలోనే వస్తుంది. సాధారణంగా మనిషిలో బలం వసంత, శరద్ రుతువుల్లో మధ్యమంగా ఉంటుంది. అందువల్ల బలాన్ని పెంపొందించుకోవాల్సి ఉంటుంది. మరో ముఖ్యమైన విషయం రుతు సంధిలో ఉగాది రావటం. ముందు రుతువులో చివరి 7 రోజులు, తర్వాతి రుతువులో తొలి 7 రోజులను రుతు సంధి అంటారు. ఈ సమయంలో ఆహార, విహార మార్పులతో ఆయా రుతువుల ప్రభావాలను తట్టుకునేలా శరీరాన్ని సన్నద్ధం చేయాలనీ ఆయుర్వేదం సూచిస్తుంది. ఆహారంలో షడ్రుచులూ ఉండేలా చూసుకుంటే బలం పుంజుకుంటుంది. ఇక్కడే ఉగాది పచ్చడి ప్రాధాన్యం సంతరించుకుంటోంది. మధుర, ఆమ్ల, లవణ, కటు, తిక్త, కషాయ రసాలతో కూడిన ఇది శరీరం బలంగా, మనసు ఉల్లాసంగా ఉండటానికి తోడ్పడుతుంది.

ఆరు దినుసులు ఆరు రుచులు

అన్ని ద్రవ్యాలూ పంచ భూతాలతో ఏర్పడినవేనని శాస్త్రం చెబుతుంది. షడ్రుచులు కూడా వీటి కలయికతో పుట్టుకొచ్చినవే. ఆయుర్వేదంలో ఆహార నియమాలన్నీ వీటి మీదే ఆధారపడి ఉంటాయి. ప్రతి రుచీ శరీరం మీద, మనసు మీద ప్రత్యేక ప్రభావం చూపుతుంది. సాధారణంగా వీటిని వేర్వేరుగా తీసుకుంటుంటాం. కానీ ఉగాది పచ్చడిలో ఈ అన్ని రుచులూ కలిసి ఉండటం గొప్ప విషయం. బెల్లం, చింతపండు, ఉప్పు, మిరప లేదా మిరియాలు, వేప పువ్వు, మామిడికాయ అన్నీ తీపి, పులుపు, ఉప్పు, కారం, చేదు, వగరు రుచులను కలిగిస్తాయి. ఇవన్నీ ఔషధ గుణాలతో ఆరోగ్యాన్ని కాపాడుకోవటానికి తోడ్పడుతుండటం విశేషం. ఇవి విడివిడిగానూ ఆరోగ్య ప్రదాయకంగా, గృహ వైద్యంగానూ ఉపయోగపడతాయి.

వేప పువ్వు చేదు

ఔషధ గుణాల విషయంలో వేప పువ్వు ఒక్కటే కాదు.. వేప ఆకు, పండ్లు, బెరడు అన్నీ దాదాపు సమానమే. అందువల్ల వేప గుణాలను సమగ్రంగానే పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. చలువ చేసే గుణం ఉండటం వల్ల ఎండకాలంలో బాగా మేలు చేస్తుంది. శరీరంలో ఉండే ఇన్‌ఫెక్షన్లు, కడుపులో నులి పురుగులను పోగొడుతుంది. మలినాలను బయటకు వెళ్లగొట్టి, రక్తాన్ని శుద్ధి చేస్తుంది. వేప పువ్వు రుతు సంధిలో తగ్గే జీర్ణశక్తిని పెంపొందిస్తుంది. వేప ఆకు వేసి, కాచిన నీటితో స్నానం చేస్తే చర్మ వ్యాధులు ఉపశమిస్తాయి. తలలో పేలు, చుండ్రు, మొటిమల వంటి సమస్యలు తగ్గుతాయి. వేప గాలిని పీల్చినా అలసట తగ్గుతుంది. వేడి నీటిలో వేప ఆకు వేసి ఆవిరి పట్టినా, కషాయం చేసుకొని తాగినా జలుబు, జ్వరం ఉపశమిస్తాయి. ఒళ్లు అదరటమూ తగ్గుతుంది.

వేప పువ్వులు, పండ్లు పొట్ట ఉబ్బరం, మొలల వ్యాధిని తగ్గిస్తాయి. పువ్వును కాసేపు వేడి నీటిలో వేసి, వడగట్టి తాగితే నులి పురుగులు పోతాయి.

పచ్చి మామిడి వగరు

వగరు లేదా కషాయ రుచిని కలిగించే మామిడి కాయను అపక్వ ఆమ్రం అనీ అంటారు. ఇది మనసుకు ఉల్లాసం కలిగిస్తుంది. మూడ్ బాగా లేనప్పుడు, ఉత్సాహం లోపించినప్పుడు ఓ మామిడి ముక్కను చప్పరిస్తే వెంటనే హుషారు కలుగుతుంది. రక్తాన్ని శుద్ధి చేసి, మాంసాన్ని పెంచుతుంది. బలంగా తయారయ్యేలా చేస్తుంది. విటమిన్ సి దండిగా ఉండటం వల్ల చర్మం ఆరోగ్యంగా ఉండటానికి, రోగనిరోధక శక్తి పుంజుకోవటానికీ తోడ్పడుతుంది. అరుచిని పోగొట్టటం దీని ప్రత్యేకత. మామూలుగా ఎప్పుడైనా మూత్రం ఎక్కువగా వస్తుంటే ఒకట్రెండు మామిడి ముక్కలు తింటే ఉపశమనం కలుగుతుంది. గొంతు సమస్యలనూ తగ్గిస్తుంది. అయితే పచ్చి మామిడిని మితంగానే తీసుకోవాలి. మరీ ఎక్కువగా తింటే రక్త, పిత్త దోషాలను ప్రేరేపిస్తుంది. విరేచనాలు, ముక్కు నుంచి రక్తం కారటం వంటి సమస్యలకు దారితీస్తుంది.

జ్వరం వచ్చే ముందో, తగ్గాకో.. లేదూ ఎక్కడికైనా వెళ్లి వచ్చాక వికారంగా, రుచి తగ్గినట్టు అనిపిస్తే పచ్చిమామిడిని తింటే నోటి హితవు కలుగుతుంది.

చింతపండు పులుపు

దీనిలోని పులుపు రుచి జీర్ణ మండలాన్ని ఉత్తేజితం చేస్తుంది. ఫలితంగా ఆకలి, జీర్ణశక్తి మెరుగవుతాయి. కొత్త చింతపండులో కన్నా పాత చింతపండులో ఔషధ గుణాలు ఎక్కువ. కొత్త చింతపండు కళ్లె పడటం, అలర్జీలు, సైనసైటిస్, మోకాళ్ల నొప్పుల వంటి కఫ, వాత వ్యాధులు ఉద్రిక్తమయ్యేలా చేస్తుంది. అదే పాత చింతపండైతే వీటిని తగ్గిస్తుంది. రక్త, మాంసాలను వృద్ధి చేస్తుంది. మూత్రాశయాన్ని శుద్ధి చేయటం మరో ప్రత్యేకత. ఇలా మూత్రం నిల్వ ఉండకుండా చేయటం ద్వారా కిడ్నీ రాళ్లు ఏర్పడటాన్ని నివారిస్తుంది. మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. మూడ్‌ను మెరుగు పరుస్తుంది.

అయితే దీన్ని ఎక్కువగా తీసుకోవద్దు. అతిగా తింటే కడుపులో, ఛాతీలో మంట పుట్టొచ్చు. చర్మ సమస్యలు తలెత్తొచ్చు.

చింతపండు, మిరియాలు కలిపి తీసుకుంటే అలర్జీలు, జలుబు వంటి కఫ వ్యాధులు తగ్గుతాయి. చింతపండు రసంలో కొద్దిగా నెయ్యి కలిపి తీసుకుంటే మోకాళ్ల నొప్పుల వంటి

వాత వ్యాధులు ఉపశమిస్తాయి.

కారం ఘాటు

ఉగాది పచ్చడిలో కొన్నిచోట్ల ఎండు కారం, పచ్చి మిరప కలిపితే కొన్నిచోట్ల మిరియాల పొడి వేస్తారు. ఏవైనా కారం రుచిని కలిగించేవే. ఈ రుచి ఆకలిని, జీర్ణశక్తిని పెంచుతుంది. రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. నొప్పిని తగ్గించే గుణమూ ఉంటుంది. ఆయుర్వేదంలో కారం కన్నా మిరియాల ప్రస్తావనే ఎక్కువ. వీటికి వేడి చేసే గుణముంది. ముందు రుతువులో పెరిగిన కఫ, వాత దోషాలను



సరి చేస్తాయి. జలుబు, దగ్గు తగ్గిస్తాయి. దంత వ్యాధుల్లో వాడే దశన సంస్కార చూర్ణంలో మిరియాలే ప్రధానం. దీంతో పళ్లు తోముకుంటే చిగుళ్ల లాగటం, నొప్పి తగ్గుముఖం పడతాయి. మిరియం గింజకు సన్నటి సూదిని గుచ్చి, దీపం మీద వేడి చేస్తూ వచ్చే పొగను కాస్త దూరం నుంచి పీల్చితే ముక్కు దిబ్బడ తగ్గుతుంది.

పేను కొరుకుడు గలవారు మిరియాలను అరగదీసి గానీ మిరియాల పొడికి కాస్త వేడి నీళ్లు కలిపి గంధంలా చేసి గానీ రాస్తే ఉపశమనం లభిస్తుంది.

ఉప్పు లవణం

వంటలకు రుచిని చేకూర్చే ఉప్పు శరీరంలో నీటి పరిమాణాన్ని పెంచుతుంది. ఇలా అవసరమైన తేమను ఇస్తుంది. కండరాలకు సత్తువ ఇవ్వటంతో పాటు ఉల్లాసాన్ని కలిగిస్తుంది. అయితే అతిగా వాడొద్దు. ఉప్పును ఎక్కువెక్కువగా అధిక కాలం తింటే జుట్టు తెల్లబడటం, రాలటం, చర్మం ముడతలు పడటం వంటి వృద్ధాప్య ఛాయలు త్వరగా ముంచుకొస్తాయి. కిడ్నీల పనితీరు దెబ్బతింటుంది. రక్తపోటు ఎక్కువవుతుంది. అలాగని అసలే వాడకపోవటమూ తగదు. మోతాదుకు మించకుండా తీసుకోవాలి. ఆయుర్వేదం లవణాలను సైంధవ, బిడా (విడా), సౌవర్చల, సాముద్ర, రోమక రకాలుగా పేర్కొంటుంది. మనం ఇంట్లో వాడేది సాముద్ర లవణం.

లవణాల్లో సైంధవ లవణం ఉత్తమమైందని శాస్త్రం చెబుతోంది. వైద్యంలో దీన్నే వాడు తుంటారు. థైరాయిడ్ గ్రంథి సరిగా పనిచేయని వారికిది మేలు చేస్తుంది.

బెల్లం తీపి

ఇది తీపిని కలిగిస్తుంది. ఈ రుచి శరీరానికి చలువ చేస్తుంది. మంచి బలాన్నిస్తుంది. మనసునూ ఆహ్లాదంగా ఉంచుతుంది. ఆయుర్వేదం బెల్లంతో పాటు దీనికి మూలమైన చెరుకుకూ ప్రాధాన్యమిస్తుంది. పౌండ్రిక, వంశిక, శతపర్వ, కాంతార, నైపాళ, దీర్ఘపత్రక, నీలపీర, కాష్టేక్షు, సూచీ పత్రిక, తాపసేక్షు, కేశ క్రూర, భీరుక.. ఇలా 12 చెరుకు రకాలను శాస్త్రం పేర్కొంటుంది. వీటిల్లో పౌండ్రక చెరుకు రసం నుంచి చేసిన బెల్లం ఉత్కృష్టమైంది. ఇందులో ఔషధ గుణాలు ఎక్కువ. వైద్యంలో దీన్నే వాడుతుంటారు.

కొత్త బెల్లం కన్నా పాత బెల్లంలో ఔషధ గుణాలు ఎక్కువ. గుండెకు మంచిది. రక్తాన్ని శుద్ధి చేస్తుంది. కిడ్నీ పనితీరును మెరుగు పరుస్తుంది. కళ్లు, కడుపు, కాళ్ల మంటలనూ తగ్గిస్తుంది.

బెల్లంతో శృంగార సామర్థ్యం పెరుగుతుంది. నెయ్యి, పాత బెల్లంతో చేసిన సున్నుండలైతే ఇంకా ఎక్కువ ఉద్దీపన శక్తినిస్తాయి.

మహిళల్లో రుతుస్రావ సమస్యలనూ బెల్లం తగ్గిస్తుంది. పాత రోజుల్లో రజస్వల అయిన అమ్మాయిలకు పాత బెల్లం, నువ్వులతో చేసిన ఉండలు ఇస్తుండేవారు. ఇవి హార్మోన్లను సరిచేసి, కటి భాగానికి మంచి బలాన్నిస్తాయి. వీటిని ఇప్పుడు వాడుకున్నా మంచిదే.

బెల్లం రక్తహీనతనూ తగ్గిస్తుంది. వేరుశనగ పప్పు, బెల్లంతో చేసిన చిక్కీలతో ఐరన్ మాత్రల కన్నా ఎక్కువ ఫలితం కనిపిస్తున్నట్టు అధ్యయనాల్లోనూ వెల్లడైంది.

మాలిన్యాలతో కూడిన బెల్లం (అధౌత) తింటే నీరసం, నులి పురుగులు, మలబద్ధకం తలెత్తుతాయి. అదే మాలిన్యాలను తొలగించిన బెల్లం (ధౌత) ఔషధ గుణాలు కలిగుంటుంది. మలబద్ధకాన్ని తగ్గిస్తుంది.

నిమ్మకాయ రసం నీటిలో పాత బెల్లం, కొద్దిగా జిలకర పొడి, ఉప్పు కలిపి తీసుకుంటే జ్వరం వచ్చాక కలిగే నీరసం త్వరగా తగ్గుతుంది.

కరక్కాయ పొడి, పాత బెల్లం సమాన మోతాదుల్లో తీసుకొని ముద్దగా చేసుకొని చప్పరిస్తే కాలేయం, ప్లీహ వ్యాధులు తగ్గుతాయి. రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

బెల్లాన్ని అతిగా తీసుకుంటే బరువు పెరిగే ప్రమాదముంది. మధుమేహం గలవారు దీన్ని తీసుకుంటుంటే గ్లూకోజు మోతాదులను గమనించుకోవాలి.

నిజానికి చెరుకును పళ్లతో నమిలి తినటం శ్రేష్టమని శాస్త్రం పేర్కొంటుంది. ఇది శృంగార సామర్థ్యం ఇనుమడించటానికి తోడ్పడుతుంది. అయితే చెరుకు గడ అడుగు భాగం నులి పురుగులకు దారితీస్తుంది. కణుపులతో పాటు తీసిన రసం మోకాళ్ల నొప్పులను పెంచుతుంది. నిమ్మకాయ, అల్లం రసం కలిపితే కొంతవరకు ఈ చెడు గుణం తగ్గించుకోవచ్చు.

# మధుమేహులూ.. పాదాలు జాగ్రత్త

**తొలిదశలో చర్మం ఎర్రగా అవుతుంది. వేడి, వాపు ఉండొచ్చు. కొందరికి చర్మంలో చీమలు పాకుతున్నట్టు, పొడుస్తున్నట్టు, అక్కడక్కడా మొద్దుబారినట్టు అనిపించొచ్చు. చాలామంది వీటిని పెద్దగా పట్టించుకోరు. క్రమంగా పుండుగా మారుతుంది. చర్మం గీసుకోకపోయినా, దెబ్బలు తగలకపోయినా దానంతటదే పుండు పడొచ్చు కూడా. కొందరిలో ఇది ఇన్‌ఫెక్షన్‌కు దారితీయొచ్చు. దీంతో చీముపట్టి, కుళ్లిపోయి 'గ్యాంగ్రీన్' తలెత్తొచ్చు. అందువల్ల మధుమేహ పుండ్లను నిర్లక్ష్యం చేయొద్దు. తొలిదశలోనే గుర్తించి, జాగ్రత్త పడటం మంచిది.**

మధుమేహం శరీరంలోని అన్ని అవయవాల మీద విపరీత ప్రభావం చూపుతుంది. కళ్ల దగ్గరి నుంచి పాదాల వరకూ అన్నింటినీ దెబ్బతీస్తుంది. చాలామందిలో పాదాల మీద పుండ్లు ఏర్పడటం గమనిస్తుంటాం. ఇవి ఒక పట్టాన మానకుండా వేధిస్తుంటాయి. వీటి మూలంగా మనదేశంలో ఏటా సుమారు లక్ష మందికి వేళ్లు, పాదాలు, కాళ్లు తొలగించాల్సి వస్తోందని అంచనా. రోజురోజుకీ మధుమేహం పెరిగిపోతున్న నేపథ్యంలో ఇలాంటి వారి సంఖ్య మరింత పెరిగే ప్రమాదముండటం ఆందోళనకరం.

మధుమేహం గలవారిలో సుమారు 15-20% మందికి పాదాల మీద పుండ్లు ఏర్పడే ముప్పు పొంచి ఉంటుంది. చాలామంది వీటిని నిర్లక్ష్యం చేయటం, పుండ్లు పెద్దగా అయ్యేంతవరకూ డాక్టర్‌ను సంప్రదించకపోవటం పెద్ద సమస్య. దీంతో పుండ్లకు చికిత్స చేయటం కష్టమవుతుంది. పాదాలు తొలగించాల్సిన పరిస్థితికి



దారితీస్తోంది. మిగతా దేశాలతో పోలిస్తే ఇలాంటి దుస్థితి మనదగ్గరే ఎక్కువ కావటం గమనార్హం. ఒకసారి వేలో, పాదమో తొలగించినంత మాత్రాన సమస్య ఆగిపోవటం లేదు. చాలామందికి మరోసారి తొలగించాల్సిన అవసరం మూడు రెట్లు పెరుగుతుండటం కలవరం కలిగిస్తోంది. మధుమేహం పుండ్లు మొదట్లోనే మానినవారితో పోలిస్తే వేళ్లు, పాదాలు తొలగించినవారిలో అన్ని కారణాలతో మరణించే ముప్పు ఎక్కువగానే ఉంటోంది. గమనించాల్సిన విషయం ఏంటంటే- తొలిదశలోనే పుండ్లను గుర్తించి, తగు చికిత్స తీసుకుంటే వేళ్లు, పాదాలు తొలగించటాన్ని చాలావరకూ నివారించుకునే వీలుండటం.

కారణాలేంటి?

మధుమేహం నియంత్రణలో లేకపోతే రక్తనాళాలు, నాడులు దెబ్బతినే ప్రమాదముంది. పాదాల పుండ్లకు ఇవే ప్రధాన కారణాలు. గుండె నుంచి పాదాలు దూరంగా ఉంటాయి. శరీర బరువును మోస్తుంటాయి కాబట్టి వీటిపై నిరంతరం భారం పడుతుంది కూడా. రక్తంలో గ్లూకోజు దీర్ఘకాలంగా ఎక్కువగా ఉండటం వల్ల క్రమంగా రక్తనాళాల లోపలి మార్గం సన్నబడుతుంది (ఎథెరోస్క్లెరోసిస్). దీంతో కాళ్లకు రక్తం సరఫరా తగ్గి పుండ్లు, ఇన్‌ఫెక్షన్ల ముప్పు పెరుగుతుంది. ఇవి త్వరగా మానవు కూడా. నాడులు దెబ్బతినటం (పెరిఫెరల్ న్యూరోపతీ) వల్ల స్పర్శజ్ఞానం తగ్గుతుంది. నొప్పీ తెలియదు. దీంతో పాదాలకు గాయాలైనా వెంటనే గుర్తించలేరు. చెప్పులో, షూలో రాయి ఉన్నా రోజంతా అలాగే తిరగొచ్చు. పుండు పడినా తెలియకపోవచ్చు. గుర్తించేసరికే ఇన్‌ఫెక్షన్ తలెత్తొచ్చు. పెద్ద పుండుగా మారొచ్చు. పొగ తాగటం, మద్యం అలవాటు కూడా తోడైతే మరింత ప్రమాదం పొంచి ఉన్నట్టే. ఈ అలవాట్లు గలవారికి ఎప్పుడో వచ్చే పాదాల సమస్యలు ఇప్పుడే మొదలవ్వచ్చు. పాదాల అవకరాలు, కొన్నిచోట్ల ఒత్తిడి అధికంగా పడటం వంటివీ పుండ్లకు దారితీయొచ్చు.

చిన్నగా మొదలై..

తొలిదశలో చర్మం ఎర్రగా అవుతుంది. వేడి, వాపు ఉండొచ్చు. కొందరికి చర్మంలో చీమలు పాకుతున్నట్టు, పొడుస్తున్నట్టు, అక్కడక్కడా మొద్దుబారినట్టు అనిపించొచ్చు. చాలామంది వీటిని పెద్దగా పట్టించుకోరు. క్రమంగా పుండుగా మారుతుంది. చర్మం గీసుకోకపోయినా, దెబ్బలు తగలకపోయినా దానంతటదే పుండు పడొచ్చు కూడా. కొందరిలో ఇది ఇన్‌ఫెక్షన్‌కు దారితీయొచ్చు. దీంతో చీముపట్టి, కుళ్లిపోయి 'గ్యాంగ్రీన్' తలెత్తొచ్చు. అందువల్ల మధుమేహ పుండ్లను నిర్లక్ష్యం చేయొద్దు. తొలిదశలోనే గుర్తించి, జాగ్రత్త పడటం మంచిది.

నివారణ ముఖ్యం

రక్తంలో గ్లూకోజును కచ్చితంగా నియంత్రణలో ఉంచుకోవటం, కొన్ని జాగ్రత్తలు తీసుకోవటం ద్వారా పుండ్లను చాలావరకూ నివారించుకోవచ్చు.

పాదాలను శ్రద్ధగా గమనించటం ముఖ్యం. చేత్తో అన్ని వైపుల నుంచీ తాకుతూ గీసుకోవటం, చర్మం లేచిపోవటం వంటివేవైనా ఉన్నాయో చూసుకోవాలి. పాదాల అడుగు భాగాన్ని అద్దంలో చూసుకుంటే బాగా కనిపిస్తుంది. లేదూ ఇంట్లో వాళ్లనయినా చూడమని చెప్పాలి.

పాదాలను రోజూ శుభ్రంగా కడుక్కొని, తడి లేకుండా తుడుచుకోవాలి.

ఇంట్లో కూడా చెప్పులు వేసుకునే నడవాలి. సాక్స్ ధరిస్తే ఇంకా మంచిది.

కుర్చీలో కూర్చున్నప్పుడు పాదాలు ఎత్తు మీద పెట్టుకోవటం, వేళ్లను కదిలిస్తుండటం మంచిది.

క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తే పాదాలకు రక్తం బాగా అందుతుంది.

గోళ్లు కత్తిరించుకోవటానికి బ్లేడుకు బదులు నెయిల్ కట్టర్ వాడాలి. పూర్తిగా అంచుల వరకు కాకుండా కొంత వదిలేసి గోళ్లు కత్తిరించుకోవాలి.

ఆనెలు, గుల్లల వంటివి కనిపిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. ఇష్టం వచ్చినట్టు కోయొద్దు. సూదితో పొడవొద్దు.

పొగ అలవాటుంటే వెంటనే మానెయ్యాలి.

తాత్సారం పనికిరాదు

పాదాల మీద చర్మం రంగు మారటం.. మడమలు, పాదాలు ఉబ్బటం, పాదాలు వేడిగా అనిపించటం.. చురుకుగా పొడుస్తున్నట్టు నొప్పి, మంట పుట్టటం.. వేళ్ల మధ్య ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు తలెత్తటం.. మడమలు పొడిబారి, పగలటం.. వేలి గోళ్లు లోపలి వైపునకు పెరగటం వంటివి గమనిస్తే నిర్లక్ష్యం చేయరాదు. వెంటనే డాక్టర్‌ను కలిసి, తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

తొలగించాల్సి రావటం

ఇన్‌ఫెక్షన్లు అదుపులోకి రాకపోవటం, పుండ్లు లేదా గాయాలు ఎంతకీ మానకపోవటం వల్ల వేళ్లు, పాదాలు తొలగించాల్సిన పరిస్థితి తలెత్తుతుంది. ఎందుకంటే రక్తనాళాలు దెబ్బతినటం వల్ల రక్తం, దీంతో పాటు ఆక్సిజన్ వంటి పోషకాలు, యాంటీబయాటిక్ మందులు పుండు పడ్డ చోటుకు అంతగా వెళ్లవు. సమస్య విషమించి వేళ్లు, పాదాలు తొలగించాల్సిన పరిస్థితి తలెత్తుతుంది. ఇది మున్ముందు సెల్యులైటిస్, ఫేషియైటిస్ వంటి సమస్యలకూ కారణం కావొచ్చు. దీంతో మరిన్ని ఎక్కువసార్లు వేళ్లు, పాదాలు తొలగించాల్సి రావొచ్చు.

# వృద్ధులకు ఇంటి భద్రత

పెద్ద ప్రమాదాలే కానక్కర్లేదు. దుప్పటి కాళ్లకు తగిలి పడటం, తడి గచ్చు మీద జారటం వంటి చిన్న చిన్న ప్రమాదాలతోనూ వృద్ధులకు ఎముక విరగొచ్చు. ఇది తీవ్ర సమస్యలకూ దారితీయొచ్చు, దీర్ఘకాలం వైకల్యానికి గురి చేయొచ్చు. కింద పడిపోయే ముప్పు వయసుతో పాటు పెరుగుతూ వస్తుండటం గమనార్హం. 65 ఏళ్లు, అంతకన్నా ఎక్కువ వయసువారిలో ఏటా ప్రతి నలుగురిలో ఒకరు కింద పడుతున్నారని అంచనా. అయితే దీన్ని చాలావరకూ నివారించుకోవచ్చు. ఇంట్లో కొద్దిపాటి మార్పులు, జాగ్రత్తలు తీసుకోవటం ఎంతో మేలు చేస్తాయి.

ఇంట్లో అడ్డంకులు లేకుండా చూడటం

వృద్ధులు కింద పడితే తీవ్ర గాయాలకు దారితీసే ప్రమాదముంది. కాబట్టి కాళ్లకు అడ్డుపడే వస్తువులేవీ లేకుండా చూసుకోవాలి. ఆటబొమ్మల వంటివి చిందర వందరగా పడేయొద్దు. టేబుళ్లు, కుర్చీలను ఒక పక్కకు సర్దాలి. తివాచీల అంచులు పైకి లేవకుండా టేపుతో అంటించాలి.

బాత్రూమ్ సురక్షితం




వృద్ధులు గాయాల పాలయ్యే చోట్లలో అతి ముఖ్యమైంది బాత్రూమ్. చాలామంది కూర్చుంటున్నప్పుడో, లేస్తున్నప్పుడో కింద పడుతుంటారు. చేత్తో పట్టుకోవటానికి గోడలకు రాడ్లు, బార్స్ బిగిస్తే దీన్ని నివారించు కోవచ్చు. అనువైన టాయ్‌లెట్ సీట్లను అమర్చాలి. జారిపోని మ్యాట్లను వాడుకోవాలి.

హ్యాండ్‌రెయిల్స్, ర్యాంప్‌లు

వృద్ధులు ఇంట్లో తేలికగా కదలటానికి హ్యాండ్‌రెయిల్స్ బిగించాలి. చక్రాల కుర్చీ వాడుతున్నట్టయితే ర్యాంప్‌లు ఏర్పాటు చేయాలి. ముఖ్యంగా వీధి గుమ్మం, బాత్రూమ్ గడపల వద్ద వీటిని ఏర్పాటు చేస్తే సులభంగా వెళ్లి రావటానికి వీలుంటుంది.

వంటగది అనువుగా

ముఖ్యమైన వస్తువులను వృద్ధులకు అందుబాటులో ఉండే చోట్ల పెట్టాలి. వంటగదిని వాడుకోవటానికి అనువుగా సిద్ధం చేయాలి. డబ్బాలు, సీసాల మీద కాగితం అటించి వంట సామగ్రి పేర్లు రాయాలి. లోపల ఎప్పుడూ లైటు వేసి ఉంచాలి. కింద అడ్డంకులేవీ లేకుండా చూసుకోవాలి.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed at Sri Muktheswara Publications, D.No. 10-1-70/A, Lingojiguda, Opp. H.P Gas Agency, Karmanghat, Saroornagar ,RangaReddy( Dist.), Hyderabad - 500035, Telangana .Published at Plot No.43,Flat No.210,Raja Rjeswari APTS,HUDA Complex,Saroornagar,Ranga Reddy(Dist),Hyderabad.500035, Telangana
Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy